దసరా ప్రత్యేక సంచిక

శ్రీః

ఓం గం ఓం గణపతయే నమః

ఆత్మజ్యోతి

ప్రధాన సంపాదకులు : స్వామి అరుళానంద

విజయదశమి

శుభాకాంక్షలు

ది. 22-10-2015

ప్రకాశకులు
అరుళానంద పబ్లికేషన్స్
అరుళానందట్రస్ట్ - శ్రీ లలితానందాశ్రమము
వాడరేవు, చీరాల - 523157, ప్రకాశం జిల్లా, ☎ 08594 - 248237

ఆత్మజ్యోతి

సంపుటి - 12 సంచిక -12 1 అక్టోబర్ 2015

విషయసూచిక

		పుట సంఖ్య
శ్రీ మహాగణపతిస్తోత్రమ్		3
అర్గళాస్తోత్రమ్		4
శ్రీసుబ్రహ్మణ్య స్తోత్రమ్	- శ్రీ కుమారతంత్రము నుండి	6
శ్రీ భగవద్గీతాభాష్యార్కప్రకాశికానువాదము		7
స్వామివారి సందేశం	- స్వామి అరుణానంద	10
మూలికలు	- స్వామి అరుణానంద	12
ఆశ్రమ వార్తలు		14
Sri Aravinda Sarith Sagara	*- Dr. Prema Nandakumar*	18
శ్రీకృష్ణచరితము	- డా॥ గాలి గుణశేఖర్	23
శ్రీ పరశమ్భుమహిమ్నఃస్తోత్రమ్	- వ్యాఖ్యాత - దోర్బల విశ్వనాథశర్మ	25
ఆనందసాగరస్తవః	- వ్యాఖ్యాత - డా॥ ఈ.వి.యస్.మూర్తి	30
బ్రహ్మసూత్రాలు	- వ్యాఖ్యాత - మేళ్ళచెర్వు వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రి	32
ద్వాదశస్తోత్రమ్	- శ్రీమధ్వాచార్యులు	36
అశ్వధాటీకావ్యమ్ - కలిదూషణము - వాసుదేవభజనము	- వ్యాఖ్యాత - గరిమెళ్ళ సోమయాజులుశర్మ	37
శ్రీరామానుజాచార్యకృత శ్రీరంగగద్యం	- వ్యాఖ్యాత - డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు	40
శ్రీవిష్ణుపాదాదికేశాంత స్తోత్రమ్	- వ్యాఖ్యాత - డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు	49
ఆదిత్య హృదయము - ఖలకర్ణవిషాయణము		52
వరదరాజస్తవః	- వ్యాఖ్యాత - డా॥ కె.లక్ష్మీనారాయణ	54
ఆకలి ఎరగని చదువు	- వ్యాఖ్యాత - డా॥ పాపినేని శివశంకర్	56
కమలాకుచ చూచుక.... - అర్థ విశేషాలు	-డా॥ తాడేపల్లి పతంజలి	58
మహాభారతం - మానవస్వభావచిత్రణ	- డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య	62
ఏమిసేతురా లింగా ఏమిసేతురా	-డా॥ తాడేపల్లి పతంజలి	64
ఆంధ్రనాయకశతకసౌందర్యము	- డా॥ కె. గిరిజాలక్ష్మి	69
శిశుపాలన	- డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి	71
శ్రీభ్రమరాంబా మల్లికార్జున దేవాలయం - శ్రీశైలం	- గబ్బిట దుర్గాప్రసాద్	74
విదురనీతిసారము	- మొవ్వ వృషాద్రిపతి	83
తారాశశాంకం	- డా॥ చింతలపూడి వేంకటేశ్వరు	86
బాలల భాగవతకథలు	- డా॥ కె. ప్రభాకర్ రెడ్డి	89
శ్రీ సుదర్శనాష్టకమ్	- శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు	91
వేమన తాత్త్వికత - సందేశము	- వ్యాఖ్యాత - డా॥ వై.భానుభవాని	94
తిక్కన కీచకవధ	- డా॥ చింతలపూడి వేంకటేశ్వర్లు	97
యోగసూత్రాలు	- వ్యాఖ్యాత - చింతగుంట సుబ్బారావు	100
వేదాన్తముక్తావళ్యంతర్గతా 'ప్రశ్నోపనిషత్'	- శ్రీ బెల్లంకొండరామరాయవిరచితమ్	102
ఉమాకల్యాణము	- వ్యాఖ్యాత - రామోరా	104
నమక చమకాలు - తెలుగు టీక	-డా॥ తాడేపల్లి పతంజలి	106
కుపుత్రుడు	- మల్లాది హనుమంతరావు	110
Gold Nuggets - ఆణిముత్యాలు	*- Osho* / సౌభాగ్య	111
Osho- Difficulties		113
గ్రంథపరిచయము - శ్రీ హనుమచ్చరితామృతము	- ప్రతాప శాయి	114
శివప్రదోష స్తోత్రమ్		116

RNI : New Delhi, APTEL 08725/01/12004-TC Rc.No.: C3 1789/2004

ఇందు ప్రచురించబడిన వ్యాసములందలి అభిప్రాయములు ఆయా రచయితలవే

D.T.P. by ***SANJAY GRAPHICS***, Chirala. 9966156263 Printed at : ***SOWMYA OFFSET***, Chirala, 9848088156

ఓం గం ఓం గణపతయే నమః

శ్రీ మహాగణపతి స్తోత్రమ్

శ్రీ వినాయక స్తోత్రమ్

శ్లో॥ సదా బాలరూపాపి విఘ్నాద్రిహన్త్రీ
మహాదన్తివక్త్రాపి పంచాస్యమాన్యా ।
విధీన్ద్రాదిమృగ్యా గణేశాభిధామే
విధత్తాం శ్రియం కాపి కల్యాణమూర్తిః ॥

విజయదశమి శుభాకాంక్షలు

अर्गलास्तोत्रम्

जयन्ती मङ्गला काली

जय त्वं देवि चामुण्डे जय भूतापहारिणि ।
जय सर्वगते देवि कालरात्रि नमोऽस्तु ते ॥१॥

जयन्ती मङ्गला काली भद्रकाली कपालिनी ।
दुर्गा शिवा क्षमा धात्री स्वाहा स्वधा नमोऽस्तु ते ॥२॥

मधुकैटभविध्वंसि विधातृवरदे नमः ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥३॥

महिषासुरनिर्नाशि भक्तानां सुखदे नमः ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥४॥

धूम्रनेत्रवधे देवि धर्मकामार्थदायिनि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥५॥

रक्तबीजवधे देवि चण्डमुण्डविनाशिनि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥६॥

निशुम्भशुम्भनिर्नाशि त्रैलोक्यशुभदे नमः ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥७॥

वन्दिताङ्घ्रियुगे देवि सर्वसौभाग्यदायिनि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥८॥

अचिन्त्यरूपचरिते सर्वशत्रुविनाशिनि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥९॥

नतेभ्यः सर्वदा भक्त्या चापर्णे दुरितापहे ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१०॥

स्तुवद्भ्यो भक्तिपूर्वं त्वां चण्डिके व्याधिनाशिनि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥११॥

चण्डिके सततं युद्धे जयन्ति पापनाशिनि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१२॥

देहि सौभाग्यमारोग्यं देहि देवि परं सुखम् ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१३॥

विधेहि देवि कल्याणं विधेहि विपुलां श्रियम् ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१४॥

विधेहि द्विषतां नाशं विधेहि बलमुच्चकैः ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१५॥

सुरासुरशिरोरत्ननिघृष्टचरणेऽम्बिके ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१६॥

विद्यावन्तं यशस्वन्तं लक्ष्मीवन्तञ्च मां कुरु ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१७॥

देवि प्रचण्डदोर्दण्डदैत्यदर्पनिषूदिनि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१८॥

प्रचण्डदैत्यदर्पघ्ने चण्डिके प्रणताय मे ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥१९॥

चतुर्भुजे चतुर्वक्त्रसंस्तुते परमेश्वरि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥२०॥

कृष्णेन संस्तुते देवि शश्वद्भक्त्या सदाम्बिके ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥२१॥

हिमाचलसुतानाथसंस्तुते परमेश्वरि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥२२॥

इन्द्राणीपतिसद्भावपूजिते परमेश्वरि ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥२३॥

देवि भक्तजनोद्दामदत्तानन्दोदयेऽम्बिके ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥२४॥

भार्यां मनोरमां देहि मनोवृत्तानुसारिणीम् ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥२५॥

तारिणि दुर्गसंसारसागरस्याचलोद्भवे ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥२६॥

इदं स्तोत्रं पठित्वा तु महास्तोत्रपठेन्नरः ।
रूपं देहि जयं देहि यशो देहि द्विषो जहि ॥ ॥२७॥ ✦

శ్రీ సుబ్రహ్మణ్య స్తోత్రమ్

శ్లో॥ న జానామి శబ్దం న జానామి చార్థం
న జానామి పద్యం న జానామి గద్యమ్ ।
చిదేకా షడాస్యా హృది ద్యోతతే మే
ముఖాన్నిఃసరన్తే గిరశ్చాపి చిత్రమ్ ॥

శ్రీ భగవద్గీతా భాష్యార్క ప్రకాశికానువాదము

'శ్రీమద్భగవద్గీత'కు అపరశంకర బిరుదాంకితుడగు 'శ్రీబెల్లంకొండ రామరాయకవి' రచించిన 'భాష్యార్క ప్రకాశికా' భాష్యము పరమప్రామాణికమైనదిగా పెక్కుఱుచే పేర్కొనబడినది. దీనికి *1956*లో బ్రహ్మశ్రీ మల్లావజ్ఝల వేంకటసుబ్బరామశాస్త్రిగారు ఆంధ్రానువాద మందించగా, దానిని బ్రహ్మశ్రీ కవితా సుబ్రహ్మణ్యం గారు అచ్చొత్తించి పలు గ్రంథాలయము లందు ఆంధ్రదేశమంతటా నిక్షిప్తము గావించి అఖండమైన మేలొనరించిరి. అలభ్యమగు అద్దానిని నేడు 'ఆత్మజ్యోతి పాఠకులకు' అందించుచున్నందుకు అమందానందమొందుచున్నాను.

ఇటీవలే పుస్తకరూపం సంతరించుకొన్నది. కావలసినవారు సంప్రదించగలరు. ఫోన్ : *9440115411*. వెల : రూ. *600/-*

(18) – రామోరా

ద్వితీయాధ్యాయము

శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతుర్భూర్మా తే సఙ్గోఽ స్త్వకర్మణి ॥ 47

అ॥ **"బ్రాహ్మణో నిర్వేదమాయాత్" "బ్రాహ్మణః ప్రవ్రజేత్"** అను శ్రుతి ప్రమాణముల వలన బ్రాహ్మణునకే సంన్యాసాశ్రమమునం దధికార ముండుటచే, "కర్మణ్యేవ" అను ఏవకారమువలన **క్షత్రియుడగు అర్జునునకు జ్ఞాననిష్ఠయం దధికారము లేదని** యర్థమగుచున్నది. యద్వా మూలమునందలి "తే" అను పదమునకు వివేకవైరాగ్యాది గుణములు లేని నీకు అని యర్థము. కావున వివేకాది రహితుడవగు నీకు సంన్యాసమునం దధికారము లేనందున, సర్వకర్మ సంన్యాసపూర్వకమగు జ్ఞాననిష్ఠయం దధికారము లేదని భావము.

కర్మఫలములయందు కోరిక స్వప్నాద్యవస్థలయందును నీకు లేకుండుగాక అని ద్వితీయపాదమున కర్థము.

మా ఫలేషు కదాచన అను "ద్వితీయపాదముచే" మా కర్మఫలహేతుర్భూః అను తృతీయపాదమునకు పౌనరుక్త్యదోషమును శంకింపరాదు. "ఫలేషు" అను నపుడు స్వర్గాది ఫలములయం దని యర్థము. "కర్మఫలహేతుః" అనునపుడు కర్మఫలమగు జన్మమునకు కారణుడని యర్థము. **(అనగా కర్మఫలశబ్దమునకు జన్మయని యర్థము)** కావున నీకు స్వర్గాదిఫలములయందు

కోరికయున్నచో స్వర్గఫలమును అనుభవించుటకు నీకు జన్మయుండును. గనుక **నీవు ఫలహేతువు, జన్మహేతువున్ను కాకుము** అని చెప్పుటకు రెండు వాక్యములు ఆవశ్యకమయినందున పౌనరుక్త్యము లేదు.

కర్మఫలహేతుత్వమనగా కర్మఫలరూపమగు జన్మము ననుభవించుట. ఫలములయం దధికార మనగా ఫలవిషయకమగు స్పృహ యని భేదము. కర్మఫలమునందు కోరిక లేనిచో దుఃఖరూపమగు కర్మతో నేమి ప్రయోజనమను శంకకు సమాధానమును చెప్పుచున్నారు. **"మా తే సంగోఽ స్త్వకర్మణి"** అను నాల్గవ పాదముచే కర్మశబ్దము క్రియయందును (అనగా చేయుట అను నర్థమునందును) యజ్ఞాది కర్మల యందును ప్రసిద్ధమగుటచే నిచట "అకర్మణి" అనగా చేయకుండుట అను నర్థమును గ్రహింపవలయును.

ఫలేచ్ఛను విడచి నీవు కర్మలనే యాచరింపవలయును గాని కర్మసంన్యాసమును జేయు నధికారము నీకు లేదని శ్లోకమునకు ఫలితార్థము. ఇచట **రామానుజులు** కర్మఫల పదమునకు క్షున్నివృత్త్యాదికము (ఆకలి దప్పికలను దీర్చుకొనుట) అని యర్థమును జెప్పి, అందుకు నీవు కారణుడవు గా వను అనుసంధానముతో నుండవలయునని చెప్పిరి. ఇయ్యది తుచ్ఛము, భోజనాది కర్మలు కర్మలుగావు. ఆకలి దప్పికలను దీర్చుకొనుట కర్మఫలమున్ను గాదు.

ఏ శాస్త్రమున్నూ భోజనాదికర్మలయం దెవనిని నియమించుట లేదు. అట్లున్నచో నిచట శ్రీకృష్ణుడు గూడ నర్జునుని 'నీకు భోజనాది కర్మలయందే అధికార' మని నియమించి యుండెడివాడు.

రాత్రిపూట భుజించుట, ఉపవాసమును జేయుట, మున్నగునవి నిత్యనైమిత్తి కాది కర్మల కంగములేగాని వాటియందు వేరుగా విధిలేదు.

మరియు క్షున్నివృత్త్యాదికము (ఆకలి దప్పికలను దీర్చుకొనుట) కర్మఫల మగుచో భోక్తకు దానియందు సంగమెట్లు లేకుండును? యజ్ఞాదికర్మలకు ఫలమగు స్వర్గాదికము కాలాంతరమునందు కలుగునది గాన, దానియందలి సంగము పురుషునిచే విడువశక్య మగును. మరియు స్వర్గాదిఫలములను కోరక యజ్ఞాదికర్మలు చేయనలవియగునుగాని, క్షున్నివృత్తిని కోరక క్షుద్బాధ గలవాడు భోజనాదులయందు ప్రవర్తించు టెట్లు? అయ్యది సంభవమగుచో ఆకలి లేనివానికి గూడ భోజనమునందు ప్రవృత్తి కలుగునుకదా?

మరియు ఆకలిదప్పికలు ప్రాణధర్మము లనియు, భోజనాదులు శరీరధర్మము లనియు, అనుసంధానమును చేయుట జ్ఞాననిష్ఠయే యగును. ఇట్టి యనుసంధానము అవిక్రియాత్మ జ్ఞానమునకు కారణమగుటవలన.

మరియు **రామానుజులు 'కర్మఫలయోః హేతుర్మా భూః'** నీవు కర్మలయందును, ఫలములయందును కారణుడవు కాకుమని చెప్పుటకూడ నుచితముగాదు, 'కర్మణ్యేవాధికారః' అని కర్మహేతుత్వము చెప్పబడినందువలన.

ఇక **వేదాంతదేశికులు** కర్తృత్వాభిమానము లేకుండుటయే కర్మహేతుత్వమని వ్యాఖ్యాన మొనర్చిరి. అదియును అయుక్తమే యగుచున్నది. కర్తృత్వాభిమానము లేనిచో ఫలహేతువు గానేరదు.

ఎవడు నేను కర్తనని యనుసంధానమును చేయుచున్నాడో వాడే ఫలమును అనుసంధానము చేయుచున్నాడు. కర్మకు కారణము కాకున్నచో కర్మయే నుండ నేరదు. ఫలహేతువు కానపుడు, ఫలముయొక్క స్వరూపమెట్లు నిష్పన్నముకాదో అట్లే కర్మహేతువు కానిచో కర్మస్వరూపముకూడ నిష్పన్నము కానేరదు. 47

శ్లో॥ యోగస్థః కురు కర్మాణి సఙ్గం త్యక్త్వా ధనఞ్జయ! ।
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ 48

అ॥ ఓయి యర్జునా! ఫలేచ్ఛను విడచి సిద్ధ్యసిద్ధులయందు సమానుడవుగా నుండు, యోగమునందున్న వాడ వగుచూ కర్మల ననుష్ఠింపుము అని యన్వయము. "ఫలప్రయుక్తేన" అని భాష్యపదము. ఫలాభిసంధిలేనివానిచే నని యర్థము. అథవా ప్రయుక్తశబ్దమునకు ప్రయోగము అర్థము. భావార్థమునందు క్తప్రత్యయము ప్రసక్తమని నిశ్చయార్థము. ఇచట "పుంసా" అని యధ్యాహారము చేసికొనవలయును. పురుషునిచే ఫలప్రసంగముతో కర్మ చేయదగదు. **అనగా వివేకము గలవాడు ఫలమును కోరి కర్మ చేయకూడదని** నిశ్చయార్థము.

"కర్మాణి కురు" (కర్మలను చేయుము) అనుచోట యెందుకొరకు కర్మలను చేయవలయు నను శంక రాగా ఈశ్వరారాధనకొరకు కర్మలను చేయవలెనని సమాధాన మొసగబడినది. ఈశ్వరప్రీతియందును గూడ ఆశ యుండదగదు. అందు ఆశయున్నను ఈశ్వరానుగ్రహము సిద్ధించునా? సిద్ధింపదా? అను సందేహముచే చిత్తచాంచల్యము కలుగును.

"సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా" సిద్ధియనగా జ్ఞానప్రాప్తి, అసిద్ధి యనగా తదప్రాప్తి – యీ రెంటియందును సమానముగా నుండవలెనన్నచో జ్ఞానము ప్రాప్తించినచో అనురాగముగాని జ్ఞానము ప్రాప్తించనిచో ద్వేషముగాని యుండదగ దని భావము.

యోగశబ్దార్థమును భగవంతుడగు శ్రీకృష్ణుడే వివరించియున్నాడు. నాల్గవ పాదముచే **"సమత్వం యోగ ఉచ్యతే"** అని ఇచట శాస్త్రజ్ఞైః అను పదమును అధ్యాహారమును చేసికొని శాస్త్రజ్ఞులచే చెప్పబడుచున్నదని యన్వయించుకొనవలయును.

ఇచట **రామానుజులు:** 'రాజ్యము, బందుగులు, మున్నగువాటి యందు ఆశను విడచి విజయముయొక్క సిద్ధ్యసిద్ధులయందు సమానుడవుగా నుండి కర్మలను ఆచరింపుము' అని చెప్పిరి.

అయ్యది తుచ్ఛము. "మా ఫలేషు కదాచన" అని దానిచేతనే రాజ్యాదిఫలములయం దాశయుండరాదని చెప్పబడుటవలనను, బంధువులు మున్నగువానియందు (స్నేహము) సంగము పనికిరాదని "అశోచ్యాన్" అను శ్లోకము మొదలు "న త్వం శోచితుమర్హసి" అనునంతవరకు నుండు గ్రంథముచే ప్రతిపాదింపబడుట వలనను, ప్రధానఫలముయొక్క సిద్ధ్యసిద్ధులయందు సమత్వము నుపేక్షించి, దానిలో నంతర్భూతమగు విజయముయొక్క సిద్ధ్యసిద్ధులయందు సమత్వమును చెప్పుట అనుచిత మగుట వలనను, ఇంతకు పూర్వ మెచటను ప్రధానఫలముయొక్క సిద్ధ్యసిద్ధులయందు సమత్వమును చెప్పియుండనందు వలనను, "సుఖదుఃఖే సమే కృత్వా" అను శ్లోకమునందు జయాజయసమత్వము చెప్పియుండుట వలనను రామానుజుల భాష్యము అసంగత మగుచున్నది. 48 ✦ .... (సశేషం)

స్వామివారి సందేశము

అమ్మవారికి అభిషేకం చేసి అట్లాగే కూర్చున్న స్వామివారు కామాక్షి అమ్మవారి ధ్యానంలో లీనమయినారు. ఆ ధ్యానంలో ప్రకృతి యొక్క సూక్ష్మాన్ని గ్రహించారు. అమ్మవారు జ్ఞాన స్వరూపముగా ఉండి స్వామివారిని రక్షిస్తున్నట్లుగాను అనుభూతి చెందారు. "శ్రీశైలం కైలాస పర్వతానికి సమం. ఇప్పటికీ ఎంతో మంది సిద్ధ పురుషులు, ఋషులు ఇక్కడ తపస్సు చేసుకుంటూ ఉన్నారు. ఇక్కడ ఎప్పుడూ ఎన్నో అద్భుతాలు జరుగుతూ ఉంటాయి. సామాన్యుల కళ్ళకు అవి కనిపించవు. తపోనిష్ఠలో ఉన్న సిద్ధ పురుషులు, ఋషులు, మునులు అందరినీ అనుగ్రహిస్తూ ఉన్నారు. నేను వారితోటే ఉన్నాను. నీవు కూడా ఇక్కడే ఉండి పరిపూర్ణ ఆనందం పొంది పరబ్రహ్మ స్వరూపం కావాలి. ఆ ఉద్దేశ్యము తోనే మీ గురునాథులు నిన్ను ఇక్కడకు పంపించారు. గత జన్మలో చేసిన ప్రయత్న ఫలితం, నీవు పరిపూర్ణ సిద్ధి పొంది ఏకాంత పరమానందంలో శరీర బంధం నుండి విముక్తి పొంది ప్రశాంతంగా ఉండాలి. ఈ సుఖాన్ని అనుభవించుటకు ఈ కొండ ప్రాంతములో ఉన్న ప్రదేశములకు నీవు వెళ్ళిరావాలి. ఇక్కడ "కదళీవనము" అనే ఒక గుహ ఉన్నది. నీవు అక్కడకు వెళ్ళి మౌనంగా కూర్చో. నేను నిన్ను ఏదో ఒక రూపములో వచ్చి రక్షించుదును. ఈ నదిలో కొంచెం ముందుకు వెళితే ఒక నంది ఉన్నది. ఆ నంది వద్ద కొంచెం లోతులో తామర పూలు ఉన్నవి. అవి తెచ్చి నా ముందు పెట్టమని అమ్మవారు ఆజ్ఞ ఇచ్చినారు. స్వామివారు బయటకు వచ్చి నది వెంబడి కొంచెం దూరం నడిచి వెళ్ళగా పెద్ద నంది ఒకటి కనిపించినది. ఆ నంది వద్ద ఉన్న నీళ్ళు బాగా స్వచ్ఛంగా ఉన్నాయి. స్వామివారు ఆ జలం కొంచెం త్రాగి, నందికి మూడు ప్రదక్షిణలు చేసి కొద్దిగా ముందుకు వెళ్ళగా బాగా లోతులో తామర పుష్పాలు కనిపించినవి. ఒక పెద్ద చెట్టు వేరు పట్టుకుని ధైర్యంగా మెల్లగా దిగి ఐదు పుష్పాలు తీసుకుని పైకి వచ్చి అమ్మవారి పాదముల వద్ద సమర్పించినారు. అప్పుడు ఒక అశరీరవాణి వినిపించినది. "ఇక నీవు కదళీవనం వెళ్ళు. అక్కడ నేను నిన్ను కలుస్తాను" అనే మాటలు వినిపించినవి. కొన్ని రోజులు ఇక్కడే ఉండాలనే సంకల్పంతో వచ్చిన స్వామివారు, అమ్మవారి ఆజ్ఞ ఇట్లా అయినది. సరే కదళీవనం వెళదాం అనే ఆలోచనతో అమ్మవారికి లోపలే ఏడు సార్లు ప్రదక్షిణలు చేసి సాష్టాంగ నమస్కారం చేసి బయలుదేరినారు. తిరుగు ప్రయాణములో స్వామివారికి ముందు రెండు కుక్కలు నడుస్తున్నాయి. అదే దారిలో స్వామివారిని తీసుకు వెళ్ళి ప్రధాన మార్గం సమీపించిన తరువాత ఆ రెండు కుక్కలు వెళ్ళిపోయినవి. అక్కడి నుండి స్వామివారు నేరుగా గుడి వద్దకు వచ్చారు. ప్రధాన అర్చకుని కలిసినారు. తనకు అమ్మవారి ఆజ్ఞ అయినదని, కదళీవనం వెళ్ళాలని తెలిపినారు మరియు నేను ఎట్లా వెళ్ళాలి? ఏదైనా ఏర్పాటు చెయ్యమని ప్రధాన అర్చకుని కోరినారు. ప్రధాన అర్చకులు పాతాళ గంగలో పడవ నడిపే ఒక వ్యక్తిని పిలిచి "స్వామివారు కదళీవనం వెళ్ళాలి. నీవు పడవల తీసుకు

వెళ్ళి కొండ దగ్గర వదలి రమ్మని చెప్పి స్వామివారి చేతిలో పండ్లు, పొంగలి ప్రసాదము, కొంత నగదు ఇచ్చి నమస్కరించి పంపినారు. స్వామివారు పడవలో కూర్చున్నారు. పడవ కదిలింది. పడవ నడిపే వ్యక్తి స్వామివారితో సంభాషణ ప్రారంభించినారు. "ఎన్ని రోజులు కదళీవనములో ఉండాలనే ఉద్దేశ్యము? అక్కడికి వెళ్ళాలంటే షుమారు పది మైళ్ళకు పైగా నడవాలి. ఐదు కొండలు దాటి ఆ ప్రాంతమునకు వెళ్ళాలి. మొదటి సారి ఒక్కళ్ళే వెళ్ళటం కష్టంగా ఉండవచ్చు. అక్కడ జాలరులు ఎవరైనా ఉంటే చూసి మీకు తోడుగా పంపుతాను. మీరు కూడా వాళ్ళతో ఒక మాట చెప్పండి. ఈ వనములో చాలా ఆశ్చర్యకరమైన, అపూర్వమైన, సకల శక్తి కలిగిన మూలికలు ఉన్నవి. ఈ మూలికల గురించి ఇక్కడకు వచ్చే సాధు సంన్యాసులు మాట్లాడుకుంటూ ఉంటారు. సామాన్యుల కళ్ళకు ఇవి అన్నీ కనిపించవని కొందరు చెబుతూ ఉంటారు. ఈ ప్రాంతంలో చాలా నిధులు, వజ్ర వైఢూర్యాలు, నవరత్నాలు ఉన్నవని, వాటికోసం కొందరు సామాన్య ప్రజలు ప్రయత్నాలు చేస్తున్నారని కొందరు పడవ నడిపేవారు కూడా మాట్లాడుకోవటం తెలిసినది. కాని నేను అట్లాంటి వారితో వెళ్ళటం లేదు. ఉదయం స్వామివారిని దర్శనం చేసుకుని ఏదో నా జీవనోపాధి సాగిస్తున్నాను. ఎప్పుడూ గుడి అర్చకస్వామి నన్ను ఏ సహాయము కోరలేదు. ఇదే మొదటిసారి. మీరు కదళీవనం ఏ కారణం చేత వెళ్ళాలని వచ్చారో – నన్ను పిలిచి దారి చూపమని కోరినారు. మీ దగ్గర విభూతి ప్రసాదము ఉంటే ఇవ్వు స్వామీ – అని అడిగినారు. స్వామివారు అమ్మవారి సన్నిధి నుండి తెచ్చిన పసుపు, కుంకుమలు కొద్దిగా ఇచ్చారు, మరియు నేను కదళీవనములో కొన్నిరోజులు ఉండి తపస్సు చేయాలనే ఉద్దేశ్యముతో వచ్చాను. వేరే కారణాలు ఏమీ లేవు అని చెప్పారు. ఇట్లా మాట్లాడుకుంటూ షుమారు 1 1/2 గంటల ప్రయాణం తర్వాత అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. స్వామివారు మెల్లగా పడవ నుండి దిగి "పరమేశ్వరీ నీవే నాతో రావాలి. నాకు దారి తెలియదు. ఇది ఒక కొత్త అనుభవంగా ఉంది. నాకు కళ్ళకు గంతలు కట్టి నట్టడవిలో వదలటమంటే ఇదేనేమో అన్నట్లుగా ఉంది. ఇంతవరకూ నాకు దారి చూపిన నా గురునాథులు, నీవే తోడు ఉండి నన్ను అక్కడికి తీసుకు వెళ్ళాలని" ఒక క్షణం ప్రార్థన చేసి ఆ దగ్గర ఉన్న చెట్టు క్రింద కూర్చొని తాను తెచ్చిన పొంగలి ప్రసాదం, పండ్లు కొంత పడవ అతనికి ఇచ్చి తాను తీసుకున్నారు. పడవకు డబ్బు ఇవ్వబోయారు. అప్పుడు పడవ నడిపే వ్యక్తి "గుడి అర్చకులే నన్ను పంపారు. నేను వారి వద్దే డబ్బు తీసుకుంటాను" అని అన్నారు. తర్వాత స్వామివారు పడవ నడిపే వ్యక్తితో "నువ్వు వెళ్ళు. నేను ఈ చెట్టు క్రింద కొంత సమయం కూర్చొని తర్వాత నా ప్రయాణం మొదలు పెడతాను" అని అన్నారు. పడవ వ్యక్తి "ఇక్కడికి అప్పుడప్పుడు సాధువులు, సంన్యాసులు వస్తూ ఉంటారు. మీరు ఈ సన్న దారి వెంబడి వెళ్ళు స్వామి" అని చెప్పి, తిరుగు ప్రయాణం అయ్యారు. కృష్ణానదిని చూస్తూ స్వామివారు చెట్టు క్రింద కూర్చొన్నారు. కొంతసేపటికి చేతిలో చేపల వలతో ఇద్దరు భార్యాభర్తలు స్వామివారి వద్దకు వచ్చి స్వామీ! ఎక్కడికి వెళ్ళాలి? ఎందుకు ఇక్కడ కూర్చొన్నారు? అని ప్రశ్నించినారు. మిగిలిన వివరాలు **వచ్చే సంచికలో** తెలుసుకుందాం.

మూలికలు

– స్వామి అరుళానంద

క్రితం సంచికలో అష్టకర్మ మూలికలలో ఒకటయిన సిలంధి నాయకం (ASYATASIA GANGETICA) అనే మూలికను గూర్చి తెలుసుకున్నాం.

దైవీక అంశం కలిగిన, ఈశ్వరుని అర్చనకు ఉపయోగించే, రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించే మారేడు చెట్టును గూర్చి ఇప్పుడు తెలుసుకుందాం. దీని గురించి ఇంత క్రితం ఒక సందర్భంలో ఆత్మజ్యోతిలో వ్రాశాం. ఇది దైవీక శక్తి కలిగినది మాత్రమే కాకుండా ఔషధ విలువలు కూడా కలిగినది. ఇది ఒక గొప్ప వృక్షం. ఈశ్వరార్చనకు శివాలయములలో ఉపయోగిస్తున్నారు. దీనికి "శ్రీ పత్రం" అనే పేరు కూడా ఉంది. అంటే లక్ష్మీదేవికి ప్రియమయిన పత్రం. మధ్య ఒక సంవత్సరం క్రితం ఈ బిల్వ చెట్టుతో ఏర్పడిన ఒక అనుభవాన్ని ఇక్కడ ప్రస్తావించదలచినాను.

దాదాపు ఒక వారం రోజుల పాటు నిత్యం "ఒక కోనేరు, దాని వద్ద లక్ష్మీదేవి మహావిష్ణువును బిల్వపత్రాలతో పూజించినారు. స్త్రీలు, పురుషులు, పిల్లలు ఆ కోనేటిలో స్నానం చేసి దర్శనం చేసుకుని అమ్మవారి దేవాలయము ముందు కూర్చున్నారు" ఇట్లా ఒక దృశ్యం నా కళ్ళముందు మెదులుతూ ఉన్నది. అప్పుడు ఈ దేవాలయం ఎక్కడ ఉందా అని అన్వేషణ ప్రారంభించాం. ఎంతో ప్రయత్నించగా కుంభకోణం వద్ద ఒక చిన్న గ్రామములో ఈ దేవాలయము ఉన్నదని తెలిసినది. ఆ గ్రామము పేరు "తిరులోక్కి". తర్వాత కొంతమంది భక్తులతో కలిసి ఆ ఆలయమునకు వెళ్ళాము. అక్కడికి వెళ్ళిన తర్వాత ఆ దేవాలయము మార్కండేయ మహర్షి, అగస్త్య మహాముని చే మహాలక్ష్మి అమ్మవారి కోసం ఏర్పాటు చేయబడినదని తెలియవచ్చింది. ఈ దేవాలయములో అమ్మవారు మహావిష్ణువుతో ఐక్యం కావటం కోసం బిల్వ పత్రాలతో పూజ చేసినట్లుగా స్థలపురాణం తెల్పుచున్నది. ఈ రోజుకి ఆ దేవాలయం వెనుక భాగంలో మారేడు చెట్లు ఉండటం మనం గమనించవచ్చు.

పవిత్ర వైష్ణవ స్థలాలయిన 108 దివ్య దేశములలో ఇది 107వ దివ్యదేశం. మహావిష్ణువు పాల సముద్రములో శయనించి ఉన్నట్లుగా మూల విగ్రహం ఉన్నది. సాధారణంగా పరిస్థితుల ప్రభావం వల్ల విడిపోయిన దంపతులు తిరిగి కలవటానికి, పితృ కార్యాలు సక్రమంగా చెయ్యకపోవటం వల్ల వచ్చే పాప విమోచనానికి, మాంగల్యదోష నివారణ – ఇట్లా అనేక దోష నివారణల కోసం ఈ స్వామిని పూజ చేసి ఫలితం పొందారు. మాతో వచ్చిన భక్తులు కూడా తమ కోరిక నిమిత్తం పూజలు, హోమాలు చేసి ఫలితం

పొందారు. దీని పూర్తి వివరాలు మనం మరొక సందర్భంలో తెలుసుకుందాం.

పాపదోష నివారణ శక్తి కలిగిన బిల్వ వృక్షం ఆరోగ్యానికి, ఐశ్వర్యానికి, ప్రశాంత జీవితానికి సహాయం చేసే ఒక గొప్ప ఔషధము. ఇది పంచభూతాలలో అగ్ని తత్త్వం కలిగిన వృక్షం. శ్రీసూక్తములో లక్ష్మీ అమ్మవారు బిల్వనిలయాళ్ (బిల్వనివాసిని) అని చెప్పబడినది. తిరుమలలో శ్రీనివాస పెరుమాళ్ హృదయములో ఉన్న లక్ష్మి అమ్మవారికి ప్రతి శుక్రవారం బిల్వ పత్రములతో పూజ చేస్తారని పెద్దల ద్వారా తెలిసినది. ఐశ్వర్యమును పొందుటకు బిల్వఫలములతో హోమం చేసి, ఈశ్వరుని అనుగ్రహం పొందవచ్చు. శ్రీసూక్తములో రసాయన శాస్త్రపరంగా ఒక లోహాన్ని మరొక లోహంగా మార్చుటకు ముఖ్యమయిన వస్తువు (మూలప్పొరుళ్) బిల్వమని చెప్పబడినది. అనుభవరీతిగా వంశ పారంపర్యంగా వైద్యపరంగా తెలిసిన పెద్దవారి ద్వారా ఇది బయట పడినట్లుగా చెప్పబడినది. హిందీలో దీనిని శ్రీఫలం (లక్ష్మీదేవికి ప్రీతిపాత్రమయిన ఫలం) అనే పేరు ఉంది. ఇది మంగళకరమయినది. దీనిలో మూడు ఆకులు ఉండటం వల్ల (త్రిశిగ, త్రిపత్ర, త్రిశూలం అని కూడా అంటారు. దీనికి మరికొన్ని పేర్లు : మహాబల – గొప్ప ఫలములు కలిగినవి. శివేష్ట – ఈశ్వరునికి ప్రియమైనది. పత్రిశ్రేష్ఠ – శక్తివంతమయిన ఆకులు కలది. సదాఫల – ఎప్పుడూ పండ్లు కలిగి ఉండును. పీతఫల – పసుపు రంగు పండ్లు కలిగినది. కందఫల – వాసన కలిగిన పండ్లు కలిగినది. బిల్వం – వ్యాధులను తగ్గించేది. శల్య – సూదుల వంటి ముళ్ళతో గాయం ఏర్పరిచేది. (కాళ్ళల్లో ఆనలు ఉన్నవారికి బిల్వం మందుగా ఉపయోగపడును. ఈ వివరాలు మరల తెలుసుకుందాం.) హృదయ కంద – మనస్సుకు మంచి స్వభావాన్ని ఇచ్చే పరిమళం కలిగినది. పూదివాద – ఇది మనం సేవిస్తే వాతం, శరీరము లోని చెడువాసన అన్నీ పోతాయి. ఇవి అన్నీ బిల్వమునకు గల కొన్ని పేర్లు. మిగిలిన వివరాలు వచ్చే సంచికలో తెలుసుకుందాం. ✦

పాపం ఎలా పోతుంది?

మనోవాక్కాయాలచే పాపం నుండి తొలగాలంటే సచ్చింతననీ, సత్కార్యాచరణనీ విడవకుండా వుండడమే ఉపాయం. పాపచరణం, పాపచింతనం మానాలని మనం దృఢంగా నిశ్చయించుకున్న కొద్దీ ఆ నిశ్చయం వల్లనే పాప స్పృహ కలిగి, వెంటనే తప్పకుండా పాపమార్గంలో పడిపోతూ వుంటాం. 'మీరు కామాన్ని ఎలా జయించా'రని వెనుకటి కొక సన్యాసిని అడిగితే, ఆయన' కామం నా చిత్త కవాటాన్ని తట్టినపుడు నాకు వినపించుకొనే తీరికవుండేదికాదు. దాని దారిన అది మరలిపోయేది' అని సమాధానమిచ్చాడట. ఎప్పుడూ సదాచరణ చేస్తూ ఉంటే అదే అలవాటవుతుంది. అప్పుడు పాపపు దుంపలు ఇరిగి, ఎండి చచ్చిపోతాయి. కనుక మనసు సచ్చింతనంచేస్తూవుంటే పాపం దానంతట అదే తొలగి పోతుంది. పాపాన్ని పరిహరించడానికి సత్సంగం, సచ్చింతనం, సద్భాషణం, సదాచరణం....వీటిని ఏమరకుండడమే మార్గం.

ఆశ్రమ వార్తలు

1. ది. 03-09-2015 గురువారం చీరాలలోని అవధూత స్వామి (బోదకాలు స్వామి) వారి ఆశ్రమములో వారి వార్షిక ఆరాధన మహోత్సవం జరిగినది. ఈ కార్యక్రమములో శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారు పాల్గొన్నారు.

అవధూత స్వామివారి సమాధి ఉన్నదని చాలామందికి తెలిసినప్పటికీ, దాని అభివృద్ధి గురించి కాని, నిత్య ధూప దీప నైవేద్యముల గురించి కాని అంతగా ఎవరూ శ్రద్ధ చూపలేదు. స్వామివారి ఆశ్రమములో ఉండే మునుస్వామి అనే భక్తుని కోరిక మీదట 1993 వ సం॥లో శ్రీ లలితానంద ఆశ్రమం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారు ఈ సమాధిని సందర్శించి, పూజా కార్యక్రమములు నిర్వహించారు, మరియు నిత్య ధూప దీప నైవేద్యములనకు ఏర్పాటు చేశారు. క్రమక్రమముగా భక్తుల రాక అధికమయినది. ఆశ్రమము కూడా అభివృద్ధి అయినది. ఈ రోజుకి నిత్య అన్నదానం మరియు నిత్యపూజ కార్యక్రమములకు అరుళానంద ట్రస్టు వారు సహాయం అందిస్తున్నారు. ఇంతే కాకుండా ఈ ఆశ్రమమునకు సమీపమున గల శ్రీ ఆదిపరాశక్తి అమ్మవారి ఆలయము మరియు బ్రహ్మంగారి మఠం మొదలగు వాటిలో అన్నదానం మరియు ప్రసాద వినియోగమునకు శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారే ట్రస్టు తరుపున సహాయం అందిస్తున్నారు. ఈ ఆలయములు ఉన్న వైకుంఠపురం ప్రాంతములో అధికముగా దిగువ మధ్యతరగతివారు, రోజు కూలీలు అధికముగా ఉండుటచే వీరిని దృష్టిలో ఉంచుకుని అరుళానంద ట్రస్టు వారు ఈ నిర్ణయం తీసుకోవటం జరిగినది.

2. ది.04-09-2015, పందిళ్ళపల్లిలోని చౌడేశ్వరి ఆలయములో "ధార్మిక శంఖారావం" కార్యక్రమాన్ని శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించినారు.

3. ది.04-09-2015 శుక్రవారం రోజు వేటపాలెం వద్ద గల దేశాయిపేటలోని అనాథ వృద్ధ శరణాలయములో నూతనంగా ప్రారంభించిన ఉచిత డయాబెటిక్ క్లినిక్‌లో 50 మంది పేదవారిని ఎంపిక చేసి వారికి చక్కెర వ్యాధికి, శరీర బలమునకు అవసరమయిన మందులు ఉచితముగా అందించుట ప్రారంభించినారు. ఇందుకు గాను ప్రథమముగా అరుళానంద ట్రస్టు తరుపున రూ. 25,000/- (ఇరవై ఐదు వేలు) చెక్కును శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారు స్వయముగా అందజేసినారు.

4. చీరాల స్వర్ణ రోడ్డులో నివసిస్తున్న పేద వైష్ణవ బ్రాహ్మణుడు గృహనిర్మాణానికి ఆర్థిక

సహాయం కోసం ట్రస్టు వారిని ఆశ్రయించినారు. గృహనిర్మాణమునకు కావలసిన వస్తువుల నిమిత్తం అరుళానంద ట్రస్టు వారు రూ. 10,000/- (పదివేల రూపాయలు) చెక్కును అందించినారు.

5. ది.07-09-2015 సోమవారం రోజు శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారి జన్మదినోత్సవ కార్యక్రమము శ్రీ సదాశివబ్రహ్మేంద్ర ఆశ్రమము, చిల్లకల్లులో జరిగినది. ఈ కార్యక్రమము ఎక్కడ జరపాలనే విషయమై అరుళానంద ట్రస్టు వారికి మొదట్లో కొంత కన్‌ఫ్యూజన్ ఉన్నప్పటికి భక్తులు ఎక్కువ మందికి అందుబాటులో ఉండేటట్లు గాను, సౌకర్యవంతంగా ఉండేట్లుగాను చిల్లకల్లులో జరపాలని నిర్ణయించినారు.

ది. 06-09-2015 ఆదివారం రోజు గణపతి, దత్తాత్రేయ, మృత్యుంజయ హెూమములు ప్రారంభించినారు. ది. 07-09-2015 సోమవారం ఉదయం గం.9-00 లకు హెూమ పూర్ణాహుతి జరిగినది. అనంతరం కలశ తీర్థంతో శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారికి అభిషేకం చేశారు. తదనంతరం శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారు శ్రీ సదాశివబ్రహ్మేంద్ర స్వామివారికి మరియు శ్రీ లలితానంద సరస్వతి స్వామివారికి స్వయముగా పూజచేసి, హారతి ఇచ్చిన అనంతరం శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారికి ఆశ్రమ స్మార్త పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వెండి పుష్పాలతో పాదపూజ చేసినారు. ప్రస్తుత విద్యార్థులు స్వామివారి భక్తులు అందరూ ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వినియోగం మరియు అన్నదానం జరిగినది.

జన్మదినము సందర్భముగా శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారు భక్తులతో మాట్లాడే టప్పుడు “మనం అందరం పరస్పరం ప్రేమ పెంచుకోవాలి. భగవంతుడు వేరే ఎక్కడో లేడు. ప్రతి ఒక్కరి శరీరము లోను ఆత్మ స్వరూపముతో ఉన్నది ఆ పరమాత్మే. దీనిని తెలుసుకొనుటకు మనం ప్రేమను పెంపొందించు కోవాలి. మన చుట్టు ప్రక్కల ఉ న్నవారితో ప్రేమతో మెలుగుతూ, ఆపదలో ఉన్నవారికి మనవల్ల చేతనయిన (అది ఏ రూపముగా నయినా) సహయం చేయాలి. ఆర్థిక సహయం చేయుటకు మరే ఇతర సహాయం చేయుటకు అందరికీ అవకాశం లేకపోవచ్చు. అటువంటి వారు కనీసం మౌనంగా మనస్ఫూర్తిగా కష్టంలో ఉన్నవారికోసం తమ ఇష్టదేవతను ప్రార్థించినా కూడా మంచిదే. ప్రేమ ద్వారానే మనం భగవంతుని తెలుసుకొనుటకు వీలగును. ప్రశాంత జీవితమును భగవంతుడు మనకు ప్రసాదించలేదని మనం భగవంతుని నిందించుట తగదు. భగవంతుని దృష్టిలో అందరూ ప్రశాంత జీవితం గడుపుటకు ఏదో ఒక మార్గం సృష్టించి ఉన్నాడు. అది తెలుసుకొనుటకు మనం ప్రయత్నించాలి. మనవద్ద ఉన్న దాంట్లో తృప్తిపడి అందులో ఆనందంగా జీవించటం అలవరచుకోవాలి. ఆశను పెంచుకుంటూ పోతే, దానికి మితం

లేదు. మనకన్నా ధనవంతులవలె ఆడంబరంగా జీవించాలని అనుకోవటంలో తప్పులేదు. కాని అందుకోసం ఉన్న ప్రశాంతతను పోగొట్టుకొని, ఆరోగ్యం పాడుచేసుకుని, అవస్థలు పడకుండా ఉన్నంతలో తృప్తిపడి జీవించుటకు మన శాయశక్తులా మనం ప్రయత్నించాలి. ప్రతి ఒక్కరూ తమ తోటివారికి, ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా కాని, వైద్యపరంగా తన తమవల్ల చేతనయిన సహాయం చేస్తే భారతదేశంలో పేదరికం లేకుండా మనం చెయ్యవచ్చు. ప్రభుత్వం కాని, సేవాసంఘాలు కాని ఎంత ప్రయత్నం చేసినా, ఎన్ని సేవా కార్యక్రమాలు చేసినా ప్రతిఒక్కరి మనస్సులో ప్రేమ, ఇతరులకు సహాయం చేసే గుణం ఉంటే మన భరతభూమి ఋషులు, మునులు, బుద్ధుడు, ఏసుప్రభు, మహాత్మా గాంధి వంటి మహా అవతార పురుషులు చూపిన దారిలో వెళ్ళుటకు పరిపూర్ణ అనుగ్రహం ఆశీర్వాదం మనం పొందవచ్చు. నా భక్తులయిన మీరు అందరు ఇది మొదట పాటించాలని నా కోరిక. దీనిని పాటిస్తే సత్యం, ధర్మం కాపాడి భారతదేశాన్ని ఒక పుణ్యభూమిగా ప్రపంచంలో మనమే ప్రేమ ధర్మ సత్యం మొదలగు వాటికి ఒక ఉదాహరణగా ఉండవచ్చు.

6. ది. 12-09-2015 మొదలు ది.16-09-2015 వరకూ అరుళానంద ట్రస్టు వారు వాడరేవు మరియు చిల్లకల్లులో నిర్వహిస్తున్న స్మార్త పాఠశాల విద్యార్థులను తమిళనాడులోని దేవాలయముల దర్శనమునకు తీసుకు వెళ్ళటం జరిగింది. వీరు తిరువణ్ణామలై, పశుమలై, కుంభకోణం, స్వామి మలై, శ్రీరంగం, నెరూర్ సదాశివబ్రహ్మేంద్ర స్వామి సమాధి మొదలగు దేవాలయములు దర్శించినారు, విశేష పూజలు జరిపించినారు.

7. అరుళానంద ట్రస్టువారు ది. 18-09-2015 శుక్రవారం రోజు రావూరిపేటలోని దేవ నాగానంద ఆశ్రమములోని వారికి, దేశాయిపేటలోని అనాధవృద్ధ శరణాలయము, చెరుకూరు ఆత్మబోధానంద ఆశ్రమము మరియు అరుళానంద ట్రస్టు సత్సంగం లోని సభ్యులు, శ్రీ లలితానంద ఆశ్రమము, వాడరేవులో నిత్య మధ్యాహ్న భోజనానికి వచ్చే వృద్ధులు - వీరందరికి నూతన వస్త్రములు పంచిపెట్టినారు.

8. ది. 20-09-2015 ఆదివారం రోజు సాయంత్రం గం. 4-00 లకు అరుళానంద ట్రస్టు కార్యవర్గ సమావేశము జరిగినది. ఈ సమావేశమునందు ఈ క్రింది విషయములు చర్చించటమైనది.

i) ది. 27-09-2015 ఆదివారం చీరాల లయన్స్ క్లబ్ ఆవరణలో అరుళానంద ట్రస్టువారి

పూర్తి ఆర్థిక సహాయము మరియు సహకారముతో జరుగనున్న ఉచిత షుగరు వ్యాధి చికిత్సా శిబిరమునకు తగు ఏర్పాట్లు జరుగుచున్నవి. ఈ వైద్యపరీక్షలు అనంతరం చికిత్స అవసరము అయి, చేయించుకొనుటకు ఆర్థిక స్థోమత లేని నూరు మంది పేషెంట్లను ఎంపిక చేసి, వారానికి ఒక సారి వారికి పరీక్షలు జరిపించి, ఔషధములు ఇవ్వాలని తీర్మానించటమయినది.

ii) చిల్లకల్లులోని శ్రీ సదాశివబ్రహ్మేంద్ర ఆశ్రమమును ఆనుకొని ఉన్న స్థలము వైద్యశాల నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నుండి తీసుకోవాలని, ఇందులో యాక్సిడెంట్ సర్వీస్, మెటర్నిటీ మరియు జనరల్ – అనే మూడు శాఖలు త్వరగా ప్రారంభించి, చుట్టు ప్రక్కల ప్రజలకు ఉచితముగా సేవ చేయాలనే సంకల్పంతో పని ప్రారంభించినారు. ఈ విషయంలో మనకు అన్నివిధాలుగా సహకరిస్తున్న జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీ శ్రీరాం తాతయ్య గార్కి మరియు ఈ పనిని ప్రత్యేక శ్రద్ధతో ముందుకు నడిపిస్తున్న జి.యస్.కె. ప్రసాద్ గార్కి మరియు కె. ఆనంద్ స్వరూప రెడ్డి గార్కి అరుళానంద ట్రస్టువారు కృతజ్ఞతలు తెల్పినారు.

iii) జగ్గయ్యపేట వాస్తవ్యులు, సంఘసేవకులు అయిన కార్లపాటి శ్రీనివాసరావుగారిని ఈ పనిని త్వరగా పూర్తి చేయుటకు వేగవంతమయిన కృషి చేయాలని కోరటమే కాకుండా గత కొద్ది నెలలుగా అరుళానంద ట్రస్టుకు వారు అందిస్తున్న సహకారము మరియు జగ్గయ్యపేట చుట్టుప్రక్కల వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి, వారిని అరుళానంద ట్రస్టులో సభ్యులుగా చేర్చుకోవాలని తీర్మానించట మయినది.

iv) అరుళానంద ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ అయిన శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారు చీరాల చుట్టుప్రక్కల అన్ని కార్యక్రమాలకు వెళ్ళినప్పుడు వేటపాలెం, జాంద్రపేట, స్వర్ణరోడ్డు మొదలగు చోట్ల రోడ్డు వెంబడి చెత్త విపరీతంగా పేరుకు పోయి ఉండడం గమనించారు. చీరాల మునిసిపాలిటి వారిని సంప్రదించి మనమే ఒక వాహనమును ఏర్పాటు చేసి మన భక్తులతో కలిసి ఈ చెత్తను శుభ్రం చేస్తే మంచిదనే అభిప్రాయమును వెలిబుచ్చినారు. దీని గురించి మనం ఏవిధంగా చేస్తే బాగుంటుందనేది తెలుసుకుని తెల్పమని వర్కింగ్ కమిటీ సభ్యులను కోరటం జరిగినది.

v) ఈ సంవత్సరం శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి స్వామివారి జన్మదినాన్ని పురస్కరించుకుని జి.సి.పాలెం వద్ద గల నెమలికుంట లోని చెంచులకు వస్త్రములు ఇవ్వటం జరిగినది. పై సంవత్సరం కూడా వస్త్రములు ఇవ్వాలని అరుళానంద ట్రస్టు వారు తీర్మానించినారు. ✦



SRI ARAVINDA SARIT SAGARA

- Dr. Prema Nandakumar, Srirangam.

11. Bankim Chandra Chatterji

The third volume of SABCL also brings the first sustained critical study of an author by Sri Aurobindo. Towards the conclusion of his stay in England, Sri Aurobinbdo was preparing for his Indian Civil Service examinations. He had begun learning his mother tongue Bengali as part of his studies. However, he decided not to enter the civil service and instead took up the post of an assistant in the court of the legendary Sayaji Rao, the Gaekwad of Baroda. He was also invited to teach in the Maharajah's College. From the time he returned to India, he was quite anxious to learn his mother tongue, Sanskrit and of course Gujarati which was the native tongue in Baroda.

He progressed quickly with his studies as he had a tutor at home to teach Bengali. Since reading is the best way to improve one's diction, he took up the novels of Bankim Chandra Chatterji, the highly acclaimed author of **Ananda Math** and **Devi Chaudhurani** at that time. Soon, he proceeded to study the novels with a critical eye. His early essays in the Indu Prakash had ruffled some Congress feathers, and he had been requested to tone down his articles. Well, he would walk another path now. As an Indian trying to learn about his motherland, Sri Aurobindo had come across the prefect teacher. At the same time, now he had also found the right subject for his future articles in Indu Praksh in Bankim Chandra Chatterji. It was also a timely look=back to the great novelist for the famous Bengali novelist had passed away on 8th April 1894. Sri Aurobindo's articles on Bankim appeared in Indu Prakash from July 16 to August 27, 1894. It is interesting to note that these articles were simply signed "Zero" Which was perhaps appropriate for Sri Aurobindo contains infinity!

Brief articles, but a complete picture of Bankim the patriot, the officer, the novelist, the philosopher, the guide. The opening is to the point:

"**B**ankim Chandra Chattopadhyaya, the creator and king of Bengali prose, was a high-caste Brahman and the son of a distinguished official in Lower Bengal. Born at Kantalpara on the 27th June 1838, dead at Calcutta on the 8th April 1894, his fifty-six years of laborious life were a parcel of the most splendid epoch in Bengali history; yet among its many noble names, his is the noblest. His life shows us three faces, his academical career, his official labours and his literary greatness; it will be here my endeavour to give some description

of each and all."

Bankim's genius was recognized and appreciated quite early in his life. How many children can master the alphabet by reading it just once, asks Sri Aurobindo. He is all admiration at the quick learner who studied Sanskrit to get "a feeling for its literary secrets". Bankim was no pedant but a close study of the ancient language had revealed to him the way he could handle Bengali prose in a fresh manner. He was a brilliant student and a voracious reader who became the first B.A. of the Calcutta University. At the age of twenty Bankim had become the Deputy Magistrate of Jessore. Sri Aurobindo hastens to add that these studies did not make Bankim but it was his keen intellect that was alert all the time.

"Not what a man learns, but what he observes for himself in life and literature is the formative agency in his existence, and the actual shape it will take is much determined by the sort of social air he happens to breathe at that critical moment when the mind is choosing its road. All else is mere dead material useless without the breath of a vivifying culture."

Sri Aurobindo proceeds to describe the "social air" of Bankim's Bengal. Bankim was born i 1838 when the society was "the theatre of a great intellectual awakening". Sri Aurobindo was a universal man but it did not preclude him from having pardonable pride in the Bengali nation.

"An ardent and imaginative race, long bound down in the fetters of a single tradition, had had suddenly put into its hand the key to a new world thronged with the beautiful or profound creations of Art and Learning. From this meeting of a foreign Art and civilisation with a temperament differing from the temperament which created them, there issued, as there usually does issue from such meetings, an original Art and an original civilisation. Originality does not lie in rejecting outside influences but in accepting them as a new mould into which our own individuality may run. This is what happened and may yet happen in Bengal. The first impulse was gigantic in its proportions and produced men of an almost gigantic originality."

Then follows the golden list: Raja Rammohum Roy, Rajnarain Bose, Devedranath Tagore, the two Dutts, Okhay Kumar, Michael Madhusudan, Vidyasagar, Rajendra Lal Mitra. The second essay goes on giving more names and it is astonishing how much Sri Auroibindo had gathered about Bengal within a few months of his coming to India. Sri Aurobindo feels that the Maya theory which had lain on the Hindu was now drawn aside and the Bengali now "felt vividly its joy, warmth and sensuousness". The intellectuals were not satisfied with Bengali, English and Sanskrit but studied Greek, Laitn, French. Admiration is tinted with humour too: "They (the Bengalis) were giants and did everything gigantically. They read hugely, wrote hugely, thought hugely, and drank hugely."

Though Bankim did not move with these giant intellects, his circle was rich too containing Hemachandra Banerji, Rabindranath Tagore and Keshab Chandra Sen, among others. The urge to criticise the view-points of persons like Ranade and Bhandarkar slips through, but gets curbed immediately, for Bankim is the subject. The third essay is about Bankim's official career. Bankim suffered but his head remained unbowed as he piled up several

achievements like bringing the Indigo planters to book. Indeed Bankim was effective in putting an end to "government by organized ruffiandom". The outlaws who terrorized the Sunderbans area were crushed. District after district, Baruipur, Berhampur, Maldeh, Hughly. For a successful Indian officer like him, the crisis could not be far away. So he was shunted around too often because of the ill-will of his British Superiors. This was the last stage of his drudgery and after his retirement he did not live for long. Bankim passed away in 1894.

Sri Aurobindo proceeds to describe the facets of Bankim's versatile genius.

"Bankim, the greatest of novelists, had the versatility developed to its highest expression. Scholar, poet, essayist, novelist, philosopher, lawyer, critic, official, philologian and religious innovator, — the whole world seemed to be shut up in his single brain. At first sight he looks like a bundle of contradictions. He had a genius for language and a gift for law; he could write good official papers and he could write a matchless prose; he could pass examinations and he could root out an organised tyranny; he could concern himself with the largest problems of metaphysics and with the smallest details of word-formation: he had a feeling for the sensuous facts of life and a feeling for the delicate spiritualities of religion: he could learn grammar and he could write poetry."

It is amazing what a thorough study of Bankjim's life and works have gone into these seven journalistic essays by the young Sri Aurobindo. He finds that though talented to take up so many activities, Bankim himself remained focused upon his literary creations written in prose. Again, though he knew English very well and wrote his first novel, **Rajmohan's Wife**, in English, he turned to Bengali for good.

"The body of work he gave us in nearly forty years of intellectual activity amounts to ten novels, two critical works on religion and some scattered literature. Small in quantity, it is pure gold in quality. And it may be that in no case would he have written much. Nature gives us quartz profusely and mixed alloy in abundance, but pure gold only in rare parcels and infinitesimal portions."

How very true and what a perfect image! Sri Aurobindo then gives us the literary history of Bankim who began writing for two magazines, **Sangbad Prabhakar** and **Sudhiranjan** published by Iswar Chandra Gupta, a poet. Himself a stranger to his mother-tongue till his late teens, Sri Aurobindo points out the advantages of writing in one's own mother tongue. Like Madhusudan Dutt, Bankim began writing in English but switched over to Bengali. Sri Aurobindo's three cheers for one's mother-tongue must be imbibed by us all:

"The language which a man speaks and which he has never learned, is the language of which he has the nearest sense and in which he expresses himself with the greatest fulness, subtlety and power. He may neglect, he may forget it, but he will always retain for it a hereditary aptitude, and it will always continue for him the language in which he has the safest chance of writing with originality and ease. To be original in an acquired tongue is hardly feasible. The mind, conscious of a secret disability with which it ought not to

have handicapped itself, instinctively takes refuge in imitation, or else in bathos and the work turned out is ordinarily very mediocre stuff. It has something unnatural and spurious about it like speaking with a stone in the mouth or walking upon stilts. Bankim and Madhusudan, with their overflowing originality, must have very acutely felt the tameness of their English work. The one wrote no second English poem after the **Captive Lady,** the other no second English novel after **Rammohan's Wife**."

Durgesh Nandini was Bankim's first Bengali novel. **Kapala Kundala** and **Mrinalini** followed in quick succession as also **Visha Vriksha**. Bankim began editing a Bengali journal, **Bangadarshan** when he was working in Berhampur. The other novels he wrote, termed "very ripe and exquisite work" by Sri Aurobindo are: **Chandrashekhar, Krishna Kanta's Will, Debi Chaudhurani, Anandamath, Sitaram, Indira and Kamala Kanta.** Bankim's non-fiction works include **Krishna Charitra** and **Dharmatattva** (Principles of Religion). Bankim left behind an unfinished book on **Gita**. He had also plans for writing a book on the Vedas. Sri Aurobindo mourns that death snatched him away before he could complete his targets, but feels grateful for what has been given for posterity by the great writer. Of his style, for instance: "To describe its beauty, terseness, strength and sweetness is too high a task for a pen like mine. I will remark this only that what marks Bankim above all is his unfailing sense of beauty."

But Sri Aurobindo is not interested in mere literary criticism. What is the significance of Bankim's writing for the Bengali race? Well, he was no less than the creator of the Bengali language. What had been a dialect was now transformed into a majestic language. In the course of this essay which speaks of Bankim's work, Sri Aurobindo provides a brilliant comparison of Michael Madhusudan Dutt and Bankim Chandra Chatterji which has also contrastive elements:

"One was the king of prose, the other the king of poetry; and their lives were of a piece with their writings. Madhusudan's is full of sound and passion, violence of heart, extravagance, intemperance, self-will, a life passing through grief, bitterness and anguish to a mournful and untimely doom. As we read the passage of that Titanic personality over a world too small for it, we seem to be listening again to the thunder-scene in **Lear**, or to some tragic piece out of Thucydides or Gibbon narrating the fall of majestic nations or the ruin of mighty kings. No sensitive man can read it without being shaken to the very heart. Even after his death, Madhusudan's evil star followed him. Though a great poet among the greatest, he is read nowhere outside Bengal and the Punjab; and his name is not heard even in Bombay and Madras, provinces of his own native land. How different was it with Bankim, the genius of prose. His nature, with plenty of strength in it, was yet mild, calm and equable, clear and joyous, but not intemperate. Fortune's favourite to whom every door opened without keys, his life had in it that sedate maturity and august quiet, which, according to Epicurus, is the true attitude of the Gods, and which the Gods only give to those mortals who, like themselves, have seen life steadily and seen it whole."

When Sri Aurobindo wrote the above, he did not know as yet how popular Bankim would be all over India through translations into local

languages. It was the Bande Mataram song of Bankim that was reverberating in Bengal then and would soon overwhelm all of India when Lord Curzon would partition Bengal. The phrase would lend itself to a Movement which would unite all Indians against their oppressors. What Sri Aurobindo exults here is how Bankim had made it the 'in' thing for a Bengali to speak in his native tongue. Hadn't he, as his counterparts everywhere in India, taken to speaking in English? Surely this had led to other results as well in Bengal: "Visible on every side, in the waning influence of the Sadharan Brahmo Samaj, in the triumph of the Bengali language, in the return to Hinduism, in the pride of birth, the angry national feeling and the sensitiveness to insult, which are growing more and more common among our young men", though Bengalis have to go a long way forward still. The Anglicised Bengali still has the upper hand and often says "with a sort of triumph that the only people who read Bengali books are the Bengali ladies." Now comes yet another brilliant salvo from Sri Aurobindo:

"All honour then to the women of Bengal, whose cultured appreciation kept Bengali literature alive! And all honour to the noble few who, with only the women of Bengal and a small class of cultured men to appreciate their efforts, adhered to the language our forefathers spoke, and did not sell themselves to the tongue of the foreigner! Their reward is the heart-felt gratitude of a nation and an immortal renown. Yes, the women of Bengal have always been lovers of literature and may they always remain so."

Sri Aurobindo concludes that Posterity will acclaim Bankim as the first among the Makers of India who did his work in silence for the love of his work without clamouring for wealth or power or recognition, and thus silently created "a language, a literature and a nation." Sri Aurobindo was prophetic in the conclusion of his essays on Bankim. He had meant the Bengali nation but it turned out that within a decade, Bankim's song in the novel Ananda Math would be creating a Union of India itself with lightning speed. Sri Aurobindo would translate Ananda Math into English in the future, prepare two English translations of the famous poem and write about the glorious Bande Mataram Movement that had risen to reject the Partition of Bengal. He would call Bankim a rishi and a nation-builder, and write in the Bande Mataram of 16 April, 1907: "The mantra had been given and in a single day a whole people had been converted to the religion of patriotism. The Mother had revealed herself. Once that vision has come to a people, there can be no rest, no peace, no farther slumber till the temple has been made ready, the image installed and the sacrifice offered. A great nation which has had that vision can never again bend its neck in subjection to the yoke of a conqueror."

A Mahayogi's tribute to a great Rishi. ✦

శుభాశీస్సులు

ఆత్మజ్యోతికి శ్రీ దొప్పలపూడి కృష్ణారావుగారు అందించిన రూ.3000/- చెక్కున్ను, మరియు శ్రీ రామరాజు గారు అందించిన రూ.1116/- చెక్కున్ను, స్వామి అరుళానంద గార్కి అందించబడినవి. స్వామి అరుళానంద పై ఇర్వురకు శుభాశీస్సులు అందజేస్తున్నారు.

– రామోరా

శ్రీకృష్ణ చరితం

డా॥ గాలిగుణశేఖర్, తిరుపతి.



ఆరవ స్కంధం

దక్షుడి సృష్టి కార్యక్రమం

స్వాయంభువ మనువు రెండవ కుమారుడైన ఉత్తానపాదుడి వంశంలో జన్మించిన ప్రాచేతసులు నీటినడుమ పదివేల సంవత్సరాలు తపస్సు చేశారని ఈ వరకే చెప్పబడింది. వాళ్లు తపస్సు చాలించి, సముద్రంలోంచి వెలుపలికివచ్చి నలువైపులా చూశారు. భూమిపూర్తిగా చెట్లతో నిండి ఉండటం చూసి ఆగ్రహించి కోపాగ్ని జ్వాలల్ని మహావాయువుతో ప్రసరింపజేసి చెట్లను ఆహుతి గావించడానికి పూనుకున్నారు.

సోముడు వాళ్లని వారించి ప్రజాసృష్టికోసం జన్మించినవాళ్లు ఈ అనర్థానికి ఒడిగట్టడం మంచిదికాదని, సోముడు 'మారిష'తో వారికి వివాహం జరిపించాడు. మారిష ద్వారా వాళ్లకి బ్రహ్మదేవుడి మానసపుత్రుడు **దక్షుడు** పుట్టాడు.

దక్షుడు అన్నిరకాల సృష్టులను కొనసాగించాడు. తన సృష్టి పట్ల సంతుష్టి చెందక విష్ణుదేవుని గూర్చి తపస్సుచేసి **హంసగుహ్యం** అనే స్తోత్రంతో ప్రస్తుతించాడు.

విష్ణువు **పంచజన** ప్రజాపతి పుత్రిక అయిన **అసిక్ని** అనే పేరుగల కన్యను దక్షుడికి భార్యగా అనుగ్రహించాడు. దక్షుడు **హర్యశ్వులు** అనే పదివేలమంది పుత్రుల్ని పొందాడు. వాళ్లని ప్రజాసృష్టి కోసం నియోగించగా, నారదుడు వారికి వైరాగ్యం బోధించి నివృత్తిమార్గం వైపు మళ్లించాడు. ఆ తర్వాత తన తండ్రి బ్రహ్మదేవుడి ఆజ్ఞమేరకు అసిక్ని ద్వారా దక్షుడు వేలకొలది పుత్రుల్ని పొందాడు. వాళ్లకి **శబలాశ్వులని** పేరు. వాళ్లని కూడా నారదుడు నివృత్తి మార్గం వైపు మళ్లించాడు.

దీనితో ఆగ్రహించిన దక్షుడు **దేవ, ఋషి, పితృఋణాలు తప్పనిసరిగా తీర్చవలసినవి. అటువంటి ఋణాలు తీర్చకనే నా కుమారుల్ని నివృత్తిమార్గం వైపు మళ్లించావు. నా కుమారులకు ద్రోహం తలపెట్టినందుకు తక్కిన భాగవతుల వలె కాకుండా లోకసంచారివై ఒకచోట నిలుకడ లేకుండా ఉందువు గాక** అని శపించాడు.

బ్రహ్మదేవుడు ప్రజాసృష్టికి తగిన శక్తిని అతడికి అనుగ్రహించాడు. మళ్లీ అసిక్ని ద్వారా అరవైమంది కూతుళ్లను పొంది, అందులో పదిమందిని **ధర్ముడికి** (యముడు)

పదమూడుమందిని **కశ్యపప్రజాపతికి** ఇరవై ఏడుమందిని **చంద్రుడికి భూతుడికి** ఇద్దరిని **అంగిరసుడికి** ఇద్దరిని **కృశాశ్వుడికి** ఇద్దర్ని **తార్క్ష్యుడనే** నామాంతరం కలిగిన కశ్యపుడికి మళ్లీ నలుగురునిచ్చి వివాహం చేశాడు. వీరి సంతానంతో ముల్లోకాలు నిండాయి.

కశ్యప ప్రజాపతికిచ్చిన అదితిదేవికి పుట్టిన కుమారులలో **త్వష్ట** అనే వాడు దైత్యుల చెల్లెలైన **రచన** అనే కన్యను వివాహం ఆడాడు. వాళ్లకి మహాబలాఢ్యుడైన **విశ్వరూపుడు** జన్మించాడు.

ఒకానొక సమయంలో **బృహస్పతి** దేవతలపై కోపించి వెళ్లిపోయాడు. అప్పుడు దేవతలు విశ్వరూపుణ్ణి గురువుగా ఎంచుకున్నారు. ఆ సంఘటనను శుకమహర్షి ఇలా వివరించాడు.

దేవాసుర సమరం - విశ్వరూపుడి అనుగ్రహం

అమరావతిలో దేవతలందరూ కొలుస్తుండగా ఇంద్రుడు గంధర్వగానం వింటూ, అప్సరసల నాట్యం తిలకిస్తూ ఆనందంతో మైమరచి ఉన్న సమయంలో దేవగురువు బృహస్పతి అక్కడికి వచ్చాడు. దేవేంద్రుడు లేచి ఆయనకు స్వాగతం పలకలేదు. బృహస్పతి వెంటనే వెనుతిరిగాడు.

గురుదేవుడు వచ్చి వెళ్లిన సంగతి తెలిసి కంపించిన ఇంద్రుడు ఆయన ఇంటికి వెళ్లాడు. బృహస్పతి అధ్యాత్మ మాయ చేత అదృశ్యుడయ్యాడు. ఆయన పాదాలపై పడి క్షమాభిక్ష వేడుదామని ఎంత ప్రయత్నించినా ఆయన జాడ తెలియలేదు.

మంత్రాంగం నెరిపే గురువులేదని తెలిసి దానవులు అమరావతిపై దండెత్తారు. దానవుల్ని ఎదుర్కోలేక దేవగణాలు బ్రహ్మను ఆశ్రయించారు. బ్రహ్మ దేవతల్ని చూసి **మీ శ్రేయస్సుకోరి తొలినుంచి మీకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును అవమానించారు. అందుకే మీకీ దురవస్థ కలిగింది. రాక్షసులు శక్తిహీనులైనా గురువు అనుగ్రహంతో మిమ్మల్ని జయించగలిగారు. ఇప్పుడు మీరు త్వష్ట ప్రజాపతి కుమారుడైన విశ్వరూపుణ్ణి ఆశ్రయించండి. అతడు మహాతపస్సంపన్నుడు. అతడి అనుగ్రహంతో మీరు తప్పనిసరిగా రాక్షసుల్ని జయించగలరు** అన్నాడు. తన్ను ఆశ్రయించిన దేవతలకు విశ్వరూపుడు నారాయణకవచం ఉపదేశించాడు. దేవతలు రాక్షసుల్ని ఓడించారు. అందుకు ప్రతిఫలంగా విశ్వరూపుడు తమతోబాటు హవిర్భాగాలు అందుకునే అవకాశం దేవతలు కల్పించారు.

విశ్వరూపుడి తల్లి రచన, రాక్షసుల ఆడపడుచు కనుక హవిర్భాగాన్ని రాక్షస ప్రముఖులకు పరోక్షంగా పంచిపెట్టేవాడు. ఈ విషయం తెలిసి భయభ్రాంతుడైన ఇంద్రుడు బ్రాహ్మణుడని, మహనీయుడని భావించకుండా విశ్వరూపుడికున్న మూడు తలల్ని ఖండించాడు. ✦ .... (సశేషం)

శ్రీ దుర్వాసోముని విరచిత

శ్రీ పరశమ్భుమహిమ్నః స్తోత్రమ్

వ్యాఖ్యాత - దోర్బల విశ్వనాథశర్మ, రామాయంపేట.

అవతారిక : పై శ్లోకమున జ్ఞానశక్తి వ్యంజక సామగ్రి చెప్పబడినది. ఈ శ్లోకమున జ్ఞానము యొక్క ఏకత్వము చెప్పబడుచున్నది.

శ్లో॥ గోజం క్షీరం యథైకం ద్యుతివివిధగుణస్వేంద్రియార్థప్రకాశో-
ఒప్యేకస్తద్వర్ణనానారుచిరధికరణస్యైకతా కారణేన ।
నీలాద్యాభాసబుద్ధ్యా నభసి పరివృతో ధూమభాసైరివాగ్నిః
ప్రాచుర్యేణ ప్రదీప్తః పరమశివ! తతః సత్యవిశ్వాత్మకస్త్వమ్ ॥ 36

ప్రతిపదార్థము : పరమశివ! = ఓ పరమశివా!, యథా = ఎట్లు, గోజమ్ = గోవులనుండి పుట్టిన, క్షీరము = క్షీరము, ఏకమ్ = ఏకమో, తథా = అట్లు, ద్యుతివివిధగుణ స్వేంద్రియార్థప్రకాశః అపి = కాంతి యొక్క వివిధగుణములుగల స్వేంద్రియార్థముల ప్రకాశము కూడ, ఏకః = ఏకమే, తద్వర్ణ నానారుచిః = ఆ వర్ణముల నానా విధములుగా భాసించుట, అధికరణస్య = ఆధారము యొక్క, ఏకతా కారణేన = ఏకత్వ కారణముచేత ధూమభాసైః = ధూమకాంతుల చేత, నభసి = ఆకసము నందు, పరివృతః = చూపబడిన, అగ్నిః ఇవ = అగ్ని వలె, నీలాద్యాభాస బుద్ధ్యా = నీలాదుల ఆభాసబుద్ధితో, ప్రాచుర్యేణ = అధికముగా, ప్రదీప్తః = వెలిగినవాడవు, తతః = అందువలన, త్వమ్ = నీవు, సత్యవిశ్వాత్మకః = సత్యమైన విశ్వమే రూపముగా గలవాడవు.

తాత్పర్యము : వేరు వేరు గోవులలో క్షీర మేకరూపము, అట్లే కాంతి యొక్క వివిధములైన గుణముల వంటి నీల పీతాదిరూపములతోకూడిన (ఇంద్రియార్థములు భిన్నములైనను) వాని ప్రకాశ మొక్కటే. ఆ వర్ణముల నానా విధములుగా భాసించుట ఆధారము యొక్క ఏకత్వకారణముచేత ఏర్పడును. ఆకసమందు పొగలకాంతులచే నీలాద్యభాసము బుద్ధి కలిగినను ఏకమైన అగ్నివలె విశ్వమునందు భేదములున్నను అధికముగా మెలగుచున్న నీవాకడవే.

వివరణము : నల్లని ఎఱ్ఱని రంగులు గల గోవులు భిన్నభిన్నము లైనను వాని పాలన్ని తెలుపే వాని రుచి కూడ ఒకటే. ఇంద్రియార్థములు అనగా ఇంద్రియములచే తెలియ

దగిన విషయములలో ముఖ్యముగా చక్షురింద్రియ విషయము లన్నియు కాంతిలోని వేఱు వేఱు గుణములైన వేఱు వేఱు ఎఱ్ఱని పచ్చని మొదలైన రంగులు వేఱైనను వాని జ్ఞానములో భేదముండదు. రక్తఘటము రక్తఘటము గానే తెలియబడును. పీతఘటము పీతఘటముగానే తెలియబడుచున్నది. అనగా విషయములలో భేదము లున్నను విషయమును ప్రకాశింపజేయు తేజములో భేదము లేదు. నానావర్ణముల కేకాధికరణమైన తేజమే వర్ణనానావిధ భాసమునకు కారణము. తేజము లేనప్పుడు, స్పష్టముగా లేనప్పుడు వర్ణనానావిధ భాసముండదు. అన్నియు అన్యవర్ణముగా గాని అవర్ణముగా గాని కన్పించును. మొదటి దృష్టాంతములో ఆధేయమైన క్షీరము ఏక రూపము. ఆధారములైన గోవులు భిన్నరూపములు. రెండవ దృష్టాంతములో ఆధారమైన తేజమొకటే. ఆధేయములైన ఘటాదుల వర్ణములు భిన్నభిన్నములు, ఆధారమై తేజ ముండుటచేతనే స్పష్టముగా నుండుట చేతనే వాని రంగులు వేఱు వేఱుగా స్పష్టముగా కనబడుచున్నవి. 2. ఆకాశమున పొగల వేఱు వేఱు కాంతులు జిమ్ముచున్న దగ్నియే. అప్పు డగ్నియే భిన్న భిన్నముగా దర్శింపబడుచున్నను ధూమముల భాసము లగ్నియం దారోపింపబడినవే కాని అవి అగ్ని యొక్క ప్రకాశమున భేదములు కల్పింప జాలవు. నీలాద్యాభాసబుద్ధిచే అగ్నియొక్క ఏకత్వమునకు భంగము రానట్లు విశ్వమునందలి భేదముచే విశ్వాత్మునిలో భేదముండదు. ఈ దృష్టాంతము (అగ్నియందు నీలాద్యాభాస బుద్ధి మిథ్యారూపమే యైనట్లు) విశ్వము నందలి భేదము మిథ్య. అది విశ్వాత్మునిలో భేదము కలిగింపజాలదని చెప్పును. కాని **సత్యవిశ్వాత్మకస్త్వమ్** అనుటచేత విశ్వము సత్యమని స్పష్టమగుచున్నది. 3. శైవశాక్తాద్వైతములలో బ్రహ్మము విశ్వము (జగము) రెండును సత్యములే అగుచో అద్వైత మెట్లు అను ప్రశ్నము కలుగును. సమాధానము బ్రహ్మము విశ్వముగానే ప్రకాశించుచున్నది. బ్రహ్మము సత్యమే, విశ్వమును సత్యమే వాని భేదము మాత్రము మిథ్య. భేదము మిథ్యయగుటచే బ్రహ్మవిశ్వములకేకత్వము కాగా అద్వైతము సిద్ధమగుచున్నది. అగ్ని సత్యమే, అగ్ని జన్యమైన ధూమము సత్యమే. ధూమ భాసములు వాస్తవమునకు అగ్నిభాసములే అయినను అగ్నిభాసమువలె ఏకరూపములు కావు. పరశమ్భువును అంతరంగ మందు సచ్చిదానంద రూపముగా దర్శించుట, ఆయన యొక్క ఏకరూపమును దర్శించుట అంతరంగదర్శనము. విశ్వములో భిన్నభిన్న రూపముగా దర్శించుట పరశమ్భువు యొక్క బహిరంగ దర్శనము. బహిరంగ దర్శనము నందలి భిన్నరూపత అంతరంగ దర్శనమందలి ఏకరూపత. ఈ దృష్టితో **సత్యవిశ్వాత్మకస్త్వమ్** అని చెప్పబడినది. మొత్తముమీద ఆధారాధేయములు రెండును సత్యములే. కారణ కార్యములు రెండును సత్యములే, వాని భేదము మిథ్యయని చెప్పుటకు ఈ శ్లోకమున భిన్నభిన్న దృష్టాంతములు చెప్పబడినవి. మొదటి దృష్టాంతము వలన ఆధేయమైన క్షీరము గోజన్యమే కావున వానికి కార్యకారణ భావసంబంధముకూడ నున్నది అనియు చెప్పబడినట్లైనది.

ధవలము స్వాదుతాగుణయుతమ్మగు క్షీరమువోలె వర్ణముల్
వివిధములైన కాంతివలె పెక్కులు నీలముఖ భ్రమల్ గల
ట్టివి భు నభమ్మువోలె నొకటే యనలమ్ము బహుప్రభాయుతం
బవని వెలుంగునట్లు శివ యొౕదువు సర్వజగన్మయాత్మనే.

అవతారిక : పై శ్లోకమున శ్రీశమ్భువుయొక్క **సత్యవిశ్వాత్మత** చెప్పబడినది. ఈ శ్లోకమున దానితోపాటు శ్రీ శమ్భువుయొక్క సంసారిత్వమునగూడ **ఆయన మాయ** ప్రసరింప జేయుచున్నట్లు చెప్పబడినది.

శ్లో॥ **నిత్యాఖండప్రకాశాదమలతరవిభో! త్వత్ప్రకాశాత్కదాచి-**
న్మాయా సంజాయమానా త్రిగుణముఖగణవ్యక్తశక్తిస్వభావా ।
సిద్ధాంతైర్భిన్నమానప్రమితిభిరసుఖైర్భేదబుద్ధిప్రధానైః
సంసారిత్వం ప్రసార్య ద్రఢయతి భవతస్సత్యతాం వేదవిద్యా ॥ **37**

ప్రతిపదార్థము : అమలతరవిభో! = మిక్కిలి స్వచ్ఛుడవైన ఓ ప్రభూ!, నిత్యాఖండ ప్రకాశాత్ = నిత్యము అఖండమునైన ప్రకాశములైన, త్వత్ప్రకాశాత్ = నీ సన్నిధి నుండి, సంజాయమానా = పుట్టుచున్న, మాయా = మాయ, త్రిగుణముఖ గణవ్యక్త శక్తి స్వభావా = త్రిగుణములు కలవారు మొదలైన గుణముల చేత వ్యంజింప జేయబడిన శక్తి స్వభావము గలదై యున్నది, భిన్నమాన ప్రమితిభిః = వేఱైన ప్రమాణముల నుండి పుట్టిన ప్రమలుగల, అసుఖైః = దుఃఖరూపములైన, భేద బుద్ధి ప్రధానైః = భేదబుద్ధి ప్రధానములైన, సిద్ధాంతైః = సిద్ధాంతములచేత, సంసారిత్వమ్ = సంసారిత్వమును, ప్రసార్య = విస్తరించి, వేదవిద్యా = వేదవిద్య, భవతః = నీ యొక్క, సత్యతామ్ = సత్యత్వమును, **ద్రఢయతి** = దృఢమొనర్చు చున్నది.

తాత్పర్యము : బ్రహ్మవిష్ణుమహేశాదిరూప త్రిమూర్త్యాదిగణములచేత మాయయొక్క శక్తి స్వభావము వ్యక్తమగును. ఆ మాయవలన దుఃఖరూపములైన వివిధ ప్రమాణప్రమేయ ప్రమితులు గల భేదబుద్ధి ప్రధానములైన వివిధ సిద్ధాంతముల ననుసరించిన జీవుల సంసారిత్వమే విస్తరించుచున్నది. ఇట్లు పరమేశ్వరుని నుండి పుట్టు మాయ తన విలాసమున పరశమ్భువుయొక్క సంసారిత్వమును చూపుచుండగా దానిలోని ఏకదేశమైన వేదవిద్య పరమేశ్వరుని సత్యత్వమును దృఢ పఱచుచున్నది.

వివరణము : సాధారణముగా అద్వైత ప్రక్రియలో మాయ అనాది కావున దానికి పుట్టుక లేదని చెప్పబడును. ఈ శ్లోకమున **మాయ పుట్టుచున్నదని** చెప్పబడినది. అనాదిత్వము బ్రహ్మమున కున్నట్లు మాయకును ఉన్నదని చెప్పుటచే మాయకు బ్రహ్మసామ్యము కలుగును.

దీని నిష్టపడని కొన్ని పురాణములలో మాయ యని చెప్పబడు అవ్యక్తము పరమేశ్వరుని నుండి పుట్టినట్లు చెప్పబడినది. **లలితాసహస్రనామభాష్యమున** భాస్కరులును ఈ విషయమును ప్రస్తావించినారు. భాస్కరాది శాక్తేయులు మాయామయమైనను జగము సత్యమందురు. కావున మాయయును సత్యమే. అదియే పరశమ్భువునకు సంసారిత్వమును కలిగించును. 2. వేదమనాది యని మీమాంసకుల మతము. వేదాంతులలో ఏకదేశులైన కొందఱు వేదము బ్రహ్మకృతమందురు. ఉచ్ఛ్వాస నిఃశ్వాసములు జీవుని నుండి పుట్టుచున్న లోకానుభవము కూడ ప్రసిద్ధమైనందున బ్రహ్మము యొక్క ఉచ్ఛ్వాసనిఃశ్వాసరూపమైన వేదము కూడ బ్రహ్మము నుండి పుట్టిన దందుఱు. కావున వేదవిద్యకూడ బ్రహ్మము నుండి పుట్టుచున్నట్లు ఈ శ్లోకమున చెప్పబడినది. సత్య బ్రహ్మ ప్రతిపాదకమైన వేదవిద్యయు సత్యమే. వేదవిద్యయే అసత్యమైనప్పుడు తత్ప్రతిపాద్య బ్రహ్మము సత్యమెట్లగును. కావున సత్యమైన వేదవిద్య ఇంద్రియాదిగోచరము కాని బ్రహ్మము సత్యమే యని చెప్పి బ్రహ్మము యొక్క సత్యత్వమును దృఢపఱచుచున్నది. అట్లే కుండను చూచి కుమ్మరి యున్న ట్లూహించు కొందుము. జగమును చూచిన దానికొక కర్త యుండునను అనుమానప్రమాణముచే బ్రహ్మము యొక్క సత్యత్వము తెలియబడినను ఆ అంశమును వేదవిద్య మరల చెప్పుటచే ఆ వేదవిద్య భ్రమ ప్రమాదాది దోషరహిత బ్రహ్మము నుండి పుట్టినదగుటచే బ్రహ్మము (పరశమ్భువు) యొక్క సత్యత్వము నా వేదవిద్య దృఢపఱచుచున్నది అని ఈ శ్లోకమున చెప్పబడినది. 3. అయినను ఈ శ్లోకము అసుఖములైన ప్రమాణ ప్రమేయ ప్రమితి భేద భిన్నములైన భిన్నభిన్నములైన సాంఖ్యాది సిద్ధాంతములు ప్రతిపాదించు జీవ జగదీశ్వర భేదము ననుసరించు వారికి సంసారిత్వము పెఱుగునేకాని తఱగదని ఆ సిద్ధాంతము లసుఖములని నిందించి అభేదమును ప్రతిపాదించు వేదవిద్యను కొనియాడుచున్నది. మాయ ఈశ్వరుని సంసారిత్వమును ప్రసారింపగా వేదవిద్య దానిని వృత్తిని చేయు పరశమ్భువు సత్యత్వమును దృఢపరుచుచున్నది. ఇట్లు పరశమ్భువు మాయచే జీవిగా సంచరించుచు తిరిగే వేదవిద్యద్వారమున తన స్వస్వరూపమును గ్రహించి పరశంభుత్వము నందుకొను ననుచున్నది. ఇట్లు **జీవేశ్వరైక్యము ఈ శ్లోకమున చెప్పబడినది.** లోకమున దృశ్యమైనది జగత్తు. ఈశ్వరు డదృశ్యుడు. అవి రెండు సత్యములే. వీని భేదము మాత్రము మిథ్య. భేదమునకే మిథ్యాత్వము నంగీకరించుటచే నీ శ్లోకమున అద్వైతమే ప్రతిపాదింపబడిన దనుట సూక్ష్మేక్షికతో గ్రహింప దగియున్నది. **చిద్వివర్తః ప్రపంచోఽయమ్** అనునది శంకరాద్వైత సిద్ధాంతము కాగా **చిద్విలాసప్రపంచోఽయమ్** అనునది శాక్తశైవాద్వైత సిద్ధాంతము. వివర్తవాదము, జగన్మిథ్యాత్వమును విలాసవాదము జగదీశ్వర భేద మిథ్యాత్వమును చెప్పును. జగదీశ్వర జీవులు అభిన్నులే యనుట పై మూటిలో ఏదియు మిథ్య కాదనుట శైవా (శాక్తా) ద్వైతసిద్ధాంతము. 4. ఇంతకు మాయ యననేమి? అది

యొక శక్తి. శక్తి అప్రత్యక్షము కాని అది యొక కార్యము నిర్వర్తించును. నిర్వర్తించిన పిమ్మట అది ఉన్నట్లు వ్యక్తమగును. కార్యము నిర్వర్తించుటకు పూర్వము అది ద్రవ్యముతో నేకీభూతమై యుండును. ద్రవ్యము నందది యున్నట్లు ప్రత్యక్షముగ తెలియబడదు కాని ఆ ద్రవ్యము వలన నొక కార్యము జరిగినదనగా ఆ కార్యమును నిర్వర్తించు శక్తి ఆ ద్రవ్యమున నున్నది అని అనుమానింప బడవలసినదే కావున ఆ శక్తి ఏ ద్రవ్యమున ఉన్నట్లు చెప్పలేము. అందుచే శంకరాద్వైతులు దానిని అనగా ఆ శక్తిని ఆ మాయను అనిర్వచనీయమనిరి. మాయను శక్తి అనుటకూడ శంకరాదద్వైతుల కిష్టమే. శ్లోకమున మాయకు **త్రిగుణముఖగణవ్యక్తశక్తిస్వభావా** అను విశేషణమున్నది. త్రిగుణులనగా త్రిమూర్తులు, బ్రహ్మవిష్ణుమహేశ్వరులు. వారు రజస్సత్త్వ తమోగుణములచే జగముల సృష్టిస్థితిలయముల నొనర్తురు కావున వారు త్రిగుణులనబడినారు. వీరు ముగ్గుఱు త్రిగుణ గణము. అట్లే పంచ భూతములు మరొక గణము. ఏకాదశేంద్రియములు మరొక గణములు. ఇట్టివే ప్రాణోపప్రాణ పంచకాదు లెన్నో గణము లున్నవి. ఈ గణములు అన్నియు మాయికములు మాయోత్పన్నములు. మాయ వీనిని పుట్టించు శక్తి. వీని వలన మాయ శక్తి అని తెలియును. అనగా త్రిగుణముఖగణముల చేత తెలియ అనుమానింప బడునది శక్తి స్వభావము. శక్తి ద్రవ్యముయొక్క స్వభావమే. ప్రపంచముల పుట్టించి కాపాడి చంపుట పరశమ్భువు యొక్క స్వభావము. ఈ స్వభావము మాయ అని శక్తి అని చెప్పబడును. ఈ శ్లోకమున మాయ బ్రహ్మము యొక్క త్రిగుణముఖ గణవ్యక్తశక్తిచే ఆ బ్రహ్మము నందు గల శక్తిస్వభావము అనుమానింపబడుచున్నదని చెప్పబడినది. అంతేకాదు మాయ ఆ శక్తి స్వభావరూపమనియు తెలియబడుచున్నది. ఇట్లు వ్యక్త శక్తి స్వభావములు గల మాయ పుట్టి బ్రహ్మముయొక్క సంసారిత్వమును ప్రసరింపజేయగా తదేక దేశమైన వేదవిద్య తిరిగి బ్రహ్మముయొక్క స్వస్వరూపమును అనుభవములోనికి తెచ్చు చున్నది. మఱియు **'పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే'** అను శ్రుతి ననుసరించి ఆ మాయయే అవిద్య యని (సంసారిత్వమును విస్తరించు సమయమున) స్వరూపము ననుభవింప జేయునప్పుడు విద్య యనియు పిలువబడును. ఇంకను పెక్కు ద్రవ్యములలోని వివిధ శక్తులన్నియు ఆ పరాశక్తి యొక్క వైవిధ్యములని యెఱుగవలెను. ఈ సిద్ధాంతమున మాయ యనునది మూలశక్తి కాదు. పరాశక్తి మాత్రము మూలశక్తి. **పరాశక్తి గల పరమేశ్వరుని నుండి మాయ పుట్టుచున్నదని** ఈ శ్లోకము వలన తెలియుచున్నది.

ఎన్నడొ నీ ప్రకాశమున నేర్పడు మాయ గుణత్రయాది స
మ్పన్న నిజాత్మశక్తికత భావిత భేదమతి ప్రధానముల్
భిన్నసుమానమేయమితి విస్తృత దుఃఖకరోక్తిజాలముల్
పన్నుచు సంసృతిన్ బెనుచు-త్వత్పరసత్యత cదెల్పు వేదముల్. ✦...(సశేషం)

శ్రీ నీలకణ్ఠదీక్షితవిరచిత

ఆనందసాగరస్తవః

– వ్యాఖ్యాత – డా॥ ఈ.వి.యస్.మూర్తి, బాపట్ల

అవతారిక : అమ్మా! నేను జీవించినా, మరణించినా, తప్పు చేసినా ఏదీ నాదోషం కాదు. అంతా నీ ప్రేరణే కదా! అంటున్నాడు కవి.

శ్లో॥ త్వత్ప్రేరణేన మిషతః శ్వసతోఽపి మాతః
ప్రామాదికేఽపి సతి కర్మణి మే న దోషః ।
మాత్రైవ దత్తమశనం గ్రసతః సుతస్య
కో నామ వక్ష్యతి శిశోరతిభుక్తిదోషమ్ ॥ 38

పదవిభాగము : త్వత్ప్రేరణేన, మిషతః, శ్వసతః, అపి, మాతః, ప్రామాదికే, అపి, సతి, కర్మణి, మే, న, దోషః, మాత్రా, ఏవ, దత్తమ్, అశనమ్, గ్రసతః, సుతస్య, కః, నామ, వక్ష్యతి, శిశోః, అతిభుక్తిదోషమ్.

అన్వయము : మాతః త్వత్ప్రేరణేన మిషతః శ్వసతః అపి, ప్రామాదికే కర్మణి సతి అపి మే న దోషః. మాత్రాదత్తమ్ అశనమ్ ఏవ గ్రసతః శిశోః సుతస్య అతిభుక్తిదోషం, కః నామ వక్ష్యతి.

అర్థము : తత్ప్రేరణేన = నీయొక్క ప్రేరణ వల్లనే, మిషతః = కళ్ళు రెపరెపలాడిస్తున్న, శ్వసనః = ఊపిరి తీస్తున్న వాడిని, అపి = అవుతున్నా, ప్రామాదికే = కూడిన, కర్మణి = పని, సతి అపి = చేసినప్పటికీ, మే = నా యొక్క, న దోషః = దోషం లేదు. మాత్రా = తల్లిచేత , దత్తమ్ = ఇవ్వబడిన, అశనం ఏవ = ఆహారాన్నే, గ్రసతః = తీసుకుంటున్న, శిశోః = చిన్నవాడైన, సుతస్య = బాలుని విషయంలో, అతిభుక్తిదోషమ్ = అధికంగా తిన్నాడనే తప్పును, కో నామ = ఎవడు మాత్రం, వక్ష్యతి = చెప్తాడు.

భావము : అమ్మా! నీ అనుమతితోనే ప్రేరణతోనే నేను శ్వాసిస్తున్నాను, జీవిస్తున్నాను. అట్టి నేను ప్రమాదవశాత్తు చిన్నదో పెద్దదో తప్పు చేసినా అది నా తప్పుకాదు. నేనేది చేసినా కారణం నీ ప్రేరణేకదా! ఏమీ తెలియని శిశువు తల్లి పెట్టిన ఆహారాన్నే తింటున్నప్పుడు, వానిమీద అతిభుక్తి దోషాన్ని ఎవరూ ఆరోపించరు కదా! నేను నీవాడను.

నేనేం చేసినా అది నీదే అంటున్నాడు కవి.

విశేషములు : 12 సంవత్సరాల వరకు బాలురు చేసిన పాపపుణ్యాలు తల్లిదండ్రుల ఖాతాలోనే జమ అవుతాయనే విషయం ప్రచారంలో ఉంది. నిజమే కదా! కవి తనను తాను తల్లికి అర్పించుకున్నాననే విషయాన్ని పరిపరివిధాలుగా అమ్మకు విన్నవించు కుంటున్నాడు. లోతుగా ఆలోచిస్తే – మనం ఆలోచించాలనుకుంటే ఆలోచిస్తున్నామా? ఆలోచనలు వస్తుంటే మనం సాక్షిగా ఉండి చేస్తున్నామనుకుంటున్నామా? అసలు నేను అంటే ఏమిటి? శరీరమా, మనస్సా మరేదైనానా? ఇవన్నీ అనుకున్న వానికి స్వతంత్ర స్పందన ఉందా? మరి దేని వల్లనయినా ఇవన్నీ స్పందిస్తున్నాయా? వెలుగు ట్యూబ్‌లైటుదా? అందులో ప్రవహిస్తున్న విద్యుత్తుదా? రెంటిదీనా? విద్యుత్ లేనప్పుడు బల్బు వెలుగుతుందా! ఇవన్నీ ప్రశ్నలే. ఇన్ని ప్రశ్నించుకోవటమే కవి ప్రత్యేకత.

వ్యాకరణవిశేషాలు :

సంధులు : 1. శ్వసతః + అపి = శ్వసతోఽపి, విసర్గసంధి. విసర్గ స్థానంలో 'ఓ' రావటమే కాక ప్రక్కనున్న 'అ'కు లోపం వచ్చింది.

2. ప్రామాదికే + అపి = ప్రామాదికేఽపి, పూర్వరూపసంధి. ఇచట ఏ+అ = 'ఏ' గా మారింది. పూర్వపరములకు పూర్వమే ఆదేశంగా వచ్చుట పూర్వరూపసంధి.

3. మాత్రా + ఏవ = మాత్రైవ, ఆ + ఏ > ఐ, వృద్ధిసంధి

4. కః + నామ = కో నామ, ః > ఓ, విసర్గసంధి

సమాసాలు : 1. త్వత్తః ప్రేరణం త్వత్ప్రేరణం తేన తత్ప్రేరణేన పంచమీ తత్పురుష సమాసం.

2. అతిశయేన భుక్తి అతిభుక్తిః, అతిభుక్తిరేవ దోషః అతిభుక్తిదోషః, తం అతిభుక్తిదోషం. రూపక సమాసం / కర్మధారయంలోని ఒక భేదం.

ధాతువులు : **వక్ష్యతి** – వక్ష్యతః – వక్ష్యన్తి

వచపరిభాషణే అని ధాతువు, మాట్లాడుట అర్థం. లృట్ లకారం, ప్రథమ పురుష, ఏకవచనం.

✦.... (సశేషం)

బ్రహ్మసూత్రాలు (20)

ఓం

బ్రహ్మసూత్రశాఙ్కరభాష్యమ్ ఆన్ధ్రభాషానువాదేన సమన్వితమ్

వ్యాఖ్యాత - మేళ్ళచెఱ్వు వేఙ్కట సుబ్రహ్మణ్యశాస్త్రి, తెనాలి.

జిజ్ఞాసువుల కొఱకు 'బ్రహ్మసూత్రముల'కు జగద్గురు శ్రీ శంకరాచార్యులవారు అందించిన భాష్యము, దానికి మేళ్లచెర్వువారు చేసిన ఆంధ్రానువాదము – 'ఆత్మజ్యోతి' పాఠకులకు అందించబడుతున్నవి. శాస్త్రగ్రంథము కావున సునిశిత దృష్టితో అధ్యయనము చేస్తూ ఆస్వాదించవలసినదని భావిస్తూ.... – రామోరా.

భాష్యమ్ 76 : సూ. **నేతరో-నుపపత్తేః 1.1.16**

ఇతశ్చానన్దమయః పర ఏవాత్మా నేతరః. ఇతరః ఈశ్వరాదన్యః సంసారీ జీవ ఇత్యర్థః. న జీవ ఆనన్దమయశబ్దేనాభిధీయతే. కస్మాత్? అనుపపత్తేః. ఆనన్దమయం హి ప్రకృత్య శ్రూయతే – "**సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి. స తపోఽతప్యత, స తపస్తప్త్వా ఇదం సర్వమసృజత, యదిదం కిఞ్చ**" (తై.ఉ. 2.6) ఇతి. తత్ర ప్రాక్ శరీరాద్యుత్పత్తేః అభిధ్యానం, సృజ్యమానానాం చ వికారాణాం స్రష్టురవ్యతిరేకః, సర్వవికారసృష్టిశ్చ న పరస్మాదాత్మనోఽన్యత్రోపపద్యతే.

అను. 76 : సూ. "**కుదరదు గనుక జీవుడానందమయుడు గాడు**"

ఈ కారణం వలనగూడా ఆనందమయుడు పరమాత్మయే. ఇతర జీవుడు కాడు. జీవునకు ఆనందమయ శబ్దం వర్తించదు. – ఎందువలన? – కుదరదుగనుక. ఆనందమయుని మొదలు పెట్టి 'శ్రుతి' ఇలా చెప్పింది. "నేను "బహు" కావలెను. ఆయన తపము చేసెను. తపస్సు చేసి సమస్తమును సృష్టించెను." (తై) శరీరాదులు పుట్టకమునుపే ఆలోచించటం, సృష్టించబడిన యీ మార్పులు (జగత్తు) స్రష్టకన్న భిన్నం కాక పోవటం, సమస్త వికారాలు సృష్టించటం – ఇదంతా పరమాత్మ వల్ల తప్ప ఇతరుల వల్ల సాధ్యం కాదు.

భాష్యమ్ 77 : సూ. **భేదవ్యపదేశాచ్చ 1.1.17**

ఇతశ్చ నానన్దమయః సంసారీ, యస్మాదానన్దమయాధికారే – "**రసో వై సః రసం హ్యేవాయం లబ్ధ్వానన్దీ భవతి**" (తై. 2.7) ఇతి జీవానన్దమయౌ భేదేన వ్యపదిశతి. న హి లబ్ధైవ లబ్ధవ్యో భవతి. కథం తర్హి "**ఆత్మాఽన్వేష్టవ్యః**" "**ఆత్మలాభాన్న పరం విద్యతే**" ఇతి శ్రుతిస్మృతీ, యావతా న లబ్ధైవ లబ్ధవ్యో భవతీత్యుక్తమ్? బాఢమ్. తథాప్యాత్మనోఽ

ప్రచ్యుతాత్మభావస్యైవ సతస్తత్త్వానవబోధనిమిత్తో మిథ్యైవ దేహాదిష్వనాత్మస్వాత్మత్వనిశ్చయో లౌకికో దృష్టః తేన దేహాదిభూతస్యాత్మనోఽ ప్యాత్మానన్విష్టోఽన్వేష్టవ్యోఽలబ్ధో లబ్ధవ్యః అశ్రుతః శ్రోతవ్యః అమతో మన్తవ్యః అవిజ్ఞాతో విజ్ఞాతవ్యః ఇత్యాదిభేదవ్యపదేశ ఉపపద్యతే. ప్రతిషిధ్యత ఏవ తు పరమార్థతః సర్వజ్ఞాత్పరమేశ్వరాదన్యో ద్రష్టా శ్రోతా వా "**నాన్యోఽతోఽస్తి ద్రష్టా**" (బృ.ఉ.3.7.23) ఇత్యాదినా, పరమేశ్వరస్త్వవిద్యాకల్పితాచ్ఛారీరాత్కర్తుర్భోక్తుర్వి జ్ఞానాత్మాఖ్యాదన్యః, యథా మాయావినశ్చర్మ ఖడ్గధరాత్సూత్రేణాకాశమధిరోహతః స ఏవ మాయావీ పరమార్థరూపో భూమిష్ఠోఽన్యః, యథా వా ఘటాకాశాదుపాధిపరిచ్ఛిన్నా దనుపాధిపరిచ్ఛిన్న ఆకాశోఽన్యః, ఈదృశం చ విజ్ఞానాత్మపరమాత్మభేదమాశ్రిత్య "నేతరోఽనుపపత్తేః", "భేదవ్యపదేశాచ్చ" ఇత్యుక్తమ్.

అను.77 : సూ. "**భేదం చెప్పటం వలన గూడా**"

ఇందువలన గూడా సంసారి జీవుడానందమయుడు గాడు. ఎందుకంటే 'ఆనందమయాధికారంలో, "ఆయనయే రసము, రసమును పొందియే ఇతడు ఆనందమగును (తై) అని జీవానందమయులు వేరయినట్లు చెప్పినారు. పొందేవాడు పొందబడేవాడూ ఒక్కరేకారుగదా. వేరేగదా! అలాఅయితే "ఆత్మను వెదకవలెను" "ఆత్మ లాభంకన్న గొప్పదిలేదు" అని శ్రుతిస్మృతులు చెప్తున్నాయి. అంటే పొందేవాడే (తనే) పొందబడాలనిగదా! మరి మీరెలా చెప్తున్నారు. "పొందేవాడు పొందబడడని?" – నిజమే – ఆత్మ ఎపుడూ ఆత్మగానే ఉంటుంది. దాని ఆత్మభావం జారదు. అయినా తత్త్వం తెలియక పోవటం వలన (మాయవలన) అనాత్మలయిన దేహాదులనే ఆత్మగా భావిస్తాడు. ఇది లోక సిద్ధమే. ఇది మిథ్యాభిమానము. దీనివలన దేహేంద్రియ మనస్సులుగా అయిన ఆత్మకు గూడా తన ఆత్మను (తన అసలు స్వరూపము) అన్వేషించి తెలిసికొనవలసిన పరిస్థితి ఏర్పడింది. (ప్రమాదంలో జ్ఞాపకశక్తి కోల్పోయినవాడు తనను తానే అంచనా వేసి కొనవలసివచ్చినట్లు) వెదకబడనివాడు వెదకబడవలసినవాడయినాడు. పొందబడనివాడై పొందదగినవాడయినాడు. వినబడనివాడై వినబడవలసిన వాడయినాడు. తెలియబడనివాడై తెలియబడవలసిన వాడయినాడు. మననం చేయబడనివాడై మననం చేయవలసిన వాడయినాడు. అందువలన ఇట్టి భేదాలు వచ్చినాయి. కాని పరమార్థరీత్యా మాత్రం సర్వజ్ఞుడయిన పరమేశ్వరుని కన్న మరొక ద్రష్ట గాని జ్ఞాతగాని లేదు. చూడండి 'ఇతనికన్న మఱొక ద్రష్ట లేదు"(బృ) అవిద్యాకల్పితుడై శరీరంలో అభిమానంగా ఉన్న ఫలభోక్త అయిన 'విజ్ఞానాత్మ' అనే జీవునికన్న పరమేశ్వరుడతీతుడే. ఒక గారడీవాడు (కనుకట్టు) తనవంటి మఱొక వ్యక్తిని కల్పించి వానికి ఖడ్గం చర్మం ఇచ్చి త్రాడుమీద ఆకాశంలోనడిపిస్తాడు. కాని తాను మాత్రం వాస్తవంగా భూమిమీదనే ఉంటాడు. అలాగే ఉపాధిరహిత విశాలాకాశము, పైన, ఘటంలోనున్న ఘటాకాశం, క్రింద, విడిగా ఉంటుంది. కాని తత్త్వరీత్యా గారడీవాడు మాయాపురుషుడు ఒక్కరే. ఆకాశము ఘటాకాశమూ ఒక్కటే.

అలాగే పరమాత్మ – విజ్ఞానాత్మ (జీవుడు) తత్త్వరీత్యా ఒక్కరే. శరీరం వలననే భేదము. ఇటువంటి భేదాన్ని బట్టియే "నేతరోనుపపత్తేః" అని, "భేదవ్యపదేశాచ్చ" అని సూత్రాలు బయలుదేరాయి.

భాష్యమ్ 78 : సూ.**కామాచ్చ నానుమానాపేక్షా. 1.1.18**

ఆనన్దమయాధికారే చ "**సోఽకామయత బహు స్యాం ప్రజాయేయ**" ఇతి కామయితృత్వ నిర్దేశాత్ నానుమానికమపి సాంఖ్యపరికల్పితమచేతనం ప్రధాన మానన్దమయత్వేన కారణత్వేన వాపేక్షితవ్యమ్. "ఈక్షతేర్నాశబ్దమ్" (బ్ర.సూ. 1.25) ఇతి నిరాకృతమపి ప్రధానం పూర్వసూత్రోదాహృతాం కామయితృత్వశ్రుతిమాశ్రిత్య ప్రసంగాత్పునర్నిరాక్రియతే, గతిసామాన్యప్రపఞ్చనాయ.

అను. 78 : సూ. " **'కోరటం' వలన అనుమాన కల్పితమయిన ప్రధానంతో పనిలేదు**".

ఆనందమయాధికారంలో అనగా ఆనందమయమును గూర్చి చెప్పే ఘట్టంలో "అతడు తాను 'బహు' కావలెనని కోరెను" అని కోరువానిగా చెప్పటంవలన ఈశ్వరుడే జగత్కారణమని చెప్పాలి. సాంఖ్యులు ఊహాత్మకంగా కల్పించిన అచేతనమయిన ప్రధానాన్ని ఆనందమయమని చెప్పి జగత్కారణ పదార్థం అదే అనరాదు. "ఈక్షతేర్నాశబ్దమ్" అను సూత్రం వద్ద ఈ ప్రధానజగత్కారణవాదం 'సంకల్పం' కారణంగానే నిషేధింపబడింది. అదే విషయాన్ని ఈ సూత్రంలో "అకామయత" అను శ్రుతి నాధారంగా చేసికొని మరల నిషేధిస్తున్నారు. ఎందుకంటే వేదవాక్యాల గమ్యం "ఈశ్వరుడు జగత్కారణమని" మరల గట్టి చేయటమే గదా!

భాష్యమ్ 79 : సూ.**అస్మిన్నస్య చ తద్యోగం శాస్తి. 1.1.19**

ఇతశ్చ న ప్రధానే జీవే వానన్దశబ్దః, యస్మాదస్మిన్నానన్దమయే ప్రకృత ఆత్మని ప్రతిబుద్ధస్యాస్య జీవస్య తద్యోగం శాస్తి. తదాత్మనా యోగస్తద్యోగః, తద్భావాపత్తిః, ముక్తిరిత్యర్థః, తద్యోగం శాస్తి శాస్త్రమ్ – "**యదా హ్యేవైష ఏతస్మిన్నదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విన్దతే, అథ సోఽభయం గతో భవతి, యదా హ్యేవైష ఏతస్మిన్నుదరమన్తరం కురుతే, అథ తస్య భయం భవతి**" (తై.ఉ. 2.7) ఇతి. ఏతదుక్తం భవతి – యదైతస్మిన్నానన్దమయేఽల్పమప్యన్తరమతాదాత్మ్యరూపం పశ్యతి తదా సంసారభయాన్న నివర్తతే. యదాత్వేవాస్మిన్నానన్దమయే నిరన్తరం తాదాత్మ్యేన ప్రతితిష్ఠతి తదా సంసారభయాన్నివర్తత ఇతి. తచ్చ పరమాత్మపరిగ్రహే ఘటతే న ప్రధానపరిగ్రహే జీవపరిగ్రహే వా. తస్మాదానన్దమయః పరమాత్మేతి స్థితమ్.

అను. 79 : సూ. "**ఈయనయందు వీనికి తాదాత్మ్యమును చెప్పుచున్నది.**"

ఇందువలన గూడా ఆనందశబ్దము ప్రధానమును గాని జీవుని గాని చెప్పదు. ఎందుకంటే,

ఈ ఆనందమయుడయిన ప్రస్తుత – ఆత్మయందు మేల్కొన్నవానికి అనగా ఆత్మజ్ఞానము పొందిన జీవునికి ఆత్మతో యోగము అనగా ఆత్మ భావమును (ముక్తిని) శాస్త్రము చెప్తున్నది. చూడండి. "స్థూలశరీరం (దృశ్యము) లేనిది సూక్ష్మశరీరం లేనిది, వాక్కులకందనిది, మాయాశూన్యము – అయిన ఆత్మయందు నిర్భయమయిన ఐక్యమును పొందువాడు అభయమును పొందును". "ఎపుడయితే కొంచెమయినా భేదమును భావిస్తాడో అపుడతనికి భయం కలుగుతుంది" (తై). దీని సారాంశమిది – "ఆనందమయుడయిన వీనియందు ఎవడు అల్పమయిన భేదమునైన – తాదాత్మ్యవిరుద్ధంగా – భావిస్తాడో వానికి సంసారభయం పోదు. ఎవడయితే ఈ ఆనందమయునిలో నిరంతరం తాదాత్మ్యంతో ఉంటాడో వానికి సంసార భయము లేదు. ఈ విషయం ఆనందమయుడు ప్రధానమయితే కుదరదు. జీవుడయినా కుదరదు. పరమాత్మ అయితేనే కుదురుతుంది. కనుక ఆనందమయుడు పరమాత్మయే అని నిశ్చయము. (ఇంతవరకు **వృత్తికారమతము).**

భాష్యమ్ 80 : ఇదం త్విహ వక్తవ్యమ్ – "**స వా ఏష పురుషోఽన్నరసమయః**", "తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాత్, అన్యోఽన్తర ఆత్మా ప్రాణమయః" "**తస్మాత్ అన్యోఽన్తర ఆత్మా మనోమయః**" "తస్మాత్ అన్యోఽన్తర ఆత్మా విజ్ఞానమయః" (తై.ఉ. 2.1.2,3,4) ఇతి చ వికారార్థే మయట్ ప్రవాహే సత్యానన్దమయ ఏవాకస్మాదర్ధ జరతీన్యాయేన కథమివ మయటాప్రాచుర్యార్థత్వం బ్రహ్మవిషయత్వం చాశ్రీయత ఇతి. మాన్త్రవర్ణికబ్రహ్మాధికారాదితి చేత్, న. అన్నమయాదీనామపి తర్హి బ్రహ్మత్వప్రసఙ్గః.

అను. 80 : ఇక్కడ ఒక విషయం చెప్పాలి – "ఆ యీ పురుషుడన్నరసమయుడు, ఈ అన్నరసమయుని కన్న ఇంకా దగ్గరి ఆత్మ 'ప్రాణమయుడు, ఇతనికన్న దగ్గరనున్న లోపలి ఆత్మ మనోమయుడు, ఇతనికన్న ఆంతరుడు విజ్ఞానమయుడు (తై). ఇలా 'వికారం = మార్పు' అనే అర్థంగల 'మయ' ప్రత్యయాల ప్రవాహంలో అకస్మాత్తుగా 'ఆనందమయ' వద్ద 'మయ'కు ప్రచురమయిన, అధికంగాగల అని అర్థమెలా చెప్పటము? ఇది **అర్ధజరతీన్యాయము**. (అంటే ఒక స్త్రీని సగం ముసలి అని సగం యువతి అనటం. ఒక కాముకుడు ఒక వృద్ధ స్త్రీ యొక్క అర్ధ శరీరాన్ని మాత్రం యువతిగా భావించి పొందదలచటం. అంటే పూర్తిగా ముసలిదని భావించాలి. లేదంటే యువతి అనాలి. అవసరం కోసం ఇలా అనటం తప్పు. ఇది అర్ధజరతీన్యాయం. అలాగే 'మయ' అంటే ఆసందర్భమంతా 'వికారం' అని చెప్పాలి లేదా ప్రచురం అని చెప్పాలి. అంతేగాని సగం అలా సగం ఇలా అని చెప్పటం అవకాశవాదము) అలా చెప్పి 'ఆనందమయ' వద్ద బ్రహ్మమని అర్థం చెప్పటం తప్పు. మంత్రంలో ముందు బ్రహ్మం చెప్పబడినది గనుక అలా చెప్పవచ్చునంటారా? – అలా అయితే అన్నమయ, ప్రాణమయ వంటి చోట్ల నున్న స్థూల శరీరాభిమానులను బ్రహ్మములుగానే చెప్పాలి. ✦ .... (సశేషం)

॥ द्वादशस्तोत्रम् ॥ (8)

वन्दिताशेषवन्द्योरुवृन्दारकं चन्दनाचर्चितोदारपीनांसकम् ।
इन्दिराचञ्चलापाङ्गनीराजितं मन्दरोद्धारिवृत्तोद्भुजाभोगिनम् ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 1

सृष्टिसंहारलीलाविलासाततं पुष्टषाड्गुण्यसद्विग्रहोल्लासिनम् ।
दुष्टनिश्शेषसंहारकर्मोद्यतं हृष्टपुष्टानुशिष्टप्रजासंश्रयम् ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 2

उन्नतप्रार्थिताशेषसंसाधकं सन्नतालौकिकानन्ददश्रीपदम् ।
भिन्नकर्माशयप्राणिसंप्रेरकं तन्न किं नेति विद्वत्सु मीमांसितम् ॥
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् । 3

विप्रमुख्यैः सदा वेदवादोन्मुखैः सुप्रतापैःक्षितीशेश्वरैश्चार्चितम् ।
अप्रतर्क्योरुसंविद्गुणं निर्मलं सप्रकाशाजरानन्दरूपं परम् ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 4

अत्ययो यस्य केनापि न क्वापि हि प्रत्ययो यद्गुणेषोत्तमानां परः ।
सत्यसंकल्प एको वरेण्यो वशी मत्यनोनैः सदा वेदवादोदितः ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 5

पश्यतां दुःखसन्ताननिर्मूलनं दृश्यतां दृश्यतामित्यजेशार्चितम् ।
नश्यतां दूरगं सर्वदाऽप्यात्मगं वश्यतां स्वेच्छया सज्जनेष्वागतम् ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 6

अग्रजं यः ससर्जाजमग्र्याकृतिं विग्रहो यस्य सर्वे गुणा एव हि ।
उग्र आद्योऽपि यस्यात्मजाग्र्यात्मजः सद्गृहीतः सदा यः परं दैवतम् ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 7

अच्युतो यो गुणैर्नित्यमेवाखिलैः प्रच्युतोऽशेषदोषैः सदा पूर्तितः ।
उच्यते सर्ववेदोरुवादैरजः स्वर्चितो ब्रह्मरुद्रेन्द्रपूर्वैः सदा ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 8

धार्यते येन विश्वं सदाऽजादिकं वार्यतेऽशेषदुःखं निजध्यायिनाम् ।
पार्यते सर्वमन्यैर्न यत्पार्यते कार्यते चाखिलं सर्वभूतैःसदा ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 9

सर्वपापानि यत्संस्मृतेः संक्षयं सर्वदा यान्ति भक्त्या विशुद्धात्मनाम् ।
शर्वगुर्वादिगीर्वाणसंस्थानदः कुर्वते कर्म यत्प्रीतये सज्जनाः ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 10

अक्षयं कर्म यस्मिन् परे स्वर्पितं प्रक्षयं यान्ति दुःखानि यन्नामतः ।
अक्षरो योऽजरः सर्वदैवामृतः कुक्षिगं यस्य विश्वं सदाऽजादिकम् ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 11

नन्दितीर्थोरुसन्नामिनो नन्दिनः सन्दधानाः सदानन्ददेवे मतिम् ।
मन्दहासारुणापाङ्गदत्तोन्नतिं नन्दिताशेषदेवादिवृन्दं सदा ।
प्रीणयामो वासुदेवं देवतामण्डलाखण्डमण्डनम् ॥ 12

॥ इति श्री द्वादशस्तोत्रे अष्टमोऽध्यायः ॥

శ్రీ పండితేంద్ర జగన్నాథ విరచితమ్

అశ్వధాటీకావ్యమ్

వ్యాఖ్యాత - గరిమెళ్ళ సోమయాజులుశర్మ,
విజయవాడ.

కలిదూషణము - వాసుదేవభజనము

అవతారిక : ఈ కలియుగము దావానలము వంటిది. ఓ వాసుదేవా! నీవే నన్ను రక్షింపుమని వేఁడుకొనుచున్నాఁడు.

శ్లో॥ దావాఽనలార్చి రివ-తావా నయం తపతి-హా! వామ్యకృత్ కలి రహెూ!
కోవాఽ పర స్త్వదిహ-భో వాసుదేవ! మమ-యో వారయేత త మిమమ్ ।
సేవా విధాన భృశ-హేవాకసిద్ధముని-దేవాఽధునా చరణయో
ర్భావాఽఽనతాయ శిశు-భావాఽఽశ్రితాయ వితర-రాఽఽవాసతాం నిజముదామ్॥ ౧౯

వ్యాఖ్య : తావాన్ = ఎక్కువ పరిమాణము గల; వామ్యకృత్ = కుటిలత్వమును గల్గఁజేయు; అయమ్ = ఈ; కలిః = కలికాలము; హా! = అయ్యో!; దావ + అనల + అర్చిః + ఇవ = అడవిలోఁ బుట్టిన కారుచిచ్చు మంటల వలె; తపతి = కాల్చుచున్నది. అహెూ = ఆశ్చర్యము. భో వాసుదేవ = ఓ శ్రీకృష్ణా!; ఇహ = ఈ లోకములో; మమ = నాకు; త్వత్ + అపరః = నీ కంటె నన్యుఁడు; యః + కః + వా = మఱొకఁ డెవ్వఁడు; తమ్ + ఇమమ్ = ప్రసిద్ధుఁ డైన యీ కలిపురుషుని - కలిబాధను; వారయేత = నివారింపఁ గలఁడు?. సేవావిధాన = సేవించు పద్ధతి యందు; భృశ = మిక్కిలి; హేవాక = స్పర్ధగలిగిన - అత్యంతాసక్తిగల; సిద్ధ = కపిలాదు లగు సిద్ధులు; ముని = నారదాది మహర్షులు, దేవ = ఇంద్రాది దేవతలు గలవాఁడా!; అధునా = ఇప్పుడు; చరణయోః = నీ పాదము లందు; భావ + ఆనతాయ = భక్తిభావముతో బాగుగా వంగి నమస్కరించువానికి; శిశు భావ + ఆశ్రితాయ = చంటి పిల్లవాని లక్షణముల నాశ్రయించిన నాకు; నిజముదామ్ = నీ స్వస్వరూపానందముల; ఆవాసతామ్ = నివాసస్థానమును; వితర = ఇమ్ము!

తాత్పర్యము : ఈ కలికాల మెక్కువ పరిమాణముతో వక్రమార్గములను గల్గఁజేయుచుఁ గార్చిచ్చు మంటల వలెఁ దాపముతో మండించుచున్నది. ఆశ్చర్యము! అయ్యో! శ్రీకృష్ణా! ఈ లోకములో నీకలిబాధల నుండి న న్నుద్ధరించుటకు నీ కంటె వేఱెవ్వఁడు కలఁడు? కపిలుఁడు మొదలగు సిద్ధులు, నారదుఁడు మొదలగు మహర్షులు, ఇంద్రుఁడు మొదలగు

దేవతలు నేను ముం దన్నచో నేను ముం దని యహమహమికతో మిక్కిలి యుత్కంఠతో నుత్కటాసక్తితో నెక్కువస్పర్ధతో స్వచ్ఛందముగా నిన్ను సేవించుచున్నారు. అట్టి నీ యడుగులను భక్తిభావముతో వంగి నమస్కరించుచుంటిని. నేనేమియుఁ దెలియని పిల్ల వాఁడను. నీ స్వరూపానందములో నివసించుటకు నాకు స్థాన మిమ్ము!

విశేషములు :

1. అగ్ని : అగ్ని మూఁడు విధములు

(1) అడవిలోఁ బుట్టు నగ్ని దావాగ్ని (2) సముద్రములోఁ బుట్టు నగ్ని బడబాగ్ని (3) మన కడుపులో నున్న యగ్ని జఠరాగ్ని.

2. హేవాకము : ఈ శబ్దము సంస్కృత నిఘంటువులలో లేదు. ప్రాచీనసంస్కృత కవులు ప్రయోగింప లేదు.

హేవాకాః = స్పర్ధాయుక్తాః – అని కృష్ణపండితుని దర్పణవ్యాఖ్య. బిల్హణుఁడు మొదలగు మధ్యకాలసంస్కృతకవులు, శ్రీనాథుఁడు మొదలగు తెలుఁగు కవులు ప్రయోగించినారు. శబ్దరత్నాకర – సూర్యరాయాది నిఘంటువులు గైకొన్నవి.

హేవాకము. సం. వి. అ. పుం. ప్రౌఢిమ, తెలివి యని శబ్దరత్నాకరము.

హేవాకము. సం. వి. అ. పుం. అత్యంతాసక్తి. అని సూర్యరాయనిఘంటువు.

ఇది పారసీకపదమో, అరబ్బీపదమో యైయుండు నని 'ఆప్టే' నిఘంటువు.

కం॥ స్థావర రాజ తనూభవ
యా వేళన డాయ వచ్చె నభవుని సేవా
హేవాకప్రౌఢిని వన
దేవత లెంతయును నభిరతిం దనుఁ గొలువన్. (హర–3–67)

అని శ్రీనాథుని హరవిలాసము.

ఇక్కడ 'హేవాకప్రౌఢి – తెలివిడి యందలి గొప్పతనము' – అని శ్రీ బులుసు వేంకట రమణయ్య గారి లఘుటీక.

కం॥ రేవాతరంగశీకర
సేవాహేవాకపాకశిశిరమరుత్ప్ర
స్తావపరికంప్యమానజ
టావలి యగు చతఁడు వింధ్య మల్లనఁజేరెన్. (కాశీ–1–88)

అని శ్రీనాథుని కాశీఖండము.

ఇక్కడ – "సేవా = సేవ యందలి; హేవాక = ప్రౌఢి యొక్క; పాక = పరిపాకము చేత" నని శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మ గారి వ్యాఖ్య. ఈ రెండు వ్యాఖ్యలు శబ్దరత్నాకరము ననుసరించినవి. శబ్దరత్నాకరము చెప్పినట్లు 'హేవాక' శబ్దమునకుఁ 'ప్రౌఢి' యను నర్థమున్నచో 'హేవాకప్రౌఢి' యని శ్రీనాథుఁడు ప్రయోగించి యుండఁడు. ఇది 'యగ్గి నిప్పు' వంటి దగును. కాఁబట్టి 'ఆసక్తి' యను సూర్యరాయనిఘంటువే సరియైనది.

హేవాకః. పుం.

యహ శబ్ద కదాచిత్ ఫారసీ యా అరబీ సే లియాగయా హై 'లటభ' శబ్ద కీ భాంతి ఇసకా ప్రయోగ భీ కల్హణ బిల్హణ ఆది పశ్చాద్వర్తీ సాహిత్యకారోం ద్వారా హీ హుఆ హై।

ఉత్కట ఇచ్ఛా; తీవ్రస్పృహా; ఉత్కంఠా.

శ్లో॥ అస్మిన్నాసీ త్తదను నిబిడాశ్లేషహేవాకలీలా ।
వేల్లద్బాహుక్వణితవలయా సంతతం రాజ్యలక్ష్మీః ॥ (విక్రమాంక–18–102)
అని వామనశివరామ ఆప్టే సంస్కృత – హిందీ కోశము.

దేవాదిభి స్సమయసేవాదరత్వరితహేవాకఘోషముఖరైః । (4–123)
అని శ్రీవేదాంతదేశికుల యాదవాభ్యుదయము.

హేవాకఘోషేణ – స్వచ్ఛందస్తుతిఘోషేణ ।
'హేవాకః – స్వాచ్ఛంద్యమ్' – ఇతి చక్రవర్తీ।
అని శ్రీమదప్పయ్యదీక్షితుల వ్యాఖ్య. ౧౯.

✦ .... (సశేషం)

సంస్కృతభాషాపూర్ణిమ

భగవద్రామానుజాచార్యకృత

శ్రీరంగ గద్యం

(ఆంధ్ర టీకతో)

- వ్యాఖ్యాత - డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

చిదచిత్పరతత్త్వానాం తత్త్వయాథార్థ్యవేదినే ।
రామానుజాయ మునయే నమో మమ గరీయసే ॥

చిదచిత్పరతత్త్వానామ్ = చేతన - అచేతన - ఈశ్వరులనే మూడు తత్త్వాల యొక్క, తత్త్వయథాత్మ్యవేదినే = స్వరూపాలను యథాతథంగా తెలిసినవారైన, మమ గరీయసే = నాకు ఉత్తమాచార్యులైన, రామానుజాయ మునయే = భగవద్రామానుజ మునులకు, నమః = నమస్కారం.

అవతారిక : ఈ గద్యకు శ్రీరంగగద్య అనే వ్యవహారం, మితగద్య అనే పేరు ఉన్నాయి. ఇందులో మొదటి చూర్ణికలో - **"శ్రీరంగశాయినమ్"** అని ప్రయోగించినందువల్ల చివరలో "శ్రీరంగనాథ ! మమ నాథ! నమోఽస్తు తే" అని పల్కినందున శ్రీరంగగద్య అనే పేరు వచ్చినదని భావించాలి. పూర్వగద్య (శరణాగతిగద్య) పెద్దదిగా ఉన్నందువల్ల దానిని "పృథుగద్య" అని, ఇది చిన్నదిగా ఉన్నందువల్ల దీనిని "మిత గద్య" అని పెద్దలు వ్యవహరించారు.

పూర్వగద్యలో వివరంగా తెలుపబడిన విషయమే ఇందులో కూడా సంగ్రహంగా తెలుపబడింది. పూర్వగద్య వలెనే ఈ గద్యకూడా ద్వయమంత్ర వివరణాత్మకంగా ఉన్నది. అది విస్తరరూపం, ఇది సంక్షేపరూపమనే భేదాన్ని ఈ రెండిటిమధ్య గ్రహించాలి. ఇందులోని మొదటి చూర్ణిక కైంకర్యప్రార్థనాపరమైన ద్వయోత్తరఖండార్థం యొక్క వివరణంగాను, రెండవ చూర్ణిక శరణవరణ ప్రదర్శనపరమైన పూర్వఖండార్థం యొక్క వివరణరూపంగాను ఉన్నాయి.

1. స్వాధీనత్రివిధ చేతనాచేతన స్వరూపస్థితి ప్రవృత్తిభేదం, క్లేశకర్మాద్యశేష దోషాసంస్పృష్టం, స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్యవీర్యశక్తి తేజస్సౌశీల్య వాత్సల్య మార్దవార్జవ సౌహార్ద సామ్యకారుణ్య మాధుర్యగామ్భీర్యౌదార్య చాతుర్య స్థైర్య ధైర్యశౌర్య పరాక్రమసత్యకామ సత్యసఙ్కల్ప కృతిత్వకృతజ్ఞతాద్యసఙ్ఖ్యేయ కల్యాణగుణగణౌఘ మహార్ణవం, పరబ్రహ్మభూతం, పురుషోత్తమం, శ్రీరఙ్గశాయినమ్, అస్మత్స్వామినం ప్రబుద్ధ-నిత్యనియామ్య

నిత్యదాస్త్యైకరసాత్మస్వభావోఽహం తదేకానుభవ స్తదేకప్రియః పరిపూర్ణం భగవన్తం విశదతమానుభవేన నిరన్తర మనుభూయ, తదనుభవ జనితానవధికాతిశయ ప్రీతికారితా-శేషావస్థోచితాశేషశేషతైక రతిరూప నిత్యకిజ్కరో భవాని ॥

(**స్వాధీన...**) మూడువిధాలైన చేతనాచేతనాల స్వరూపం, రక్షణం, ప్రవృత్తి నివృత్తులు – అనే వీటిని తన అధీనంలో కల్గినవాడు (ఈ విశేషణం మొదలు ద్వితీయాంత విశేషణాలను అన్నిటినీ "భగవంతమ్" అనే విశేష్యానికి అన్వయించి, "విశదతమానుభవేన నిరంతరం మనుభూయ" అనే ప్రయోగంతో చేర్చాలి)

చేతనులు బద్ధ–ముక్త–నిత్య భేదంతో మూడు విధాలుగా ఉంటారు. అచేతనం – త్రిగుణ కాల – శుద్ధసత్త్వాల రూపంలో మూడు విధాలు. **"త్రివిధ"** అనే విశేషణాన్ని చేతనశబ్దంతో మాత్రం అన్వయించి, అచేతనంలో అన్వయించకుండా కూడా ఉండవచ్చునని దేశికుల అభిప్రాయం. చూర్ణికలో చివర గల 'భేద' అనే పదాన్ని స్వరూపం, స్థితి, ప్రవృత్తులు మూడింటిలో అన్వయించాలి. స్వరూపభేదం, స్థితిభేదం, ప్రకృతి భేదం – అని అర్థాన్ని గ్రహించవచ్చు. ఈ మూడు ప్రత్యేకంగా పలు విధాలుగా ఉండడం గమనించదగినది.

క్లేశకర్మాది + అశేషదోష + అసంస్పృష్టమ్ = అవిద్య మొదలైన అయిదు క్లేశాలు, పుణ్యపాపరూపమైన కర్మలు మొదలైన ఏవిధమైన దోషాలయొక్క సంబంధాన్ని కొంచెం కూడా లేనివాడు – అని భావం.

చేతనాచేతనాలు శరీరంగా, భగవానుడు శరీరిగా ఉన్నట్లయితే, శరీర సంబంధం వల్ల కలిగే దోషం శరీరి అయిన భగవానునకు రాదా? అని అంటే, రాదు – అని ఈ విశేషణాన్ని ప్రయోగించడం ద్వారా తెలుపుతున్నారు. క్లేశాలు ఏవి? అంటే – అవిద్య,

అస్మితా, అభినివేశం, రాగం, ద్వేషం – అని అయిదు. వాటి కార్యాలైన పుణ్యపాపాల రూపంలోని కర్మలు. ఆదిపదంద్వారా విపాకం మొదలైనవానిని గ్రహించాలి.

(స్వాభావికానవధికాతిశయ జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సౌశీల్యవాత్సల్య మార్దవార్జవ సౌహార్దసామ్యకారుణ్య మాధుర్యగామ్భీర్యౌదార్య చాతుర్యస్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ సత్యకామ సత్యసఙ్కల్ప కృతిత్వ కృతజ్ఞతాద్యసఙ్ఖ్యేయ కల్యాణ గుణగణౌఘ మహార్ణవమ్)

“స్వాభావిక, అనవధికాతిశయ” అనే రెండు విశేషణాలు తరువాత చెప్పబడే గుణాలు అన్నిటిలోను అన్వయిస్తాయి. స్వాభావికాలు, నిస్సమాభ్యధికాలు (సాటి అయినవి, మించినవి లేనివి) అయిన షాడ్గుణ్యం మొదలైన కల్యాణగుణాలకు సముద్రంవంటివాడా! అని భావం. ఈ గుణాలు స్వాభావికాలై ఉండడం అంటే నీటికి చల్లదనంవలె, నిప్పుకు వేడిమివలె, నిరుపాధికంగా ధర్మి ఉన్నప్పుడు అంతా ఉండడం. ఒకనాడు ఉన్నవిగాను, వేఱొకనాడు లేనివిగాను కాకుండా, యావదాత్మ భావిగా ఉండడం. ఇందువల్ల నిత్యముక్తుల గుణాలకంటే వీటికి గల వైలక్షణ్యం తెలుపబడింది. వారి గుణాలు భగవానుని ఇచ్ఛను అనుసరించి ఉంటాయి కనుక, అనన్యాధీనత్వమనబడే స్వాభావికత్వం వాటికి లేదు. అనవధికాతిశయత్వమంటే – ప్రతిగుణం అంతు లేని మహిమను కల్గి ఉండడం. పైన పేర్కొనబడే గుణాలలో కొన్ని ఇతరవ్యక్తులలో ఉన్నా, అవి పరిమిత మహిమను కల్గి ఉంటాయి. ఆవిధంగా కాకుండా ఇవి భగవానునిలో ఇంతకుమించి గొప్పతనం ఇంకొకటి లేదు – అనే రీతిలోని గొప్పతనాన్ని కల్గి ఉంటాయి. శ్రీభాష్యంలోని “స్వభావతో నిరస్తనిఖిల దోషానవధికాతిశయాసంఖ్యేయకల్యాణగుణగణః పురుషోత్తమోఽభిధీయతే” అనే సూక్తిని వ్యాఖ్యానిస్తూ శ్రీశ్రుతప్రకాశికాచార్యులవారు “అనవధికాతిశయ” అనే పదం నిత్యసిద్ధుల నుండి వేఱు చేస్తున్నదనే ఒక నిర్వాహాన్ని చూపి, “అనుషక్తేన స్వభావత ఇతి పదేన వా నిత్యసిద్ధవ్యావృత్తిః. తేషాం తాదృశగుణకత్వం హి భగవన్నిత్యే చ్ఛాధీనమ్” అని తరువాత యోజనను పేర్కొనడం అనుసంధేయం.

ఇక, ఈ చూర్ణికలో ప్రస్తావింపబడ్డ దివ్యగుణాలు వివరింపబడుతున్నాయి. జ్ఞానశక్తిబలైశ్వర్య వీర్యశక్తి తేజస్సులు ఆఱు కలిపి షాడ్గుణ్యమనబడతాయి. ఇవియే మిగిలిన అన్ని గుణాలకు ఆకరాలు. వీటిలో, జ్ఞానం అంటే – అన్నిటినీ ఒకేసారి ఎల్లప్పుడు యథాతథంగా తెలియగల్గడం. బలం అంటే – సంకల్పమాత్రంలో సకలపదార్థాలను ఏ శ్రమ లేకుండా ధరించే శక్తి. ఐశ్వర్యం అంటే – సమస్తవస్తువులను నియమించే సామర్థ్యం. వీర్యమంటే – జగత్తుకు ఉపాదానకారణమై ఉన్నా స్వరూపవికారాన్ని ఏమాత్రం కల్గి ఉండకపోవడం. శక్తి అంటే – అఘటిత ఘటనాసామర్థ్యం. తేజస్సు అంటే – దేనికీ ఏ సహకారిని అపేక్షించకుండా ఉండడం. ఈ విధంగా ఇటువంటి షాడ్గుణ్యాన్ని ప్రస్తావించిన

తరువాత, వీటినుండి ఉద్భవించే కల్యాణగుణాలను కొన్నిటిని ఇకపై ప్రస్తావిస్తున్నారు: "సౌశీల్య" అనే పదం నుండి ప్రారంభించి

సౌశీల్యమంటే – గొప్పవారు తనకంటే తక్కువవారితో ఏ భేదం లేకుండా కలిసి వర్తించే స్వభావం. దీనికే శీలగుణమని పేరు. **వాత్సల్య**మంటే – అపుడే ఈనిన దూడ ఒంటిలో ఉండే మలినాన్ని ఆదరించే తల్లి ఆవువలె, ఆశ్రితుల దోషాలను భోగ్యంగా గ్రహించే గుణం. **మార్దవ**మంటే – ఆశ్రితుల విశ్లేషాన్ని సహించలేకపోవడం, **ఆర్జవ**మంటే – కరణత్రయంలో ఋజువుగా ఉండడం. దీనికి సాక్షాత్తు వ్యతిరేకమైన దుర్గుణం కౌటిల్యం. **సౌహార్ద**మంటే – ఎల్లప్పుడు మంచిని గూర్చి చింతించే గుణం. **సామ్య**మంటే – జాతిగుణవృత్తాలలో హెచ్చుతగ్గులను గణించకుండా అందటికి సమానంగా ఆశ్రయించదగిన వాడై ఉండడం. **కారుణ్య**మంటే – దుఃఖించినవారిని చూచి అయ్యో! అని భావించడం. **మాధుర్య**మంటే – చంపాలని తలచే శత్రువులకుసైతం భోగ్యమై ఉండడం. **గాంభీర్య**మంటే – ఆశ్రితులకు తాను చేయదలచినవానిని ఏనాటికీ ఎవరూ తెలిసికోవడానికి వీలు కాని రీతిలో లోతైన హృదయాన్ని కల్గి ఉండడం. **ఔదార్య**మంటే – ప్రతిఫలం ఆశించకుండా చాలా సమృద్ధిగా కోరినవానిని అన్నిటిని కోరినవారికి ఇవ్వడం. **చాతుర్య**మంటే – ప్రతికూలురను కూడ అనుకూలురుగా చేసికోగల్గిన చతురత, **స్థైర్య**మంటే – ఆశ్రితులను ఏనాడూ విడువని గుణం. **ధైర్య**మంటే – ప్రతిపక్షం ప్రబలమై ఉన్నా తృణీకరించడం (లెక్క పెట్టకుండా ఉండడం). **శౌర్య**మంటే – శత్రువుల గొప్ప సమూహంలోకి ఒంటరిగా ఏ జంకు లేకుండా ప్రవేశించడం. **పరాక్రమ**మంటే – ఆ విధంగా యుద్ధభూమిలో ఒంటరిగా ప్రవేశించినా అవలీలగా శత్రువులను భంగపరచగల్గిన నేర్పు.

"సత్యకామ, సత్యసంకల్ప" అనే రెండు భావప్రధాననిర్దేశాలు కనుక, సత్యకామత్వం, సత్యసంకల్పత్వమనే అర్థాన్ని గ్రహించాలి. **సత్యకామత్వ**మంటే – కోరినవానిని అన్నిటినీ ఏ కొఱత లేకుండా సిద్ధించడం, **సత్యసంకల్పత్వం** అంటే – దేనిని చేయాలని అనుకున్నా, ఏ ఆటంకం లేకుండా దానిని పూర్తి చేయగల్గిన శక్తి. కృతిత్వమంటే – భక్తుల కార్యాలను చేస్తూ ఉండడం, కృతజ్ఞత అంటే – భక్తులు కొంచెం మంచిని చేసినా, దానిని ఏనాటికీ మఱువకుండా ఉండడం. ఈవిధంగా ఉండే,

అసంఖేయకల్యాణగుణ గుణ + ఓఘమహార్ణవమ్ = లెక్కించి పూర్తి చేయలేని కల్యాణగుణాలనే ప్రవాహాలకు సముద్రంవంటివాడు.

(పరబ్రహ్మభూతం పురుషోత్తమ్) పరబ్రహ్మశబ్దంతో, పురుషోత్తమశబ్దంతో వేదంలో ప్రసిద్ధుడైనవాడు.

(శ్రీరంగశాయినమ్) శ్రీరంగదివ్యాలయంలో అస్మదాదులుసైతం కళ్ళార దర్శించి ఆనందించేటట్లు శయనించి ఉండేవాడు.

(అస్మత్ స్వామినం పరిపూర్ణం భగవంతమ్) మాకు స్వామి, దేనిలోను ఏ కొఱత లేని భగవానుని (ఈ ప్రయోగాన్ని "అనుభూయ" అనే ల్యబంతక్రియతో అన్వయించాలి)

(ప్రబుద్ధనిత్యనియామ్య నిత్యదాస్యైకరసాత్మస్వభావోఽహమ్) నిత్య నియామ్యమై, నిత్యదాస్యైకరసమైన ఆత్మ స్వభావాన్ని చక్కగా తెలిసికొన్న నేను అని అర్థం. జీవాత్మ నిత్యనియామ్యమై ఉంటుంది, నిత్యదాస్యైకరసంగా ఉంటుంది – అనే స్వభావాలను చక్కగా తెలిసికొన్నట్లు చెప్పబడింది. స్వాధీనస్వార్థకర్తృత్వ భోక్తృత్వభ్రమం లేనిరీతిలో తెలియబడడమే చక్కగా తెలియబడడం. ఈ ఆత్మ భగవానునకు ఒక్కనికే నియామ్యుడుగా, దాసుడుగా ఉన్నాడు – అని బాగా తెలిసికొన్న నేను – అని సారం.

(తదేకానుభవః తదేకప్రియః) – భగవానుని మాత్రమే జ్ఞానానికి, భక్తికి విషయంగా కలవాడనై,

(విశదతమానుభవేన నిరంతరమనుభూయ) – చాలా విశదంగా, విచ్ఛేదం లేకుండా అనుభవించి,

(తదనుభవ జనితానవధికాతిశయ ప్రీతికారితాశేషవస్థోచితాశేషశేషతైక రతి రూప నిత్యకిఙ్కరో భవాని) – ఆ అనుభవంచేత పుట్టిన చాలా గొప్ప ఆనందం చేత చేయించబడే సర్వావస్థోచిత – సర్వవిధ కైంకర్యాలలో చాలా ఆదరాన్ని, ఆసక్తిని కల్గి ఉండడం – అనే నిత్యకైంకర్యంలో నిరతుడనై ఉంటాను.

"శేషతైకరతిః" అనే దానిని బహువ్రీహి సమాసంగా గ్రహించి "నిత్యకింకర" శబ్దానికి విశేషణంగా చేయాలి. అశేషమైన కైంకర్యాలలో చక్కగా అభినివేశాన్ని కల్గిన నిత్య కింకరుడను కాగలను – అని దీని భావం. ఈ విధంగా ఇంతవరకు ద్వయంలోని ఉపేయంలో దృష్టిని కల్గిన ఉత్తరఖండంయొక్క అర్థం వివరింపబడింది.

2. స్వాత్మనిత్యనియామ్య నిత్యదాస్యైకరసాత్మస్వభావానుసన్ధానపూర్వక భగవనవధికాతిశయ స్వామ్యాద్యఖిల గుణగణానుభవజనితానవధికాతిశయ ప్రీతికారితాశేషావస్థోచితాశేషశేషతైకరతిరూప నిత్యకైఙ్కర్యప్రాప్త్యుపాయభూత భక్తి తదుపాయ సమ్యక్జ్ఞాన తదుపాయ సమీచీనక్రియా తదనుగుణ సాత్త్వికతాస్తిక్యాది సమస్తాత్మగుణవిహీనః, దురుత్తరానన్తతద్విపర్యయ జ్ఞానక్రియానుగుణానాది పాపవాసనా మహార్ణవాన్తర్నిమగ్నః, తిలతైలవద్దారువహ్నివ ద్దుర్వివేచత్రిగుణక్షణక్షరణ స్వభావాచేతన

ప్రకృతివ్యాప్తిరూప దురత్యయ భగవన్మాయాతిరోహిత స్వప్రకాశః, అనాద్యవిద్యా సఞ్చితానన్తాశక్య విస్రంసన కర్మపాశప్రగ్రథితః అనాగతానన్తకాల సమీక్ష యాప్యదృష్ట సంతారోపాయః, నిఖిలజన్తుజాతశరణ్య! శ్రీమన్నారాయణ! తవ చరణారవిన్దయుగళం శరణమహం ప్రపద్యే॥

ఇక, ఉపాయంలో దృష్టిని కల ద్వయంలోని పూర్వఖండార్థం వివరింపబడుతున్నది. అందులో "ప్రపద్యే" అని ఉత్తమ పురుషలో వివక్షితమైన ఆకించన్యమనే ప్రపత్తిని చేసేవాని అధికారవిశేషాన్ని, కార్పణ్యమనే అంగాన్ని "స్వాత్మనిత్య..." ఇత్యాదిగా వివరిస్తున్నారు – ఈ రెండవ చూర్ణికలో.

(స్వాత్మనిత్యనియామ్య) = దాసుడనైన నేను ఎల్లప్పుడు నియమింపబడదగినవాడై ఉండడం, (నిత్యదాస్య) = నిత్యం కైంకర్యం చేస్తూ ఉండదగినవాడై ఉండడం, (ఏకరస) = అనే వీటినే సారంగా కల, (ఆత్మస్వభావ+అనుసంధానపూర్వక) = స్వస్వభావాన్ని అనుసంధించి, దానివల్ల కలిగే, (భగవదనవధికాతిశయ స్వామ్యాది + అఖిలగుణానుభవ జనిత) = ఎల్లప్పుడు తనకే నియమించదగినవాడై ఉండడం, నిత్యకైంకర్యంలోనే అభినివేశాన్ని కల్గిఉండడం మొదలైన స్వస్వభావాన్ని అనుసంధిస్తూ భగవానునియొక్క గొప్పదైన స్వామిత్వం మొదలైన సకలగుణాలను అనుభవించడంవల్ల కలిగే, (ప్రీతికారిత) = గొప్ప ప్రీతితో చేయబడిన, (అశేష + అవస్థా + ఉచిత + అశేషశేషతైకరతిరూపనిత్య కైంకర్య ప్రాప్త్యుపాయ భక్తి) = అన్ని అవస్థలకు తగిన సర్వవిధకైంకర్యాలలోను ప్రావీణ్యాన్ని కల్గి ఉండడమనే నిత్యకైంకర్యానికి ఉపాయమైన భక్తి, (తదుపాయ సమ్యక్జ్ఞాన) = దానికి ఉపాయమైన పరిపక్వజ్ఞానం, (తదుపాయసమీచీనక్రియా) = దానికి ఉపాయమైన చక్కని కర్మయోగం. (తదనుగుణసాత్త్వికతా + ఆస్తిక్యాది సమస్త + ఆత్మగుణవిహీనః) = దానికి తగిన సాత్త్వికత్వం, ఆస్తికత్వం మొదలైన ఆత్మగుణాలు – అనే వీనిని కొంచెంకూడా లేనివాడనై,

(దురుత్తరానన్తతద్విపర్యయ జ్ఞానక్రియానుగుణానాది పాపవాసనా మహార్ణవాన్త ర్నిమగ్నః) = పూర్వం పల్కిన సమ్యక్ జ్ఞానానికి, సమీచీన క్రియలకు విరుద్ధమైన విపరీతజ్ఞాన – విపరీతక్రియలకు తగిన అనాది పాపవాసన అనే దాట లేని గొప్ప సముద్రంలో మునిగి ఉన్నవాడనై,

(తిలతైలవద్దారువహ్నివద్దుర్వివేచ త్రిగుణక్షణక్షరణ స్వభావాచేతన ప్రకృతి వ్యాప్తిరూప దురత్యయ భగవన్మాయాతిరోహిత స్వప్రకాశః) = నూగుగింజలో నూనెవలె, కట్టెలో నిప్పువలె, సాధారణంగా వేఱు చేయలేని సత్త్వరజస్తమస్సులను, సతతం పరిణమించే

స్వభావాన్ని సహజంగా కల్గినది, జడరూపమైన ప్రకృతిలో అవర్జనీయంగా ఉండే సంబంధాన్ని కల్గినది, దాటడానికి సాధ్యంకానిదైన భగవన్మాయలో మఱగు పఱచబడిన స్వప్రకాశాన్ని కలవాడనై,

(అనాద్యవిద్యాసఞ్చితానన్తాశక్య విస్రంసన కర్మపాశప్రగ్రథితః) = అనాది అయిన అజ్ఞానంచేత సంచితమై (పేరుకున్నదై), అంతులేనిదై, ఎవరివల్ల విడిపించడానికి వీలు కాని రీతిలో ఉండే పుణ్యపాపరూపకర్మలనే దారాలతో బంధింపబడినవాడనై,

'అనాగతానన్తకాల సమీక్షయాప్యదృష్టసంతారోపాయః అహమ్) = ఎంత కాలం చూచినా సంసారాన్ని దాటే ఉపాయం ఇది – అని తెలియలేనివాడనై ఉండే నేను,

(నిఖిలజంతుజాతశరణ్య) = సమస్తప్రాణుల సమూహానికి శరణ్యుడవైనవాడా!

(శ్రీమన్నారాయణ) = లక్ష్మీదేవితో నిత్యం కూడి ఉండే నారాయణా!

(తవ చరణారవింద యుగళం శరణమహం ప్రపద్యే) = నీ శ్రీచరణ పద్మాల జంటను నేను శరణు పొందుతున్నాను.

3. ఏవమవస్థితస్యాప్యర్థిత్వమాత్రేణ పరమకారుణికో భగవాన్ స్వానుభవ ప్రీత్యోపనీతై కాన్తికాత్యన్తిక నిత్యకైఙ్కర్యైకరతిరూప నిత్యదాస్యం దాస్యతీతి విశ్వాసపూర్వకం భగవన్తం నిత్యకిఙ్కరతాం ప్రార్థయే ॥

(ఏవమవస్థితస్యాపి) = పూర్వం తెల్పిన రీతిలో ఆకించన్యాదులను మూర్తీభవించిన వాడనై నేను ఉన్నా,

(పరమకారుణికః భగవాన్) = గొప్ప కరుణను సహజంగా కల భగవానుడు,

(అర్థిత్వమాత్రేణ) = నాపట్ల గల అర్థిత్వాన్నిబట్టి (నేను ప్రార్థిస్తున్నాను అనే ఒక కారణాన్ని బట్టి),

(స్వానుభవ ప్రీత్యోపనీతైకాన్తికాత్యన్తిక నిత్యకైఙ్కర్యైకరతిరూప నిత్యదాస్య దాస్యతీతి విశ్వాస పూర్వకమ్) = తన అనుభవంవల్ల కల్గిన ప్రీతిచే ఏర్పడినది, ఏకరూపమైనది, అంతు లేనిది అయిన కైంకర్యంలో అభినివేశం కల్గి ఉండడమనే నిత్యకైంకర్యాన్ని అనుగ్రహిస్తాడు – అనే నమ్మికతో,

(భగవంతం నిత్యకింకరతాం ప్రార్థయే) = భగవానునివద్ద నిత్యకైంకర్యాన్ని ప్రార్థిస్తున్నాను.

పూర్వం తమయొక్క సూక్తిద్వారా ప్రాప్యాన్ని ప్రార్థించారు. ఇప్పుడు ఇతిహాస శ్లోకాలు రెండిటిద్వారా ప్రార్థిస్తున్నారు. ఈ రెండు శ్లోకాలకు ఇతిహాస పురాణాలలో ఆకరం అన్వేషణీయం.

4. తవానుభూతిసమ్భూత ప్రీతికారితదాసతామ్ ।
దేహి మే కృపయా నాథ! న జానే గతిమన్యథా ॥

నాథా! నిన్ను అనుభవించి, దానివల్ల కలిగే ప్రీతిచేత కైంకర్యాన్ని పరమకృపతో నాకు అనుగ్రహించాలి. నీవు తప్ప వేఱు గతి లేనివాడై ఉన్నాను.

5. సర్వావస్థోచితాశేషశేషతైకరతిస్తవ ।
భవేయం పుణ్డరీకాక్ష! త్వమేవైవం కురుష్వ మామ్ ॥

పుండరీకాక్షా! అన్ని అవస్థలలోను నీకు చేయదగిన సకలవిధకైంకర్యాలలో నాకు రుచి కలిగేటట్లు నీవే అనుగ్రహించాలి.

6. ఏవంభూత తత్త్వయాథాత్మ్యావబోధ తదిచ్ఛారహితస్యాపి, ఏతదుచ్చారణ మాత్రావలమ్బనేన ఉచ్యమానార్థపరమార్థనిష్ఠం మే మనస్త్వమేవాద్యైవ కారయ ॥

శ్రీరంగనాథా! నీ అనుగ్రహంతో నేను అధికార పూర్తిని పొందినవాడనుగా భావిస్తున్నాను. ఒకవేళ ఆ విధమైన అధికార పూర్తి నాకు లేకపోయినా దాసుడనైన నేను పలికే ఈ మాటను నెపంగా చేసికొని నీవే శేషపూరణాన్ని చేయాలి – అని ఈ చూర్ణికలోని తాత్పర్యం.

(ఏవంభూత తత్త్వయాథాత్మ్యావబోధ తదిచ్ఛారహితస్యాపి) = ఈ విధంగా చాలా గొప్పదైన పురుషార్థం యొక్క యథార్థస్థితిని తెలిసికోవడాన్ని, తెలిసికోవాలనే ఆశను లేనివాడనైనా,

(ఏతదుచ్చారణ మాత్రావలమ్బనేన) = నా నోటిమాటనే నెపంగా చేసికొని,

(మే మనః) = నా మనస్సును,

(ఉచ్యమానార్థ పరమార్థనిష్ఠామ్) = ఉపాయోపేయాలలోని యథార్థ జ్ఞానాన్ని పొందిన దానినిగా,

(త్వమేవ అద్య ఏవ కారయ) = నీవే ఇపుడే చేయాలి.

"కురు" అని అనకుండా "కారయ" అని అనడం "అతువుమ్ అవనతు ఇన్నరుళే"

(అదికూడా ఆ పరమాత్మయొక్క గొప్ప కరుణయే) అనే పరమార్థాన్ని చూపడం కోసం.

7. అపారకరుణామ్బుధే! అనాలోచితవిశేషాశేషలోకశరణ్య! ప్రణతార్తిహర! ఆశ్రితవాత్సల్యైకమహోదధే! అనవరత విదితనిఖిలభూతజాత యాథాత్మ్య! సత్యకామ! సత్యసఙ్కల్ప! ఆపత్సఖ! కాకుత్స్థ! శ్రీమన్నారాయణ! పురుషోత్తమ! శ్రీరఙ్గనాథ! మమ నాథ! నమోఽస్తు తే ॥

(అపారకరుణాంబుధే!) = అంతులేని (తీరం దాటిన) కరుణాసముద్రమా!

(అనాలోచితవిశేష + అశేషలోకశరణ్య!) = గుణదోషాల నిరూపణాన్ని చేయకుండా సకలజగత్తుకు శరణ్యుడవైనవాడా!,

(ప్రణత + ఆర్తిహర!) = ఆశ్రయించిన వారి ఆర్తిని తీర్చేవాడా!

(ఆశ్రితవాత్సల్య + ఏకమహోదధే!) = దాసులపట్ల గల వాత్సల్యానికి అద్వితీయమైన మహాసముద్రమా!

(అనవరతవిదిత నిఖిలభూతజాతయాథాత్మ్య!) = సకలప్రాణిసమూహాల యొక్క యథార్థస్వరూపాన్ని ఎల్లప్పుడు తెలిసికొనేవాడా!

(సత్యకామ!) = అన్ని కోరికలను పొందినవాడా! (అవాప్తసమస్తకాముడు)

(సత్యసంకల్ప!) = తలచినదానిని చేసి పూర్తి చేయగలిగినవాడా!

(ఆపత్సఖ!) = ఆపదలలో స్నేహితుడైనవాడా!,

(కాకుత్థ్స!) = కకుత్థ్సవంశంలో జన్మించినవాడా!,

(శ్రీమన్నారాయణ!) = శ్రీమన్నారాయణ!,

(పురుషోత్తమ!) = పరమపురుషా!,

(శ్రీరంగనాథ!) = శ్రీరంగనాథా!,

(మమ నాథ!) = నా స్వామీ!,

(తే నమః అస్తు) = నీకే శేషమైన ఈ ఆత్మవస్తువు నీకే భోగ్యమై ఉండాలి.

శ్రీరంగగద్యం టీక సంపూర్ణం.

ఎమ్బెరుమానార్ తిరువడిగళే శరణమ్

✦ ✦ ✦

శ్రీ శంకరాచార్యకృతమ్
శ్రీవిష్ణుపాదాదికేశాంత స్తోత్రమ్

– వ్యాఖ్యాత – డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు, తిరుపతి.



శ్లో॥ విష్ణోః విశ్వేశ్వరస్య ప్రవరశయనకృత్ సర్వలోకైకధర్తా
సోఽ నంతః సర్వభూతః పృథువిమలయశాః సర్వవేదైశ్చ వేద్యః ।
పాతా విశ్వస్య శశ్వత్ సకలసురరిపుధ్వంసనః పాపహంతా
సర్వజ్ఞః సర్వసాక్షీ సకలవిషభయాత్ పాతు భోగీశ్వరో నః ॥ 7

ప్రతిపదార్థం : విశ్వేశ్వరస్య = సమస్తలోకానికి ఈశ్వరుడైన, విష్ణోః = విష్ణువునకు, ప్రవరశయన = మిక్కిలి గొప్పశయ్యను (లేక నిద్రాసుఖాన్ని), కృత్ = చేసి ఇచ్చేవాడు, సర్వలోకైకధర్తా = సమస్తలోకాలకు అద్వితీయమైన ఆధారమైనవాడు, సర్వభూతః = సమస్త భూత (వస్తు) రూపుడై ఉండేవాడు, పృథువిమలయశాః = గొప్ప, నిష్కలంకమైన కీర్తిని కలవాడు, సర్వవేదైః = సమస్త వేదాల ద్వారా, వేద్యశ్చ = తెలియదగిన స్వరూపాన్ని కలవాడు, శశ్వత్ = ఎల్లప్పుడు, విశ్వస్య = సమస్త లోకానికి, పాతా = రక్షకుడు, శశ్వత్ = ఎల్లప్పుడు, సకల రిపుధ్వంసనః = దేవతలకు శత్రువులైన రాక్షసులనందఱిని నశింపజేసేవాడు, పాపహంతా = లోకంలోని వారి పాపాలను పోగొట్టేవాడు, సర్వజ్ఞః = అన్నిటిని తెలిసినవాడు, సర్వసాక్షీ = అన్నిటిని నేరుగా చూచేవాడు, భోగీశ్వరః = పడగలను కల సర్పాలకు ప్రభువు – (ఉత్కృష్టమైన ఆనందాన్ని అనుభవించేవారిలో గొప్పవాడు) అయిన, సః = ఆ, అనంతః = అనంతుడనబడే ఆదిశేషుడు, (అనంతుడు భగవానుని రూపవిశేషం), సకలవిషభయాత్ = అన్ని విషాలవల్ల కలిగే భయం నుండి (విషం వలె సమస్త సాంసారిక విషయాలనే విషం వల్ల కలిగే భయం నుండి), నః = మనలను, పాతు = రక్షించుగాక!

వ్యాఖ్యానము : ఈ శ్లోకంలోని "ప్రవరశయనకృత్" సర్వ లోకైకధర్తా, సర్వభూతః, పృథువిమల యశాః, సర్వవేదైశ్చ వేద్యః, శశ్వత్ విశ్వస్య పాతా, శశ్వత్ సకలసురరిపుధ్వంసనః, పాపహంతా, సర్వజ్ఞః, సర్వసాక్షీ, భోగీశ్వరః" – అనే విశేషణాలన్నీ ఆదిశేషునకు, అనంతుడనబడే భగవద్రూప విశేషానికి పొసగి ఉండడం గమనార్హం, అద్భుతమైన అంశం. దీనివల్ల గరుడునివలె ఆదిశేషుడు కూడా భగవన్మూర్తి ప్రవార విశేషమనే విషయం సూచితం.

వేదస్వరూపుడైన గరుడుడు ఆత్మజ్ఞానాన్ని అనుగ్రహించి, మనలను ముక్తులుగా

చేసే విషయం పూర్వశ్లోకంలో ప్రస్తుతం. అతడు విషభయం నుండి మనలను కాపాడడం ప్రసిద్ధం. గరుడమంత్రం విషహరణమంటారు. ఇక్కడ, ఈ శ్లోకంలో, అనంతుడనే నాగరాజు ఈ ఉపకారాలను చేసే విషయాన్ని, లోకాన్ని అంతటిని "శేషః సదైవాహితభూమిభారః" అని కాళిదాసు శాకుంతలంలో పల్కినట్లు రాత్రి పగలు శాశ్వతంగా తన శిరస్సులలో ధరించడం, లోకాలను అన్నిటిని లయ సమయంలో గ్రహించి ధరించే విష్ణువనే అనంతునిగా, ఆ విష్ణువు సుఖంగా యోగనిద్రను పొందే శయ్యగా ఉండి ధరించడం, అనే విషయాలను వర్ణిస్తూ, ఆ ఆదిశేషుని స్తుతిస్తున్నారు. అనంతుడనే ఒక మూర్తిభేదాన్ని గ్రహించి, విష్ణువు భూమిని మోస్తున్నాడు – అని పురాణ ప్రసిద్ధం. కుమారసంభవంలో కాళిదాసు **"ఆదిశ్యతే భూతానామవేక్ష్య కృష్ణేన దేహోద్వహనాయ శేషః"** అని కాళిదాసు పల్కిన సూక్తిని పూర్ణసరస్వతి తమ వ్యాఖ్యలో ఉదాహరించారు. విశ్వాన్ని ధరించే శక్తి ఆదిశేషునకు నిరంతరంగా సర్వకాలం ఉన్నందున, విశ్వమనే తనను ఆడకుండా, చలించకుండా, ఊపిరికూడా విడువకుండా ధరించే పడుక అయ్యేటట్లుగా చేశాడు" అని కాళిదాసు సూక్తి భావం. దీనిని మనస్సులో పెట్టుకొని ఇక్కడ భూమిని అంతటిని ధరించడం, భగవానుని నిద్రాకాలంలో స్థిరంగా, చలించకుండా భరించడం అనే వానిని కలిపి పల్కుతున్నట్లుగా పూర్ణసరస్వతి వ్యాఖ్య. చాలా అణుస్వరూపం వంటి జీవాత్మయై ఉండి, తన బ్రహ్మాపరోక్షజ్ఞానంతో అనంతబ్రహ్మం వలెనే ముక్తజీవుడు కూడా అనంతుడవుతాడు. "ఆరాగ్ర.... శతభాగస్య శతధా కల్పితస్య చ, భాగో జీవః స విజ్ఞేయః స చానంత్యాయ కల్పతే" అని ఉపనిషత్తు పల్కింది. ధాన్యపుగింజయొక్క చాలా సూక్ష్మమైన చివరిభాగాన్ని నూఱు అంశాలుగా చేసి, అందులో ఒక భాగాన్ని మళ్ళీ నూఱు అంశాలుగా చేస్తే, అందులో ఒక భాగం ఎంత సూక్ష్మంగా, అణుపరిమాణంగా ఉంటుందో, జీవుని స్వరూపం అంతటి అణుపరిమాణంగా ఉంటుంది. అంతటి సూక్ష్మమైన జీవుని స్వరూపాన్ని అతడు వేదాల ద్వారా తెలిసికొని అపరోక్షంగా సాక్షాత్కరించికోగల్గితే, అతడు పరమాత్మవలె దేశకాల వస్తువులనే త్రివిధ పరిచ్ఛేదాలను దాటిన అనంతత్వానికి యోగ్యుడవుతాడు – అని ఈ శ్రుతివాక్య తాత్పర్యం. సంసారదశలో పరబ్రహ్మను పరతంత్రుడై, శేషభూతుడై ఉండేవాడు పరబ్రహ్మాజ్ఞాంతో బృంహణం చేయబడి, పరబ్రహ్మవలె స్వతంత్రంగా, అనంతంగా కాగల్గిన యోగ్యతను కల్గి ఉండడంచూచి, అతనికి కూడా అనంతుడనే పేరును పెట్టినది కాబోలు వేదం. పరబ్రహ్మం కూడా అనంతం. ముక్తిని పొందే జీవుడు కూడా అపరబ్రహ్మవలె అనంతుడు "అతోఽనంతేన తథాహి లింగమ్" అనే ఉభయలింగాధికరణ సూత్రానికి (3–2–25) ఈ విధంగా అర్థం భాష్యంలో తెలుపబడింది. "ప్రకాశవచ్చావైశేష్యమ్, ప్రహశ్చ కర్మణ్యభ్యాసాత్" అనేదానికి ముందు

సూత్రం (3-2-24) నుండి "అవైశేష్యమ్, ప్రకాశవత్" అనే పదాలను అనువృత్తి చేసికొని, "అనంతేన అవైశేష్యమ్ ప్రకాశవత్" అనే అన్వయాన్ని గ్రహించి, ముక్తిదశలో ముక్తజీవునకు పరబ్రహ్మతో వేఱుకాని ఏకీభవస్థితి కల్గుతున్నది - అని భాష్యంలో ఈ సూత్రానికి భావం వివరింపబడింది.

"తద్భావభావమాపన్నః తథాసౌ పరమాత్మనా, భవత్యభేదో భేదశ్చ తదజ్ఞానకృతో భవేత్" అనే విష్ణుపురాణంలోని పరాశరమహర్షి శ్లోకం కూడా ముక్తి దశలో పరబ్రహ్మతో అవైశేష్యమనే అభేదంతోనే జీవుడుంటాడు. భేదమని తోచేది అంతా - పరబ్రహ్మత్వమే యథార్థమైన తన స్వరూపస్థితి - అనే తత్త్వాన్ని తెలియనందువల్లనే కల్గుతున్నది - అని "అవైశేష్యమ్" అని సూత్రపదం వివరింపబడింది. **"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ"** అని పరబ్రహ్మయొక్క సూక్ష్మమైన అనంతత్వాన్ని ముక్తుడు పొందుతున్నాడు - అనేదానిని "అనంతేన" అనే పదం తెల్పుతున్నది. ఈ రీతిలో ముక్తిదశలో ప్రకాశించే అభేదరాహిత్యాన్ని పురస్కరించుకొని పరబ్రహ్మను - **"వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః"** - అన్ని వేదాలు నన్నే తెల్పుతున్నాయి - అని లోకానికి రక్షకుడని, పాపాన్ని పోగొట్టేవాడని, సర్వజ్ఞుడని, సర్వసాక్షి - అని ప్రసిద్ధంగా పలికే విశేషణాలను సంసారం తొలగిన అనంతుడనే జీవునకు కూడా విశేషణాలుగా పలికారు. ✦ .... (సశేషం)

సంస్కృతభాషాపూర్ణిమ



దండకము

ఆదిత్య హృదయము

ఖలకర్ణ విషాయణము

శ్రీమీఱ సన్మానసారామ తాత్పర్యయుక్తిన్ విమర్శించి పూజింపుమా! రశ్మిమంతున్ సముద్యత్ప్రభాకాంతు దేవాసురాభ్యర్చ్యమానున్ వివస్వంతునిన్ భాస్వరున్ లోకనాథున్ విభున్ సర్వదేవాత్మకుం డీతఁడే నిత్యతేజస్వియున్ రశ్మిభావ్యుండు దేవాసురానీక పాలుండు లోకావనుండీతఁడే కాఁడె? పాలించు సర్వంబు భాస్వద్గభస్తి ప్రకాండంబునన్ బ్రహ్మయున్ విష్ణువున్ రుద్రుఁడున్ స్కందుఁడు న్నీతఁడేకా ప్రజాపత్యభిఖ్యుండు నింద్రాదిముం డవ్విభుండైన యా సోముఁడు న్నీతఁడేకా పితృశ్రేణి వస్వశ్వినుల్ సాధ్యులు న్నామరుత్తుల్ మనుప్రఖ్యుఁడున్ వాయువున్ వహ్నియున్ దత్ప్రజల్ ప్రాణముల్ తానె యౌనే కదా! యా ఋతువ్యాపకుండైన ప్రాభాకరుం డీతఁడే నమ్ము మాదిత్యుఁడున్ సర్వలోకాధ్యుఁడున్ సూర్యుఁడు న్నాఖగాఖ్యుండు పూషుండు దీవ్యద్గభస్తి ప్రదుండున్ సువర్ణాభుఁడౌ భానుఁడున్

స్వర్ణరేతుండు హర్యశ్వుఁడు న్నాసహ శ్రీలసత్సప్తసప్తి ప్రసిద్ధుండు భాస్వన్మరీచి చ్ఛటాపాస్తతామిస్ర సంఘుండు శంభుండు నా (తృ) కృష్ణ మార్తాండుఁడు న్నంశుమంతుండు నానాహిరణ్యాండగర్భుండు నా భాస్కరుం డగ్నిగర్భుం డదిత్యాత్మజుండున్ రవి ప్రఖ్యుఁడున్ వ్యోమనాథుండు నానాతమశ్ఛేదియున్ ఋగ్యజుస్సామ పారంగతుం డాప్తపర్జన్యసంజ్ఞుండు నమ్మిత్రుఁడున్ వింధ్యవీథీప్లవంగుండు నిత్యాతపాధాయి సన్మండలోల్లాసి మృత్యుం డుదంచన్మహాపింగళుండున్ సదా సర్వసంతాపి విశ్వస్వరూపుండు రక్తప్రసన్నాత్ముఁడున్ సర్వభావోద్భవుం డభ్రనక్షత్ర తారాగ్రహాధీశుఁడున్ విశ్వభావుండు తేజస్వులం దెల్ల తేజస్వియు న్నీతఁడే యంచు భావించి యో ద్వాదశాత్మా! నమస్కారముల్ నీకుఁ బుర్వాద్రికిన్ దండ మస్త్రాద్రికిన్ మ్రొక్కులర్పింతు జ్యోతిర్గణాధీశ! యోహో దినాధీశ! నీకున్ నమస్సుల్ జయాకార! భద్రాత్మ! హర్యశ్వ నీకున్ బ్రణామంబు గూర్తున్ సహస్రాంశుఁడా! దండ మాదిత్యదేవా! భవత్ పాదపద్మంబు లర్చింతునో యుగ్ర! యో వీరసారంగ! సాష్టాంగముల్ సేతుఁ బద్మప్రభోధాత్మ! మార్తాండ నిన్ మ్రొక్కెదన్ బ్రహ్మ విష్ణీశరూపాంచితా! సూర్య! యాదిత్యవర్యోత్తమా! నిన్ను నే సన్నుతిం జేతు భాస్వత్ స్వరూపాత్మ! యో సర్వభక్షా! మహారౌద్రధామా స్తుతింతున్ దమోఘ్నా! హిమఘ్నా! రిపుఘ్నా! మహాత్మా! కృతఘ్నఘ్న! దేవా! మహాజ్యోతిరీశా! ప్రసన్నాత్మతన్ నీకు నే వందనంబుల్ దగం జేసెదన్ దప్తచామీకరాభాంగ! యో వహ్ని! యో విశ్వకర్మా! నినున్ నే స్తుతింతున్ దమోఘ్నా! రవీ! లోకసాక్షీ! నమోవాకముల్ గూర్తునంచున్ బ్రశంసింపవే యీ మహాత్ముండె భూతంబు నాశంబు గావించు నట్లే సృజించున్ గదా! యీతఁడే తాగభస్తి ప్రకర్షంబునన్ బ్రోచు శుష్కింపఁ గాఁజేయు వర్షించు నీతండె భూతంబు లెల్లన్ బ్రసుప్తింగొనన్ జాగరూకుండుగా నుండు నీతండెగా యగ్నిహోత్రంబు తత్కర్మకారుల్ దివిన్ జెందు నానా ఫలంబుల్ విమర్శింప వేదంబులున్ యజ్ఞముల్ యజ్ఞసిద్ధుల్ మదిన్ సర్వకర్మల్ ప్రభుండై రవిఖ్యాతిఁ జెన్నొందు నీతండె కా కష్టకాలంబులం దాపదల్ ముట్టు వేళన్ భయభ్రాంతులై యున్న యప్పట్టునన్ దుర్గమారణ్య మార్గ ప్రవాసంబునన్ భక్తినెవ్వండు కీర్తించు నాతండు సర్వాపదల్ వాసి సౌఖ్యంబులన్ గాంచు నేకాగ్రతన్ నీవు నీదేవదేవున్ జగద్బంధునిన్ భక్తిఁ బూజింపవే దీని ముమ్మాఱు భక్తిన్ జపింపన్ జయంబబ్బు నీ వీక్షణంబే భవచ్ఛత్రుఁ డైనట్టి యీ రావణున్ నేలఁ గూలన్ బ్రమోదంబునం గాంచె దోనిర్మలాత్మా! రమాధీశ! తాత్పర్యయుక్తిన్ గ్రహింపం దగున్ నీ మహాభీష్టమున్ వేగఁ జేకూరు సత్యంబు నామాట మన్నించు ముమ్మాటికిన్ నీకు భద్రంబు భద్రంబు భద్రంబగున్. ✦

శ్రీమతే రామానుజాయనమః

శ్రీమదప్పయ్యదీక్షితేన కృతః

వరదరాజస్తవః

వ్యాఖ్యాత - డా॥ కె. లక్ష్మీనారాయణ, నెల్లూరు.

నఖములకు జైవాతృకత్వము యుక్తమే

శ్లో॥ పాదానమత్సురశిరోమణిపద్మరాగాన్
సద్యస్స్ఫురత్ సహజరుక్ప్రకరాన్ కరాగ్రైః ।
ముక్తామయాన్ విదధతాం ప్రకటం మురారే!
జైవాతృకత్వముచితం నను తే నఖానామ్ ॥ 51

ప్రతిపదార్థము : మురారే! = మురాసురసంహారకా! వరదరాజస్వామీ!, స్ఫురత్ – సహజ – రుక్ – ప్రకరాన్ = అభివ్యక్తమగుచున్న సహజమైన కాంతి సమూహములు గల, పాద – ఆనమత్ – సుర – శిరోమణి – పద్మరాగాన్ = నీ శ్రీపాదములకు మ్రొక్కుచున్న దేవతల శిరోరత్నములైన పద్మరాగమణులను, సద్యః = వెంటనే, కర – అగ్రైః = కిరణముల కొనలతో, ముక్తామయాన్ = ముత్యములనుగా, విదధతామ్ = చేయుచున్న, నఖానామ్ = గోళ్ళకు, ప్రకటమ్ = స్పష్టమైన, జైవాతృకత్వమ్ = చంద్రత్వము, ఉచితమ్ నను = తగినదే కదా!

తాత్పర్యము : మురాసురాంతకుడవైన వరదరాజస్వామీ! దేవతలెల్లరును నీ సన్నిధికి వచ్చి భక్తితో నీ పాదములకు మ్రొక్కుటకై తమ తలలను వంచినపుడు వారి కిరీటములలోని ఎఱ్ఱని సహజకాంతి గల పద్మరాగ మణులను వెంటనే నీ దివ్యనఖములు తమ ధవళకాంతులతో ముత్యములనుగా చేయుచున్నవి. అట్టివి తెల్లనిచాయ కలిగినవి అగుటచే నీ కాలిగోళ్ళను చంద్రులనుట యుక్తమే గదా!

తత్త్వవేది : అర్థితార్థపరిదానదీక్షితుడైన వరదరాజస్వామి యొక్క శ్రీపాద దివ్యనఖముల సౌందర్యగరిమను వర్ణించుట 48వ శ్లోకము నుండి ప్రారంభించి శ్రీదీక్షితులు ఈ శ్లోకముతో పూర్తిచేయుచున్నారు. వెనుక మూడు శ్లోకములలో వివిధ రీతులలో నఖములకు చంద్ర సాదృశ్యమును అభివర్ణించి ప్రస్తుత శ్లోకములో ఆ సాదృశ్యకథనము సమంజసమేనన యుక్తిప్రదర్శనపూర్వకముగా సమర్థించుచున్నారు.

మఱియు, జైవాతృకశబ్దము నానార్థకము గనుక, వైద్యశ్రేష్ఠుడను అర్థమును కూడా ఇచట బోధింపవచ్చును. ప్రస్తుతమున ఆ అర్థమును కూడా గ్రహించుటచే నఖములు వైద్యశ్రేష్ఠుని వంటివి అను అర్థాంతరము కూడా ఏర్పడును. అట్లే నిఘంటుబలమును

బట్టి దీర్ఘాయుష్మంతములు అనియు అర్థము చెప్పవచ్చును.

"అథ జైవాతృకః పుమాన్ । చన్ద్రే చ పరిఖాయాం చ పరిఘేఽథ ద్వయోశ్శుకే। ధనే తు క్లీబమాయుష్మత్ కృషీవలభిషక్షు సః ॥" – అని కేశవనిఘంటువు. జైవాతృక శబ్ద శ్లేషవలన ఏర్పడుచున్న అర్థద్వయం లోనికి అనుగుణంగా అన్వయిస్తూ రుక్, కరాగ్ర, ముక్తామయ శబ్దముల సభంగ, అభంగ శబ్దశ్లేషల వలన కలిగిన వివిధములైన అర్థములు రమణీయతను ఆపాదించుచున్నవి.

స్ఫురత్ సహజరుక్ ప్రకరాన్ : చంద్రపక్షమున – సహజమైన కాంతిసమూహములు గలవి, పద్మరాగమణులకు విశేషణమిది. వైద్యపక్షమున – స్వతంత్రపదము. జన్మించినది మొదలు తమలోనే ఉండి బాధించుచున్న అనేక వ్యాధులు కలవారిని అని అర్థము.

"రుచ"దీప్తౌ అను ధాతువునుండి ఏర్పడిన చకారాంత రుక్ శబ్దమునకు కాంతి అని అర్థము. దీనికి సుబంతరూపములు **"రుక్–రుచౌ–రుచః"** – ఇత్యాదిగా నుండును. "రుజ"భఙ్గే అను ధాతువునుండి ఏర్పడిన జకారాంత రుక్ శబ్దమునకు వ్యాధి అని అర్థము. దీనికి సుబంతరూపములు **"రుక్–రుజౌ–రుజః"** – ఇత్యాదిగా నుండును.

కరాగ్రైః : చంద్రపక్షమున – కరములనగా కిరణములు. వాటి కొనలతోనే పద్మరాగముల అరుణిమను ధవళముగా చేయుచున్నవని భావం. వైద్యపక్షమున – కరము = చేయి, అగ్రము = కొన, చేతి కొన తాకుటచే అని భావము. కరస్పర్శమాత్రముననే రోగగ్రస్తులైన భక్తుల బాధలను తీర్చునని తాత్పర్యము. **"బలిహస్తాంశవః కరాః"** – 3.3.164 – అని అమరనిఘంటువు కరశబ్దమునకు పన్ను, చేయి, కిరణము అని అర్థములను తెలిపినది.

ముక్తామయాన్ : చంద్రపక్షమున – ముక్తా శబ్దమునకు వికారార్థమున మయట్ ప్రత్యయము ముత్యములుగా మాఱినవి అని అర్థము. ఎఱ్ఱని పద్మరాగమణులను తెల్లని తమ కాంతులతో నఖములు ముత్తెములవలె మార్చివేయుచున్నవి. వైద్యపక్షమున – ముక్త + ఆమయాన్ = ఆమయమనగా రోగము. **"స్త్రీరుగ్రుజా చోపతాపరోగవ్యాధిగదామయాః"** – అమర–2.6.51. రోగరహితులనుగా చేయుచున్నవని భావం.

దేవరాజుని శ్రీపాదనఖములు తమకు ప్రణమిల్లిన దేవతల తలమానికములను చంద్రునివలె తమ కిరణములతో తెల్లని ముక్తాఫలములనుగా చేయుచున్నవి. అట్లే తమ నాశ్రయించిన భక్తులయొక్క దీర్ఘవ్యాధులను వైద్యశ్రేష్ఠులవలె చేయి తాకినంతమాత్రముననే తొలగిపోవునట్లు చేసి వారిని సుఖవంతులనుగా చేయుచున్నవి. కనుక, వరదుని శ్రీచరణముల గోళ్ళు ఉభయవిధములుగను జైవాతృకములు అనుటకు తగియున్నవని తాత్పర్యము. ✦ .... (సశేషం)

ఆకలి ఎరగని చదువు

– డా॥ పాపినేని శివశంకర్, గుంటూరు

వాసో నిగ్రహమెన్న, రాఁకలియు నీర్వట్టున్ గణింపర్; తలల్
మాసెంగా యన, రంగముల్ బడలినన్ బాటింప, రట్లుండనీ
యాసాయంబుగ నానిశాత్మ్యయముగా నామ్నాయముల్ క్రోల్చుచో
నాసీన ప్రచలాయితంబయిన లేదాహా! వితర్కింపఁగన్.

– తెనాలి రామకృష్ణుడు, పాండురంగ మాహాత్మ్యము

అగస్త్యుడు మహాముని. ఆయనకు వేలకొలది శిష్యులుండేవారు. అందులో అయుతుడు, నియుతుడు అనే అన్నదమ్ములు గురువుగారికి చాలా ప్రేమపాత్రులయ్యారు. వారి చదువుల గురించి ఒకనాడు అగస్త్యుల వారు ఇట్లా తలపోశారు.

వాసన్ + నిగ్రహము = వస్త్రముల ఇబ్బంది; నీరు + వట్టు = దప్పిక; ఆసాయము = సాయంత్రము వరకు; ఆనిశాత్యయము = రాత్రి తెల్లారే వరకు; ఆమ్నాయముల్ = వేదాలు; క్రోల్చుట = వల్లించుట; ఆసీన ప్రచలాయితము = కదలకుండా కూర్చోవటం చేత కలిగిన కునుకుపాటు.

అయుత నియుతులకు చదువు మీదున్న శ్రద్ధ ఒంటి మీదు లేదు. దుస్తులు చక్కగా ఉన్నాయా లేదా అని చూడరు. ఆకలి, దప్పిక పట్టించుకోరు. తలలు మాసిపోయాయని తలంటులకు తొందరపడరు. అవయవాలన్నీ అలిసిపోయినా పట్టించుకోరు. అదంతా ఒక ఎత్తయితే రాత్రింబవళ్ళు వేదాలు వల్లించేటప్పుడు బాసికపట్టులో ఎంతసేపు కూర్చున్నా కనీసం కునుకుపాటు అయినా పడరు.

ఉత్తమ విద్యార్థి దీక్ష ఎట్లా ఉండాలో, ఉంటుందో తెలిపిన పద్యం ఇది. చూపు పుస్తకాల మీద దృష్టి, వేరే విషయాల మీద ఉంటే చదువు అబ్బదు కదా! ఆకలిదప్పికలు మనిషికి సహజాతాలు. అవి తీరకుండా ఏ పనీ చెయ్యలేం. అయితే గొప్ప దీక్షలో ఉన్న వారు అవిగూడా పట్టించుకోరు. ఇక దుస్తుల గురించి చెప్పేదేముంది? ఎడతెగని శ్రమ వల్ల ఒళ్లంతా అలసిపోయి, విశ్రాంతి కోరుకుంటాం. కాని విద్యార్థికి విశ్రాంతి లేదు. వేళాపాళా లేదు. అన్నివేళలా శ్రమే. **'విద్యాతురాణాం న నిద్రా న సుఖమ్'** (విద్యాసక్తి గలవారికి నిద్ర ఉండదు, సుఖం ఉండదు) అని సూక్తి.

అగ్రవర్ణాలకే పరిమితమైన వెనకటి గురుకుల వాసాల్లో ముఖ్యమైన చదువు వేదాధ్యయనమే. పలకలు, పుస్తకాలు లేని ఆ కాలంలో పదేపదే వల్లె వెయ్యటమే ప్రధానంగా ఉండేది. వేదమంత్రాల్లోని శబ్ద పౌనఃపున్యం వల్ల, స్వర నిబద్ధత వల్ల వాటిని మనస్సులో ధారణ చెయ్యటం కొంతలో కొంత సుకరంగా ఉండేది. ఏమైనా పూటంతా ఒకే భంగిమలో కూర్చుండి చదువు మీద ధ్యాస పెట్టటం కష్టమైన పనేగదా? మరి ఈనాటి కార్పొరేట్, రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులు జైళ్లను తలపించే బడుల్లో అంత శ్రమపడటం లేదా? అయితే ఈ చదువులన్నీ బలవంతపు బ్రాహ్మణార్థాలని మనకి తెలిసిన సంగతే!

పాండురంగమహాత్మ్యము అనే కావ్యంలో అయుతనియుతోపాఖ్యానంలోనిది ఈ పద్యం. కవి తెనాలి రామకృష్ణుడు. స్కందపురాణంలోని కథను గ్రహించి ఈ కావ్యం రచించాడు. **పుండరీక క్షేత్ర మహిమ** తెలిపే గ్రంథం ఇది. విరూరి వేదాద్రి మంత్రికి అంకితం.

కొత్తకొత్త కల్పనలతో, చక్కని లోకోక్తులతో సాగుతుంది తెనాలివాడి రచన. "రామకృష్ణుని రచన విశిష్టమైనది. పద్యములు ధారాళముగ సాగి, సులభముగా నున్నట్లు కన్పించుచున్నను, చాలాచోట్ల గూఢార్థ భూయిష్ఠములయి, కొఱకరాని కొయ్యలయి యుండును" అన్నారు ఈ గ్రంథానికి టీక వ్రాసిన శ్రీ బులుసు వేంకటరమణయ్య. నిఘంటువుల్లో దొరకని పదాలెన్నో కల్పించాడు రామకృష్ణుడు. కద్రూజాంగదుడు (శివుడు), చుట్టుంగత్తి (చక్రాయుధము), రసవతి (వంటయిల్లు), రాతికొడుకు (కప్ప) మొదలైన కల్పనలు చూస్తే తెనాలివాడి తెలివితేటలు తెలుస్తాయి. అందుకే **'సరసార్థ బోధఘటనా హేలా పరిష్కార! శారద నీ రూపము'** అని పొగడ్త పొందాడు. ✦

సంస్కృతభాషాపూర్ణిమ

रमा	रमे	रमाः
रमाम्	रमे	रमाः
रमया	रमाभ्याम्	रमाभिः
रमायै	रमाभ्याम्	रमाभ्यः
रमायाः	रमाभ्याम्	रमाभ्यः
रमायाः	रमायोः	रमाणाम्
रमायाम्	रमायोः	रमासु
हे रमे!	हे रमे!	हे रमाः

కమలాకుచ చూచుక....

అర్థ విశేషాలు

- డా॥ తాడేపల్లి పతంజలి, పటాన్ చెరువు

శ్రీ వేంకటేశ్వర స్తోత్రంలో (శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలో కాదు) ఉన్న **"కమలాకుచ చూచుక ....** అనే శ్లోకం లోకంలో చాలా ప్రసిద్ధమయినది. చాలామంది ఇందులోని మొదటి రెండు పంక్తుల తాత్పర్యాన్ని చెప్పి, ఇటువంటి పచ్చి శృంగారమున్న శ్లోకం చదువుతున్న దైవభక్తులను వెక్కిరించారు. దైవభక్తులైన శ్లోకార్థం తెలిసిన వారు మనస్సులో దేవుడికి ఇలాంటి శృంగార వర్ణన ఏమిటని సంశయం పీకుతున్నా, చెంపలు వేసుకొని భక్తితో చదువుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ శ్లోక అర్థ తాత్పర్య విశేషాల "ఆత్మీయ" ఆవిష్కరణము చేసే ప్రయత్నము ఈ చిఱు వ్యాసం.

శ్లో॥ కమలాకుచచూచుకకుంకుమతో
నియతారుణితాతులనీలతనో! ॥
కమలాయతలోచన! లోకపతే!
విజయీభవ వేంకటశైలపతే! ॥

ప్రతిపదార్థము : కమలా = లక్ష్మీదేవి యొక్క, కుచ = చన్నుల, చూచుక = మొనలపై ఉన్న, కుంకుమతః = కుంకుమతో, నియత = నియమము కలిగిన, నిత్యమైన, అరుణిత = ఎఱుపురంగు గలదిగా జేయఁబడిన, అతుల నీలతనో! = సాటిలేని నల్లని రంగు కలిగిన శరీరము కలవాడా!, కమలాయతలోచన! = కమలములోని మెత్తందనాన్ని, అందాన్ని గుర్తుకు తెస్తూ చెవులవరకు వ్యాపించిన విశాలమైన కన్నులు కలవాడా!, లోకపతే! = లోకానికి ప్రభువా!, వేంకటశైలపతే! = వేంకట పర్వతానికి ప్రభువా!, విజయీభవ = నీకు విజయము కలుగు గాక!

తాత్పర్యము : శ్రీమహాలక్ష్మి యొక్క చనుమొనలపై గల కుంకుమతో ఎల్లప్పుడూ ఎఱ్ఱగా ఉండే అందమైన నల్లని దేహం కలవాడా! తామర రేకుల వలె విశాలములైన కన్నులు కలవాడా! లోకాలకు ప్రభూ! వేంకటేశ్వరా! నీకు విజయమగుగాక!

విశేషాలు :

1) వ్యుత్పత్తులు : కమలా = కమలము చేతియందు కలిగినది కాబట్టి అమ్మకి లక్ష్మీదేవికి కమలా అని పేరు. కుచ = నాయకుని గోళ్ళచే గిచ్చబడునది (కుచ్యతే కామినా నఖైః కుచౌ). చూచుక = బాలుని చేత పానము చేయబడుచూ **చూచూ** అని పలుక బడునది కనుక చను మొనకు చూచుకము అని పేరు వచ్చింది. కుంకుమమ్ = ఎండినప్పుడు కుమ్మని పలుకునది కుంకుమము.

2) తోటక వృత్తము : ఈ శ్లోకము తోటక వృత్తములో ఉంది. తోటక వృత్తము వినడానికి చాలా బాగుంటుంది. పాదానికి 12 అక్షరాలు, నాలుగు స-గణాలు. సంస్కృతంలో దీనికి యతి లేదు. తెలుగులో తొమ్మిదవ అక్షరము యతి. ఆదిశంకరుల శిష్యులలో తోటకుడు మొదట చదువు రానివాడు. తరువాత గురువుగారి దయతో

> "విదితాఖిల శాస్త్ర సుధా జలధే – మహితోపనిషత్ కథితార్థ నిధే
> హృదయేకలయే విమలం చరణం – భవ శంకర దేశిక మే శరణమ్"

(అన్ని శాస్త్రముల అమృత సముద్రమును తెలిసికొన్నవాడా! ఉపనిషత్తులు చెప్పి అర్థమునకు నిధి లాంటి వాడా! నీ నిర్మలములైన పాదాలను నా హృదయము చూస్తోంది, శంకరాచార్యులే నా జీవితానికి శరణం) అని తోటక వృత్తములో గానం చేస్తూ తన జీవితంలో మార్పును సాధించాడు. మార్పుకు కారణమైన తోటక వృత్తములో **"కమలాకుచ చూచుక కుంకుమతో"** శ్లోకం ఉంది. ఇది మొట్టమొదట మనం గమనించాలి. భక్తితో ఈ స్తోత్రము చదివినవారి జీవితములో కూడా మార్పు వస్తుంది.

3) గుడ్డుపై ఉన్న పెంకు : దేవుళ్లకు సంబంధించిన పూర్వకాలపు శృంగార సాహిత్యము కోడిగుడ్డుపై ఉన్న పెంకులాంటిది. గట్టిగానే తగులుతుంది. అబ్బా! ఇక్కడ కూడానా... దేవుడి భక్తి కూడా శృంగారమేనా... అనిపిస్తుంది. తల్లి పొదిగిన తర్వాత ఆ పెంకు పగిలి నూతనావిష్కరణము బయటికి వస్తుంది. అలాగే గురువు చెప్పిన తర్వాత అందులోని అంతరార్థం తెలుస్తుంది. ఈ స్తోత్రము దాటిన తర్వాత వచ్చే ప్రపత్తిలో 'మాతుస్తనా వివశిశోరమృతాయ మానౌ' అని ఒక పాదం వస్తుంది. "బిడ్డకు మొట్టమొదటిసారిగా తెలిసి అమ్మ చన్నుల వలె అమృత సమానములుగా ఉన్న నీ పాదములను నే శరణు

పొందుతున్నాను" అని ఈ పాదానికి అర్థం. ఇక్కడ కూడా స్తనముల ప్రసక్తి వచ్చింది కదా! ఇది కూడా శృంగారమే అని భావించే వారికి నమో నమః. ఈ పంక్తిలో పాదాలను స్తనాలతో పోల్చాడు కవి. అమ్మ చన్ను – ఆస్వాదిస్తున్న బిడ్డకు అమృత జీవితాన్ని అనుగ్రహిస్తుంది. స్వామి పాదం – ఆ పాదాలను మానసంలో తలచి తలచి పరవశించే భక్తుని హృదయాన్ని ఆనందంతో నింపి అతని జీవితాన్ని అమృతమయం చేస్తుంది. ఈ అర్థ వాతావరణంలోనే "కమలాకుచ చూచుక" అంతరార్థం తెలుసుకోవాలి.

4) ఇది కామాన్ని మోక్షం వైపు మళ్లించే వర్ణన : సృష్టిలో అత్యంత ప్రాధాన్యం కలిగిన రంగు ఎఱుపు. సూర్యుడి వస్త్రాలు, రథం, ధ్వజం, పతాకం అన్నీ ఎఱుపురంగువే. ధైర్యానికి, చెడును పోగొట్టే శక్తికి, ప్రేరణాభావనకు, దృఢమైన నిర్ణయాత్మక వైఖరికి ఈ ఎఱుపు రంగు ప్రతీక. కాషాయము ఎఱుపు నుంచి ఏర్పడినదే. కాషాయ రంగు పవిత్ర జీవనానికి గుర్తు.... కాషాయం, భగవంతునితో బంధానికి త్యాగాలకు గుర్తు. ఇటువంటి కాషాయ జనని అయిన ఎఱుపు రంగు ఈ శ్లోకంలో నలుపు రంగుతో కలుస్తోంది. కాల తత్త్వానికి నల్లని కాళీమాత సూచన. అలాగే నల్లని వేంకటేశుడు కూడా. దృశ్య ప్రపంచాన్ని సృష్టించి, సృష్టికర్తగా నిలిచి, కల్పాంత సమయంలో, ఈ సర్వ ప్రపంచాన్ని తనలో లీనము చేసుకొనే దైవశక్తి వేంకటేశునిగా మన మాంస నేత్రాలకు నలుపురంగులో కనబడుతున్నాడు. మన స్తోత్రంలో ఇబ్బంది ఎక్కడ వస్తోందంటే వేంకటేశుని, అమ్మ లక్ష్మీదేవిని మనలా చూడటం వల్ల మానవీకరణం చేయటం వల్ల. అవయవ దృష్టిని దాటి అంతరాత్మ దృష్టికి ప్రయాణం చేయాలి. ఎఱుపు, నలుపుతో కలిసి ఎఱుపుగా మారిందంటే – ధైర్యాన్ని, చెడును పోగొట్టే శక్తిని, ప్రేరణాభావనను, దృఢమైన మోక్ష సాధన గల నిర్ణయాత్మక వైఖరిని పెంచుకోమనే సందేశం ఇందులో ఉంది.

5) జగన్మాత వాత్సల్యము : నీ స్తన్య పానం చేస్తున్న వినాయకుడు నీ వక్షోజాలను చూసి, తన ఏనుగు శిరస్సు అక్కడికి వచ్చిందేమోనని అనుమానంతో, తన ఏనుగు శిరస్సును, తన తొండంతో తడిమి చూసుకొంటున్నాడు. వినాయకుని సందేహానికి మీరిద్దరూ (పార్వతీ పరమేశ్వరులు) నవ్వుకుంటున్నారు. నీ స్తనాలను గణపతి, కుమారస్వామి, ఇద్దరు ఒకేసారి పానం చేస్తున్నారు. "పుత్రవాత్సల్యము జాలువారుతున్న ఆ స్తనద్వయం, మా దుఃఖాన్ని పోగొట్టుగాక." అని శంకర భగవత్పాదులు సౌందర్యలహరిలో అన్నారు. (సమందేవీ) ఇక్కడ వర్ణన జగన్మాత వాత్సల్యానికి ప్రతీక. మన చూపు ఇలా ఉంటే ప్రాచీన సాహిత్యంలో దైవ వర్ణనలలోని శృంగార వర్ణనలకు ఇబ్బంది పడం.

6) శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు యాదగిరి

లక్ష్మీనరసింహ స్వామికి సంబంధించిన, **కమలాకుచ చూచుక....** పంథాలో సాగిన శ్లోకాన్ని ఇలా వ్యాఖ్యానించారు. **"కమలాకుచ కస్తూరి కర్దమాంకిత వక్షసే యాదవాద్రి నివాసాయ సంపత్ పుత్రాది మంగళమ్"** అని మంగళం పాడుతుంటే ఆయనని ఏమని వర్ణిస్తున్నాం. అమ్మ తన వక్షస్థలానికి కుంకుమ పాత్రములను రచించుకున్నది, ఆయన ఆలింగితుడై దేహమంతా పూసుకున్నాడు, ఓహో అలాంటి స్వామీ నీకు మంగళం. ఏమిటండీ ఈ వర్ణన అనిపిస్తుంది. ఇదంతా తప్పు అని అనేవారు కొందరున్నారు. కానీ ఈ వర్ణనలు చెప్పేది జగత్ కారణమైన పరమాత్మను మరియు జగన్మాత అయిన అమ్మను. వారిరువురు శృంగారమే లేకపోతే నీకు జన్మ అనేది ఉందా! లోకంలో అమ్మ అందానికి నాన్న వశమైనప్పుడే కదా నీకు ఒక జన్మ అనేది లభించింది, కర్మ భారం తొలగించుకోవడానికి ఒక అవకాశం ఏర్పడింది. అలాంటి అందాన్ని స్మరించని బ్రతుకూ ఒక బ్రతుకేనా! అయితే ఆ అమ్మ అందం నీవు ఉపాసించ దగినది కానీ అనుభవించ దగినది కాదు. ఆ అందం నీకు జీవితాన్ని ఇచ్చేది ఉపజీవ్యం అంటారు. నాన్నకు అదే అందం భోగ్యం. నీకు ఉండాల్సిన జ్ఞానం ఇది. ఇప్పుడు ఈ జ్ఞానంతో ఆ సౌందర్యాన్ని దర్శించు అప్పుడు తప్పులేదు. ఉపనిషత్తులు ఈ విషయాన్ని మనకు తెలిపాయి."

దైవ శృంగార వర్ణనలలో బాహ్యదృష్టిలో పవిత్రత ఎలా అలవర్చుకోవాలో జీయర్ స్వామివారు చెప్పారు. నేను అంతర్దృష్టి మార్గం చెప్పాను. **"సర్వదేవనమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి"** లా ఏ స్థాయివారు ఆ దృష్టిని అలవర్చుకొని "కమలా...." శ్లోకంలో భక్తికి పెద్ద పీట వేద్దాం.

"చీకటి అంటే ఏమిటమ్మా"

"ఏమీ కనిపించక పోవటం చీకటి."

"అయితే, నాకు ఏమీ కనిపించట్లేదు చూడు" కిట్టమూర్తి కళ్ళు మూసుకొని చెప్పాడు. నవ్వుతున్న అమ్మ యశోదమ్మ బాలకృష్ణునికి ఆడుకోవటానికి అనుమతి ఇచ్చింది.

ఆ నల్లనయ్య చిఱు దరహాసాలు ఆయన శృంగార వర్ణనలలో మనకు ఎప్పుడూ జ్ఞానోదయం కలిగించు గాక! స్వస్తి. ✦

❁ ఓం నమో వేఙ్కటేశాయ ❁

మహాభారతం - మానవ స్వభావ చిత్రణ

సందేహ - సమాధానమాల

- డా॥ అప్పజోడు వేంకట సుబ్బయ్య, కర్నూలు.

మహాభారతంలో శిశుపాలుడి ప్రాణాలు తీసిన అతడి నోటి పొగరు.

మనిషికి త్రాగుడే కాదు, నోటి పొగరు కూడా ఒక వ్యసనమే. అందుకే ధర్మరాజు శిశుపాలునితో

భూరి గుణోన్నతు లనఁదగు
వారికి ధీరులకు ధరణి వల్లభులకు వా
క్పారుష్యము సన్నె? మహా
దారుణ మది విషము కంటె దహనము కంటెన్.

అన్నాడు. రాజసూయ మహాయాగ సభలో ధర్మరాజు శ్రీకృష్ణునికి అర్ఘ్యమిచ్చాడని, ఇచ్చిన ధర్మరాజును, ఇమ్మన్న భీష్ముని, పుచ్చుకున్న శ్రీకృష్ణుని నోటికి వచ్చినట్లు దూషిస్తూ, తన పుత్రులతో, పరివారంతో కలిసి సభనుండి లేచి వెళ్ళే శిశుపాలుడితో ధర్మరాజు అన్న మాటలివి.

శిశుపాలుడు ఛేది భూపతి. సాత్వతీ దమఘోషుల పుత్రుడు. శ్రీకృష్ణుని మేనల్లుడు. పుట్టగానే అతడికి నాలుగు చేతులు, మూడు కాళ్ళు, గార్ధభస్వరం. వికారంగా పుట్టాడు. ఆకాశవాణి, 'ఇతణ్ణి ఎవరెత్తుకొంటే ఎక్కువగా ఉన్న చేతులు, కాలు, కన్ను అణిగిపోతాయో – అతడే ఇతని పాలిటి యముడని పలికింది. ఒకసారి శ్రీకృష్ణుడెత్తుకోగానే అవి అణిగిపోయాయి. సాత్వతి శ్రీకృష్ణుడే తన కొడుకు పాలిటి యముడని గ్రహించింది. తన కొడుకు చేసే తప్పులు నూరింటిని క్షమించవలసిందని శ్రీకృష్ణుని కోరింది. అందుకాయన అంగీకరించాడు.

జీవితంలో శిశుపాలుడు చేసిన అకృత్యాలు అనేకాలు. శ్రీకృష్ణుడు భగదత్తుడి మీదికి దండయాత్ర వెళ్ళిన సమయంలో శిశుపాలుడు ద్వారకను తగులబెట్టాడు. భోజవంశరాజులు భార్యలతో కలసి రైవతాకాద్రిలో క్రీడిస్తూ ఉంటే, శిశుపాలుడు క్రూరంగా వాళ్ళందరిని వధించాడు. వసుదేవుడు అశ్వమేధయాగం చెయ్యాలని అశ్వాన్ని పూజిస్తే,

శిశుపాలుడు ఆ అశ్వాన్ని అపహరించాడు. బభ్రుని భార్యను బలవంతంగా తన భార్యగా చేసుకొన్నాడు. ఇప్పుడు అందరిముందు తిట్టిన తిట్టు తిట్టకుండా శ్రీకృష్ణుని ఎన్నో తిట్లు తిట్టాడు.

ఈ తిట్లతో కలుపుకొని శిశుపాలుని నూరు తప్పులు పూర్తి అయ్యాయి. శ్రీకృష్ణుడు చక్రాయుధం ప్రయోగించాడు. శిశుపాలుని శిరస్సు ఖండించాడు.

కాని, శిశుపాలుడు అందరి దృష్టిలో పడ్డది, ప్రాణం మీదికి తెచ్చుకొన్నది – ఇదివరకు అతడు చేసిన తప్పుడు పనుల వల్లకాదు. ఇప్పుడు రాజసూయ సభలో అందరి ముందు శ్రీకృష్ణుని విషయంలో నోరుపారేసుకున్నందువల్ల, నోటికి అడ్డు ఆపు లేకుండా ఆ మహానుభావుణ్ణి నిందించినందువల్ల.

అది ధర్మరాజు చేసే రాజసూయం. ఆయన అర్ఘ్యం ఎవ్వరికి ఇవ్వదగునని తన పితామహుని అడిగాడు. ఆ పితామహుడు అన్నివిధాల గొప్పవాడవైన శ్రీకృష్ణునికి ఇమ్మన్నాడు. ధర్మరాజు ఇచ్చాడు. శిశుపాలుడు అది తప్పని అంతగా మండిపడవలసిన అవసరం ఏముంది? అంతమంది మహారాజులున్న సభలో అందరు ఊరుకుంటే, అనవసరంగా శిశుపాలుడు మాట్లాడటమెందుకు? అంత పరుషంగా భీష్ముని, ధర్మరాజును, శ్రీకృష్ణుని నిందించటమెందుకు?

శ్రీకృష్ణుడంటే తనకు ఇష్టం లేకుంటే ఆయనను నిందించటానికి ఇదా సందర్భం? పైగా, భీష్ముని, ధర్మరాజును కూడా నిందించటమా? అంతే కాదు. తన నోటి పొగరుతో ఎంతో పవిత్రమైన ఆ యాగ వాతావరణాన్నంతా చెడగొట్టటమా? శిశుపాలునికి వాక్పారుష్యం ఒక వ్యసనమైంది. అది మితిమీరి విషంలా పరిణమించింది. నిప్పులా పనిచేసింది. అతడి ప్రాణాలు తీసింది. అందుకే ధర్మరాజు 'వాక్పారుష్యము సన్నె, మహాదారుణమది విషము కంటె దహనము కంటెన్' అన్నాడు.

కోటానుకోట్ల జీవరాసుల్లో మాట్లాడే శక్తి ఒక మానవుడికే ఉంది. అది అతనికి దేవుడిచ్చిన అద్భుతవరం. మాట మధురంగా ఉంటే అది అమృతమౌతుంది. పరుషంగా ఉంటే విషమౌతుంది; దహించే నిప్పవుతుంది.

అందువల్ల లోకంలో అనవసరంగా వాగేవాళ్ళు, పరుషంగా మాట్లాడి ఎదుటివాళ్ళ మనస్సును నొప్పించే వాళ్ళు – ధర్మరాజు మాటను, శిశుపాలునికి పట్టిన గతిని గుర్తుంచు కోవటం చాలా మంచిది. ✦



ఏమిసేతురా లింగా ఏమిసేతురా...

- డా॥ తాడేపల్లి పతంజలి, పటాన్ చెరువు

ప్రపంచంలో ఎంగిలి కాని పదమేది? అని రామకృష్ణ పరమహంసను అడిగారు ఒకరు. "బ్రహ్మము" అని పరమహంస చమత్కారంగా జవాబిచ్చారు. ఎందుకంటే బ్రహ్మము గురించి నోటితో వివరించటం ఎంతటి వారికయినా అసాధ్యము. నోటితో వివరించబడిన ఏ పదమైనా ఎంగిలవుతుంది. బ్రహ్మ పదార్థ వివరణ అసాధ్యము కాబట్టి అది ఎంగిలి కాదని ఇక్కడ భావము.

అటువంటి ఎంగిలి కాని శివ బ్రహ్మమునకు, ఎంగిలి పెడుతున్నానని, క్షమించమని ఈ తత్త్వంలో భక్తుడు (తత్త్వ రచయిత ఎవరో తెలియదు) స్వామిని వేడుకొంటున్నాడు.

ఏమిసేతురా లింగా ఏమిసేతురా

అర్థాలు : ఏమి = 1. ఏది, 2. సందర్భముల ననుసరించి కౌతుకము, క్రోధము, అనాదరము, ఆశ్చర్యము మొదలైన అర్థాలను ఏమి పదం స్ఫురింపచేస్తుంది. సేతును = చేయుదును? లింగా = ఓ జంగమయ్య, శివా!

తాత్పర్యము : ఓ శివా! ఈ సందర్భంలో నేను ఏమి చేయాలో నాకు తెలియటం లేదు. (ఏ సందర్భాలో చరణాలలో వస్తాయి).

విశేషాలు : 1) లింగ్యతే జ్ఞాయతే అనేనేతి లింగం. దేని చేత ఎరుగబడుతుందో అది లింగము. 2) సకల చరాచర ప్రపంచం ప్రలయంలో ఎక్కడ గర్భితమై ఉండి, సృష్టికాలంలో ఎక్కడి నుంచి బయటకు వస్తుందో అది లింగం. (బసవేశ్వర గీతామృతం). 3) చేతును, సేతును. ఇది మాండలిక భాష. ఉదా : ఓలమ్మ నేనేం సేతును, కొంప మునిగిపోనాది.

చరణం1: **గంగ ఉదకము తెచ్చి నీకు - లింగపూజలు సేదమంటే**
గంగనున్న చేప కప్ప - ఎంగిలంటున్నాది లింగా
మహానుభావా! మహదేవశంభో! - మా లింగ మూర్తి ॥ఏమిసేతురా॥

అర్థాలు : గంగ = 1) గంగానది, 2) నీరు. (ఈ యర్థము తెలుగున మాత్రమే కలదు) పంచ గంగలు : కావేరి, తుంగభద్ర, కృష్ణవేణి, గౌతమి, భాగీరథి, ఆకాశగంగ మందాకిని, పాతాళగంగ భోగవతి. మహానుభావా! = గొప్ప ప్రభావము కలిగిన వాడు (అను భావము = ప్రభావము). మహదేవశంభో! = శ్రేష్ఠుడైన దేవుడు, శివుడు (మహాదేవ శబ్దానికి కూడా

ఇదే అర్థము చెప్పుకోవచ్చు.). (శంభువు = శమ్మంటే సుఖం. అది శివుని వల్ల కలుగుతుంది కనుక ఆయన శంభువు...)

తాత్పర్యము : గంగతో నీకు లింగపూజలు చేద్దామని మొదలుపెట్టాను. నీటిని తాగి ఎంగిలి చేసిన చేప, కప్ప గంగ నీరు ఎంగిలని, శివునికి అభిషేక పూజ చేయటానికి పనికి రావని అంటున్నాయి. ఓ మహానుభావా! శివా! ఎంగిలినీటితో నీకు పూజ ఎలా చేయమంటావు!?

విశేషాలు : 1) మహారాష్ట్రలో **మహానుభావ పంథ** అని ఒక సంప్రదాయం ఉంది. పంథ పురుషులను "మహానుభావులు" అనీ, స్త్రీలను "మహానుభావి" అనే అంటారు.

2) నోటికి తగులుటచే అపవిత్రమైనది తినగా మిగిలినది, అనుభవించి విడిచినది ఎంగిలి. మనము తినే ఆహారమును భగవంతునికి పెట్టే విధానాన్ని నైవేద్యము అని అంటారు. స్వామి తిన్న తరువాత ఆయన ఎంగిలి మనకు ప్రసాదము అవుతుంది. అదే మనము ముందు తిని ఆయనకు పెడితే ఆ పదార్థము ఎంగిలి అవుతుంది. అలా చేయకూడదు.

3) దేవుళ్లని ఎంగిలి తిన్నావని కవులు ఆక్షేపించటం మన ప్రాచీన సాహిత్యంలో ప్రసిద్ధము.

"నీకున్ మాంసము వాంఛయేని కఱవా, నీ చేత లేదుండఁగా,
జోకైనట్టి కుఠారముండ, ననలజ్యోతుండ, నీరుండఁగా,
బాకంబొప్ప ఘటించి, చేతి పునుకన్ భక్షింప కా బోయచేఁ
జేకొం టెంగిలి మాంస మిట్లు దగునా శ్రీ కాళహస్తీశ్వరా!"

అని ధూర్జటి శివుడు ఎంగిలి మాంసము తిన్నట్లుగా వర్ణించాడు.

4) **"భిల్లాంగనాదంతపీడిత ఫలభుక్తిహేయంబు దోఁచలే దింత నీకు శ్రీకాకుళ ఆంధ్ర దేవా!"** శబరి ప్రేమతో ఎంగిలి చేసిచ్చిన పండ్లను మిక్కిలి ఇష్టంతో నీవు తిన్నావని ఆంధ్రనాయ శతక కర్త ఆక్షేపించాడు.

5) అయితే కన్నప్ప శివుడికి మాంసాన్ని అర్పించాడనీ, శబరి రాముడికి ఎంగిలి పండ్లను మనం అలా చేయకూడదు. మన స్థాయి తెలుసుకోవాలి. 1. సమర్థ ప్రేమ (భక్తుడు కేవలం భగవంతుడి ప్రీతిని మాత్రమే కోరుకొనే స్థితి) 2. సమంజస ప్రేమ (భగవంతునికి ఇష్టమైనది చేస్తూ, భక్తుడు తన సుఖాన్ని కూడా కోరుకొనే స్థితి) 3. సాధారణ ప్రేమ (భక్తుడు కేవలం తన సుఖాన్ని మాత్రమే కోరుకొనే స్థితి) అని దేవుని పట్ల మూడు రకాల ప్రేమలు ఉంటాయని రామకృష్ణులు అన్నారు. ఎంగిలి పెట్టిన కన్నప్ప, శివుని బాధను

చూసి తన కన్ను పెకిలించి ఇచ్చాడు. మనం అలా చేయలేము. కనుక 'సమర్థప్రేమ' లేని మనలాంటి సామాన్య భక్తుడు శివునికి ఎలా ఎంగిలి పూజ చేయాలని ఈ తత్త్వంలో భక్తుడు బాధ పడుతున్నాడు.

చరణం2: అక్షయావుల పాడి తెచ్చి - అరిపితము చేదమంటే... ఓహో!
అక్షయావుల లేగదూడ - ఎంగిలంటున్నాది లింగా
మహానుభావా! మహదేవశంభో! - మా లింగ మూర్తి ॥ఏమి సేతురా॥

అర్థాలు : అక్షయము = తరుగులేని, అరిపితము = ఈయబడినది, లేగదూడ = పాలుత్రాగు దూడ.

తాత్పర్యము : ఓ శివా! నశింపని ఆవుపాలు తెచ్చి నీకు పూజగా ఇద్దామంటే - ఈ నశింపని ఆవుల యొక్క పాలు త్రాగు దూడలు - నేను తెచ్చే పాలను తాము తాగిన ఎంగిలంటున్నాయి. ఓ మహానుభావా! శివా! ఎంగిలి పాలతో నీకు పూజ ఎలా చేయమంటావు!?

విశేషాలు : 1) ఆవు మన సంస్కృతిలో చాలా పవిత్రమైనది.

2) అక్షయావులు అనే సమాసము వ్యాకరణ పరంగా దోషం కావచ్చు కాని, అర్థపరంగా గొప్పది.

3) అక్షయావులంటే నాశనము లేని ఆవులు అని అర్థం వస్తుంది. మనం గోమాతను ఎంత పూజించినా వాటి జీవితానికి కూడా ఒక ముగింపు ఉంటుంది కదా!, అలాంటప్పుడు నాశనము లేని ఆవులు ఏమిటి? దీనికి జవాబు అక్షయ తృతీయ గురించి తెలుసుకొన్న తర్వాత వస్తుంది.

4) వైశాఖ శుద్ధ తృతీయ నాడు కృతయుగం, కార్తిక శుక్ల నవమి నాడు త్రేతాయుగం భాద్రపద బహుళ త్రయోదశినాడు ద్వాపర యుగం, మాఘ బహుళ అమావాస్యనాడు కలియుగం ప్రారంభమైనదని గ్రంథాలలో ఉంది. ఇందులో 'వైశాఖ శుద్ధ తృతీయను అక్షయ తృతీయ పండుగగా జరుపుకొంటాం. జీవితంలో అన్నింటినీ అక్షయం చేసే రోజు కనుక 'అక్షయ తృతీయ'.

5) బతికినంతకాలం మానవుల జీవితాలను సంతోషంతో నింపి దుఃఖ నాశనం చేసేవి కనుక ఆ ఆవులు "అక్షయావులు"

6) తల్లిపాల వలె సులభంగా జీర్ణం అయ్యే శక్తి ఆవు పాలల్లో ఉంది. ఆవుపాలు

సంపూర్ణాహారము అంటారు. క్రొవ్వు ఉండదు. ఆ అక్షయావుల పాలతో స్వామిని సేవిద్దా మనుకొన్నాడు భక్తుడు. ఆ ఆవుల లేగదూడలు మేము ఆ అమ్మ దగ్గర పాలు తాగాము. ఆ తరువాత మా అమ్మ పొదుగులనుండి పాలను నువ్వు పిండావు. ఆ పాలు మా నోటితో ఎంగిలి చేసినవే కదా! వాటిని శివునికి నైవేద్యముగా ఎలా ఇస్తావని లేగదూడలు తనను ప్రశ్నిస్తున్నాయని భక్తుడు అంటున్నాడు.

చరణం3: తుమ్మిపూవులు తెచ్చి – నీకు తుష్టుగా పూజ్జేద్దమంటే – ఓహో!
కొమ్మకొమ్మకు కోటి తుమ్మెద – ఎంగిలంటున్నాది లింగా
మహానుభావా! మహదేవశంభో! – మా లింగమూర్తి ॥ఏమి సేతురా॥

తాత్పర్యము : ఓ శివా! నీకు ఇష్టమయిన తుమ్మి పువ్వులు తెచ్చి నీకు పూజను చేద్దామనుకొన్నాను. కాని, తుమ్మి పువ్వుల మీద వాలి వాటిని ఎంగిలి చేసిన తుమ్మిదలు– ఆ పూలు ఎంగిలివి కదా! శివుడికి నైవేద్యము ఎలా పెడతావని వెక్కిరిస్తున్నాయి.

విశేషాలు :1) **"పుష్పమూలే వసేద్బ్రహ్మ మధ్యే చ కేశవః**
పుష్పాగ్రే చ మహాదేవః సర్వదేవాః స్థితా దలే"

పుష్పం మొదట్లో బ్రహ్మ, పుష్పమధ్యమంలో కేశవుడు, పుష్పపు కొనలో మహాదేవుడు ఉంటారు. పుష్ప దళాలలో అందరు దేవతలుంటారని ప్రసిద్ధి. అందుకే పూలతో సేవ విశిష్టమయినది.

2) **చైత్రమాసంలో** శివుని దర్భ పూలతో పూజిస్తే బంగారం పెరుగుతుంది. **వైశాఖమాసంలో** తెల్లని మందారాలతో పూజిస్తే అశ్వమేధఫలం దక్కుతుంది. **జ్యేష్ఠ మాసంలో** పెరుగుతో అభిషేకిస్తూ తామరపువ్వులతో పూజిస్తే పరమగతి కలుగుతుంది. **ఆషాఢమాసంలో** తొడిమలతో కూడిన పుష్పాలతో పూజిస్తే పరమపదం వస్తుంది. **శ్రావణమాసంలో** గన్నేరుపూలతో పూజిస్తే వేయి ఆవులు దానం చేసిన ఫలితం వస్తుంది. **భాద్రపద మాసంలో** ఉత్తరేణి పూలతో పూజిస్తే పుణ్యపదము లభిస్తుంది. **ఆశ్వయుజమాసంలో** జిల్లేడుపూలతో పూజిస్తే దివ్యపదాన్ని చేరుకొంటారు. **కార్తికమాసంలో** జాజిపూలతో పూజిస్తే శివపదాన్ని దర్శిస్తారు. **మార్గశిర మాసంలో** పొగడపూలతో పూజిస్తే, మూడు లోకాలను దాటి తామున్న చోటికే తిరిగి వస్తారు. **పుష్యమాసంలో** ఉమ్మెత్త పూలతో పూజిస్తే పరమపదాన్ని పొందుతారు. **మాఘమాసంలో** బిల్వదళాలతో పూజిస్తే పరమపదము పొందుతారు. **ఫాల్గునమాసంలో** తుమ్మిపూలతో పూజిస్తే ఇంద్ర సింహాసనంలో సగభాగం దక్కుతుంది. ఈ తత్త్వంలో తుమ్మి పూలను రచయిత పేర్కొన్నాడు.

3) 'ఏమి సేతురా లింగా' అనే ఈ తత్త్వ భావాన్ని వేటూరి సుందరరామ్మూర్తి గారు 'జననీ జన్మభూమి' చలనచిత్రంలో ఒక ప్రేయసీ ప్రియులు పాడిన పాటగా మలిచారు. "తుమ్మి పువ్వులకి తూనీగల ఎంగిలి", "గంగ నీళ్ళకి చేప కప్పల ఎంగిలి" చెప్పి చివర్లో "నన్నే నీకొగ్గేసి కన్నూ మూదామంటే కన్నోళ్ళ మురిపాల ముద్దలెంగిలి సేసే'' అంటూ ముక్తాయించారు. ముఖే ముఖే సరస్వతీ!

ఈ తత్త్వం ద్వారా రచయిత ఏమి చెబుతున్నాడు?

ఈ తత్త్వంలో రచయిత నీరు, పాలు, పూలతో పూజ చేద్దామంటే అవి ఎంగిలయ్యాయని ఒక అమాయకమైన, నివేదనా భావంతో పాటు, శుద్ధమైన మనస్సు ముఖ్యమని భక్తులకు సందేశమిస్తున్నాడు. గంగనీరు, ఆవుపాలు, తుమ్మి పూలు వంటివి లేకున్నా నిర్మలమైన మనస్సు అర్పిస్తే ఆ శివుడు సంతోషపడతాడని సందేశము. ఈ సందేశాన్ని పాటించి నిర్మల మనస్కులమవుదాం. స్వస్తి. ✦

ఆంధ్రనాయక శతక సౌందర్యము

- డా॥ కె. గిరిజాలక్ష్మి, నెల్లూరు.

సీ॥ శ్రీమద్వికుంఠపురీ వరేశుడవయ్యు
గొల్లపల్లెల నుండ గోరుటేమి?
యక్షీణ లక్ష్మీకటాక్షవీక్షుడవయ్యు
ద్రోవలేకింటింట దోచునేమి?
భూరి చతుర్దశ భువనావనుడవయ్యు
గడువేడ్క దొఱ్ఱుల గాయనేమి?
సన్మునిదేవతాసంభావితుడవయ్యు
నాలగాపరులతో నాడనేమి?

గొప్పలో గొప్పవాడవు, కొలదిలోన - గొలదివాడవు నిన్నెట్లు గొలువవచ్చు
చిత్రచిత్రప్రభావ! దాక్షిణ్యభావ! - హతవిమతజీవ! శ్రీకాకుళాంధ్రదేవ! 33

"అణోరణీయాన్ మహతో మహీయాన్" అనే వేదోక్తి ఈ పద్యంలో శ్రీకృష్ణుని లీలల పరంగా అన్వయించబడింది.

వైభవోపేతమైన వైకుంఠపురంలో ఉండే శ్రీమన్మహావిష్ణువు కోరి గొల్లపల్లెకు చేరడం పరమాశ్చర్యం. తరగని సంపదలిచ్చే లక్ష్మీదేవి కడగంటి చూపులకు పాత్రుడైన స్వామి ఇల్లిల్లు దిరిగి వెన్నముద్దలు దోచుకోవడం న్యూనతాపాదకం. లోకాన్ని రక్షించే మహనీయుడు వేడ్కతో ఆలమందల్ని కాచుకుంటూ తిరుగాడడం తక్కువదనం. సనక, సనందాది సన్ముని గణం చేత సంభావితుడయ్యే యోగీశ్వరేశ్వరుడు అతి సామాన్యులైన ఆలగాపరులతో ఆడుకోవడం హాస్యాస్పదం.

భగవంతుడు గొప్పవాళ్ళలో గొప్పవాడు. కొలది వాళ్ళలో కొలదివాడు. సామాన్యుడుగా గొల్లపల్లెలో జన్మించి, అతిమానుష కృత్యాలు కావించి, రాక్షస వినాశనం చేశాడు. పాలు, పెరుగు, వెన్నలను స్వార్థబుద్ధితో లోకాని కందనీయకుండా, దాచుకునే వారికి కనువిప్పు కల్గేటట్లుగా దొంగిలించి ప్రజలకు పంచిపెట్టాడు. ఆలమందల్ని సంరక్షించటం అధమకృత్యం కాదు. గోవులు సకలజీవులకు ప్రతీకలు. కాబట్టి స్వామి సకల జీవ సంరక్షకుడైనాడని అర్థం. ఎప్పుడైతే వైకుంఠవాసుడు, గొల్లపల్లెలో అవతరించాడో, అప్పుడే మహామునులు ఆయనకు స్నేహితులుగా, ఖగాలుగా, మృగాలుగా గోపికలుగా

జన్మించి స్వామి దర్శన, స్పర్శన, సౌఖ్యాదుల్ని అనుభవించారు. ఈవిధంగా ఈ పద్యంలో స్తుతి అంతర్గతంగా అవగతమవుతుంది.

ఎంత గొప్పవాడో అంత తక్కువవాడుగా మెలగడం స్వామికే చెల్లింది. ఇట్లాంటి వాడినెట్లా ఆరాధించాలి? "నిన్నెట్లు కొలువవచ్చు?" అని కాకువుతో ప్రశ్నార్థకంగా, చదివితే, "కొలువలేమ"ని నిందార్థం. "కొలువవచ్చు" నని నిశ్చయార్థంగా పలికితే, గొప్పవాడుగా గాని, తక్కువవాడుగా గాని ఎట్లాగైనా కొలువవచ్చుననేది స్తుతి పరమైన అర్థం.

✦ .... (సశేషం)



ఆరోగ్యము –

శిశుపాలన

'కోమల సాహితీవల్లభ'

– డా॥ కోడూరు ప్రభాకరరెడ్డి, ప్రొద్దుటూరు

తల్లులకూ, కాబోయే తల్లులకూ.... అన్నిపాల కన్న తల్లిపాలు మిన్న

దంత సమస్యలు :

పళ్లు తోమే విధానం : శరీరంలోని అన్ని భాగాల్లోనూ సూక్ష్మక్రిములు ఎక్కువగా వుండే భాగం నోరు ఆహారం తినేటప్పుడు చిన్న చిన్న పలుకులు పళ్ల చిగుళ్లలో ఇరుక్కొని వెంటనే శుభ్రం చేయకపోతే వాటిపై సూక్ష్మక్రిములు చేరి రకరకాల విషపదార్థాలు, ఆమ్లాలు చేరతాయి. ఈ ఆమ్లాలు పంటిమీది ఎనామిల్ పొరను దెబ్బతీయడం వల్ల పిప్పిళ్లు (Caries teeth) వస్తాయి. ఒక్కోసారి ఇన్‌ఫెక్షన్ ఎక్కువయి దవడవాపు, జ్వరం వస్తాయి. కాబట్టి తినిన ప్రతిసారి పళ్లను శుభ్రం చేసుకోవడమేకాక రాత్రి పడుకోబోయే ముందు కూడా పళ్లను శుభ్రం చేసుకుంటే చాలా వరకు పళ్ల సమస్యలను నివారించుకోవచ్చు. చిన్నపిల్లల్లో పాలపళ్లన్నీ వచ్చే వరకు వేలితో శుభ్రం చేస్తే సరిపోతుంది. పాలపళ్లు వచ్చాక – అంటే ఏడాది నుండి రెండేళ్ల వరకు మృదువైన బ్రష్‌తో శుభ్రం చేయవచ్చు.

పిప్పిపళ్లు (Caries Teeth) : పాశ్చాత్తా దేశాల్లో దాదాపు 30–40 శాతం పిల్లలకు పిప్పిపళ్ల సమస్య వుంది. ఈ సమస్య తీపి పదార్థాలు అతిగా తినడం వల్ల, ఆహారం తిన్న తర్వాత నోరు సరిగ్గా కడుక్కోకపోవడంవల్ల, పాలసీసాల్లో ముఖ్యంగా రాత్రిపూట పాలు తాపడం వల్ల ఎక్కువగా వస్తుంది. దీన్ని అశ్రద్ధ చేస్తే దాంట్లోని ఇన్‌ఫెక్షన్ మిగతా దంతాలకు ప్రాకి కొత్తగావచ్చే పళ్లకు కూడా వ్యాపిస్తుంది. ఈ పిప్పిపళ్లవల్ల ఆహారం సక్రమంగా నమల్లేక పోషకాహార లోపం కూడా రావచ్చు.

కళ్లల్లో నీరు / పుసి కారడం : కళ్లను ఎప్పుడూ తేమగా వుంచడానికి కళ్లల్లో నీరు నిరంతరం ఊరుతూ వుంటుంది. ఈ నీటిపొర కంటి కొలకుల దగ్గర వుండే చిన్న రంధ్రం గుండా కంటిలో నుండి ముక్కులోకి తెరుచుకొనే గొట్టం (Nasolactymal duct) లోనికి ప్రవేశించి ముక్కులోకి కారిపోతుంది. ఈ గొట్టం మూసుకోవడం వల్ల ఇలా కారే నీరు కంట్లోనే నిలిచిపోయి ఇన్‌ఫెక్షన్ వచ్చి కళ్లలో నీరు కారడం, పుసులు కట్టడం జరుగుతుంది. ఈ డక్ట్ తెరచుకోవడానికి రోజూ కంటికొలుకుల నుంచి ముక్కుకేసి నొక్కుతూ మసాజ్ చేయాలి. రోజుకు 6సార్లు 5–10 నిమిషాలు చేయాలి. ఇలా మూడు నెలలు చేసినా ఉపయోగంలేకపోతే నేత్రవైద్యులు కంటి కొలుకు దగ్గరి రంధ్రం ద్వారా సిరెంజ్‌తో (Irrigation) మార్గం సరిచేస్తారు. మన పెద్దలు చంటిపిల్లలకు సాన్నం చేయించేటప్పుడు

ముక్కు పై భాగం ఒత్తుతూ వుండడం ఈ డక్ట్ సరిచేయడానికే!

మెల్లకన్ను (Squint) : పసిపిల్లల్లో మెల్లకన్ను (Squint) దాదాపు నాలుగుశాతం మందిలో కనిపిస్తుంది. వీరిలో చాలామందికి ఆరునెలల వయసుకల్లా ఇది తగ్గిపోతుంది. కొంతమందిలో ఇది వంశపారంపర్యంగా వస్తుంటుంది. అలాగే మెదడు ఎదుగుదల సక్రంగాలేని పిల్లల్లో కూడా అప్పుడప్పుడు కనిపిస్తుంది. పిల్లలు పెరుగుతూ వున్నా మెల్లకన్ను వుంటే కొన్ని నష్టాలుంటాయి. రెండుకళ్లు ఒకేసారి ఒక వస్తువును చూడడంవల్ల 'బైనాక్యులర్ విజన్' ప్రభావితమవుతుంది. దీనివల్ల రెండు వస్తువుల మధ్య దూరం మెదడుకు సరిగా అవగతం కాదు. దానివల్ల 'డెప్త్ ఆఫ్ విజన్' సక్రమంగా వుండదు. రెండు కళ్లల్లోంచి మెదడుకు అందే దృష్టి సంకేతాలు వేరువేరుగా వుండడం వల్ల మెదడు ఒక కంటి సంకేతాలను అణచివేస్తుంది. అందువల్ల ఒక కంటిచూపు దెబ్బతింటుంది. అంతే కాకుండా మెల్లకన్నున్న పిల్లలు న్యూనతాభావానికి గురవుతారు. ఈ నష్టాలను దృష్టిలో వుంచుకొని 6 నెలలు పైబడిన పిల్లల్లో మెల్లకన్నుంటే పిల్లల డాక్టర్లు, కంటి డాక్టర్లను సంప్రదించాలి. కొందరికి కళ్లద్దాలు (Prizm Lense) వాడడం ద్వారా చూపుకు రెండు కళ్ల మధ్యవున్న అసమానతని కొంతవరకు నయం చేయవచ్చు. కంట్లో చుక్కలు వేయడం లేదా కంటికి పట్టీ కట్టడం ద్వారా బలహీనంగా వున్న కంటిచూపు మెరుగుపర్చే అవకాశముంది. అలా వీలుకాని పరిస్థితుల్లో దాదాపు 80 శాతం మెల్లకళ్లని ఆపరేషన్ ద్వారా నయం చేయవచ్చు. 'మెల్ల' వుంటే అదృష్టం అని మూర్ఖంగా ఆలోచిస్తే ఒక కంటిచూపు శాశ్వతంగా కోల్పేయే ప్రమాదముంది.

పుట్టుకతో కంటి శుక్లాలు (Congenital Cataract) : పుట్టుకతో వచ్చే కంటి శుక్లాలు తల్లి గర్భంలో వున్నప్పుడు సోకే కొన్ని వైరస్ ఇన్‌ఫెక్షన్ (టార్చ్ ఇన్‌ఫెక్షన్) వల్ల రావచ్చు. ఈ శుక్లాలను మూడు నెల్ల వయసులోపలే ఆపరేషన్ చేసి తొలగించకపోతే కాంతి తగలక కంటి నరాలు దెబ్బతిని ఆ తర్వాత వాటిని తొలగించినా ఉపయోగంలేక శ్వాశత అంధత్వం వచ్చే ప్రమాదముంది. శస్త్ర చికిత్స తర్వాత క్రమం తప్పకుండా నేత్రవైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేస్తుండాలి. అలా చేస్తూ వుంటే కంటిచూపు దాదాపు 9 సంవత్సరాల వయస్సు రావచ్చు.

నాలుక కొన అతుక్కొని వుండడం (Tongue Tie) : దీన్ని ఆంగ్ల పరిభాష 'Tongue Tie' అంటారు. ఇందులో నాలుక కొన నోట్లో కింద అతుక్కొని వుంటుంది. పిల్లల్లో నాలుక కొన పెరుగుదల 2, 3 సంవత్సరాల వరకు వుంటుంది. కాబట్టి నెలల వయసులో కనిపించే 'టంగ్‌టై' రెండు, మూడు సంవత్సరాల కల్లా కనిపించకపోవచ్చు. అందరూ అపోహపడేటట్లు దీనికి మాటలకి ఏ సంబంధమూ లేదు. అంతే కాకుండా దీనివల్ల నత్తిరాదు. చాలా అరుదుగా ఈ సమస్య తీవ్రంగా వుంటుంది. తథ, దధ, నల వంటి నాలుక చివరి భాగం సహాయంతో పలకవలసిన పదాలు పలక లేకుంటే మాత్రమే శస్త్ర

చికిత్స అవసరముంటుంది.

నాలుకపై తెల్ల, ఎర్ర మచ్చలు : నాలుకపై రకరకాల ఆకారాలతో వచ్చే మచ్చల సమస్యను 'మ్యాప్ టంగ్' అంటారు. అప్పుడప్పుడు ఇలా వచ్చే మచ్చలు దేశపటాలను పోలి వుంటాయి కాబట్టి దీన్ని 'Map Tongue' అంటారు. ఇది నాలుకకు చెందిన ఒక పరిస్థితే కాని జబ్బుకాదు. అందువల్ల దీనికై ప్రత్యేకంగా మందులు వాడాల్సిన అవసరం లేదు. నాలకపైని కణాలు వారానికోసారి కొత్తకణాలతో మార్పు జరగడం జరుగుతుంది. ఈ ప్రక్రియ నాలుక మొత్తమంతా ఒకేసారి జరగకుండా అక్కడక్కడా విడతలుగా జరిగినప్పుడు ఒకచోట కొత్తకణాలు, మరొకచోట పాతకణాలతో వేరువేరుగా కనిపిస్తుంది. దీనివల్ల పిల్లల ఆరోగ్యానికి ఏ మాత్రం హాని వుండదు.

గ్రహణం- మొర్రి (Cleft Lip and Cleft Palate) : పిల్లల్లో పై పెదవి, అంగిలి పుట్టుకతోనే చీలి వుంటుంది. ఇది అందరూ అనుకుంటున్నట్లు గర్భవతులు గ్రహణం చూడడం వల్ల కాదు. ఈ పిల్లలకు పాలు తాగడం ఇబ్బందిగా వుండడం, ముక్కులో నుంచి పాలు రావడం, పదేపదే జలుబు, న్యూమెనియా రావడం వంటి సమస్యలుంటాయి. దాదాపు 3, 4 నెలల వయసులో చీలిన పెదవిని (Cleft Lip), చీలిన అంగిలిని ఏడాది వయసులోను శస్త్ర చికిత్స ద్వారా సరిచేయాలి. ఈ చికిత్స ఆలస్యమయితే పిల్లలకు మాటలు సరిగ్గా రాకపోవచ్చు. ఈ పిల్లలను పాలు సరిగ్గా తాగడానికి వీలుగా కూర్చోబెట్టి చెంచా లేక ఉగ్గు గిన్నెతో తాపాలి. ఈ లోపం వున్న పిల్లలకు గుండె మూత్రపిండాలకు సంబంధించిన పుట్టుకతో వచ్చే జబ్బులుండవచ్చు కాబట్టి అవసరమైన ఆయా పరీక్షలు చేయించాలి. ఈ మధ్య లభ్యమవుతున్న అంగిలిని మూసివుంచే పరికరాలు లభిస్తుండడం వల్ల ఇలాంటి పిల్లలకు పాలు తాగించడం తేలికవుతుంది. ✦ .... (సశేషం)

శ్రీభ్రమరాంబా మల్లికార్జున దేవాలయం - శ్రీశైలం

- గబ్బిట దుర్గాప్రసాద్, ఉయ్యూరు.

ద్వాదశ జ్యోతిర్లింగాలలో మొదటిది గుజరాత్‌లోని సోమనాథుడు అయితే రెండవది ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలోని మల్లికార్జునుడు. శ్రీశైల శిఖరం చూస్తేనే పునర్జననం వుండదు అని మన పురాణాలు చెబుతున్నాయి. అంతటి ముక్తిక్షేత్రం.

శ్రీశైలం కర్నూలు జిల్లాలో, ఆత్మకూర్ తాలూకాలో, నల్లమల అడవుల్లో ప్రకృతి రమణీయకత మధ్య వున్న దివ్యక్షేత్రం. ఇక్కడ కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రవహిస్తుంది. ఇక్కడ ఈ నదిని "పాతాళ గంగ" అని పిలుస్తారు. ఇక్కడి అమ్మవారు భ్రమరాంబా దేవి. 18 శక్తి పీఠాలలో ఒకటి. అమ్మవారి ఆలయంలోపల నిత్యం భ్రమరాల ధ్వని అంటే తుమ్మెద ఝుంకారం వినిపించేదట. అందుకని ఆ పేరు. ఇప్పుడు జన సమ్మర్ధం బాగా ఎక్కువైనందువల్ల వినిపించటం తగ్గింది. చెవులు గోడకు ఆనించి, గర్భగుడిలో వింటే భ్రమరనాదం చెవులకు ఇంపుగా వినిపిస్తుందని కథనం. భ్రమరాంబా, మల్లికార్జున నిలయమైన ఈ క్షేత్రం వేదాలకు, సకల సంపదలకు నిలయం. ఎనిమిది శృంగాలతో, 44 నందులతో, 60 కోట్ల తీర్థాలతో, పరాశర, భారద్వాజాది మహర్షుల తపోవనాలతో, వర్ధిల్లిన క్షేత్రం. ఇక్కడ చంద్రగుండ, సూర్య గుండ పుష్కరిణులుండేవి. స్పర్శవేది మొదలైన లతలతో వున్న అరణ్య ప్రాంతం. లెక్కలేనన్ని ఔషధాలున్న దివ్యభూమి.

ఈ క్షేత్రం విజయవాడకు 230 కి.మీ. దూరంలో, హైదరాబాద్‌కు 220 కి.మీ.

దూరంలో వుంది. ఇక్కడ అన్ని కులాల వారికి ఉచిత భోజన సత్రాలు వున్నాయి. ముందుగా "కరివెన వారి బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం" ఏర్పడి 110 సంవత్సరాలయింది. దీనికి కాశీ, షిరిడీ ప్రయాగలోను బ్రాంచీలు ఉన్నాయి. వసతి కోసం సత్రాలు చాలా ఉన్నాయిక్కడ. దేవస్థానం కాటేజీలు, గదులు వున్నాయి. దేవస్థానం ఉచిత భోజన సౌకర్యం కల్గిస్తోంది.

శ్రీశైలానికి ప్రకాశం జిల్లాలోని త్రిపురాంతకం తూర్పు ద్వారం. కడప జిల్లాలోని సిద్ధవటం దక్షిణ ద్వారం. మహబూబ్ నగర్‌లోని అలంపురం పశ్చిమ ద్వారం. ఉమామహేశ్వరం ఉత్తర ద్వారంగా వున్నాయని పురాణాలు చెప్పాయి. అలాగే నాలుగు మూలలా నాలుగు ఉపద్వారాలున్నాయి. ఆగ్నేయంగా పుష్పగిరి, నైరుతిలో సోమశిల, వాయువ్యంలో సంగమేశ్వరం, ఈశాన్యంలో ఏలేశ్వరం ఉన్నాయి.

ఈ క్షేత్రం కృతయుగంలో హిరణ్యకశిపునికి పూజా మందిరంగా, అహోబిల క్షేత్రం సభామండపంగా ఉండేదని, త్రేతాయుగంలో శ్రీరాముడు అరణ్యవాసం చేస్తూ ఇక్కడ సీతాదేవితో కలిసి మల్లికార్జునస్వామిని దర్శించి "సహస్ర లింగాన్ని" ప్రతిష్ఠించాడని, ద్వాపర యుగంలో పాండవులు, ద్రౌపదీ సమేతంగా ఈ క్షేత్రాన్ని దర్శించి "సద్యోజాత లింగాన్ని ప్రతిష్ఠించారని పురాణ కథనం. ఇప్పుడు కూడా ఇక్కడ రామ సహస్రలింగం, సీతా సహస్ర లింగం, పాండవ సద్యోజాత లింగం నిత్యం భక్తుల పూజలు అందుకుంటున్నాయి.

శ్రీశైలం భూమికి నాభిస్థానం. భారతీయుల నిత్యపూజా విధానంలో సంకల్పం చెప్పేటప్పుడు "శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే" అని మనం చెప్పుకొంటాం. మనలాగే అందరు కూడా శ్రీశైలానికి ఏ దిక్కున వున్నవారు ఆ దిక్కుపేరు చెప్పి పూజించటం అలవాటు. అంతటి ప్రాచుర్యం పొందిన క్షేత్రం. దక్షిణ కైలాసంగా శ్రీశైలం ప్రసిద్ధి చెందింది. ఇక్కడ మల్లికార్జున మహాలింగాన్ని, యాత్రికులు, కాళ్లు కూడా కడుక్కోకుండా సరాసరి గుడిలోకి వెళ్లి స్వయంగా లింగాన్ని తాకి, శిరస్సును లింగానికి ఆనించి పూజించి అభిషేకం చేసుకుంటారు. దీన్ని **"ధూళి దర్శనం"** అంటారు. ఇలా, ఇంకెక్కడా వుండదు. కాశీలో మాత్రం ఈ అవకాశం ఉంది.

కృష్ణానది ఇక్కడికి వచ్చే ముందు, బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలను చుట్టి వస్తుంది. స్కంద పురాణంలో ఏకంగా "శ్రీశైల ఖండం" వుంది. 18 పురాణాలలో భారత, రామాయణాలలో, అన్ని భాషల గ్రంథాలలో శ్రీశైల ప్రస్తావన ఉంది. ఇక్కడే శంకర భగవత్పాదులు మల్లికార్జున భ్రమరాంబ దర్శనం చేసి, తపస్సు చేసి "శివానందలహరి" వ్రాశారు. "సేవే శ్రీ గిరి మల్లికార్జున మహాలింగం... శివాలింగితం" అని చెప్పుకొన్నారు. ఇక్కడి ప్రశాంత వాతావరణానికి ముగ్ధులై శ్రీ శంకరులు

"యోగతారావళి" అనే గ్రంథంలో "శ్రీశైల పర్వత గుహలలో సిద్ధిని పొందాలి అని కోరుకోవటం ఈ క్షేత్రం గొప్పతనం" అని ప్రశంసించారు.

శ్రీశైల క్షేత్రంతో శిలాద మహర్షి, గుప్త వంశానికి చెందిన చంద్రవతి, కుమారస్వామి, వసుమతి, అక్కమహాదేవి, మహాశివ భక్తురాలు హేమారెడ్డి మల్లమ్మ, సిద్ధ రామప్ప, కుమ్మరి కేశప్ప, ఉబ్బలి బసవన్న, వృద్ధ మల్లికార్జునుడు, మొదలైన వారి కథలన్నీ ముడిపడి వున్నాయి. స్కంద పురాణంలో 64 అధ్యాయాల "శ్రీశైల ఖండం" వుంది. మహాభారతంలోని అరణ్యపర్వంలో, హరివంశంలో 40వ అధ్యాయంలో, పద్మపురాణంలో 20వ అధ్యాయంలో, మార్కండేయ పురాణంలో 11వ అధ్యాయంలో, శివపురాణంలో రుద్రసంహితలో ఆరవ అధ్యాయంలో, భాగవత దశమ స్కంధంలో 80వ అధ్యాయంలో, ఆదిత్య పురాణంలో, సూత సంహితలో, శ్రీశైల క్షేత్ర విశేషాలన్నీ వివరంగా ఉల్లేఖింపబడి వున్నాయి. సిద్ధనాథుడు రచించిన **"రస రత్నాకరం"** అనే గ్రంథంలో శ్రీశైలంలో దొరికే వనమూలికల గురించి, ఇక్కడి దివ్య విభూతి గురించి వివరణ వుంది. సోమేశ్వరుని "కథా సరిత్సాగరం"లో, భవభూతి రాసిన "మాలతీ మాధవం"లో, భట్టభాణుని 'కాదంబరి'లో శ్రీహర్షుని రత్నావళి నాటకంలో శ్రీశైల ప్రస్తావన వుంది.

నన్నయగారు అర్జునుని తీర్థయాత్ర సందర్భంగా శ్రీశైలాన్ని వర్ణించారు. పాల్కురికి సోమన 'బసవ పురాణం'లో శ్రీశైలాన్ని అద్భుతంగా వర్ణించి, తన వీరశైవాన్ని చాటుకొన్నాడు. "శ్రీ పర్వత ప్రకరణం"లో శ్రీశైల మహిమలు వర్ణించాడు. పండితారాధ్య చరిత్ర, "ప్రభు లింగలీల"లో దీన్ని బాగా వివరించాడు. త్రిపురాంతకుడు రాసిన "త్రిపురాన్తకోదాహరణం" లోను, శ్రీనాథుని "హర విలాసం"లోను ఈ క్షేత్ర ప్రాధాన్యత ఉంది. నాగలూరి శేషనాతుడు తన "శ్రీ పర్వత పురాణం"లో, శ్రీనాథుని "పలనాటి వీర చరిత్ర"లో, తాళ్ళపాక తిమ్మక్క రాసిన "సుభద్రా కల్యాణం"లో, పింగళి సూరన "కళాపూర్ణోదయం"లో, ధూర్జటి "కాళహస్తీశ్వర శతకం"లో, మల్లన రచించిన "రుక్మాంగద చరిత్ర"లో, చేమకూర వేంకట కవి "విజయ విలాసం"లో శ్రీశైల ప్రసక్తి వుంది. రఘునాథ నాయకుని "వాల్మీకి చరిత్ర" లోనూ దీని ప్రాశస్త్యం వర్ణింపబడింది. ఇలా సంస్కృత, తెలుగు గ్రంథాలలోనే కాక అనేక భారతీయ భాషల్లో ముఖ్యంగా కన్నడ, తమిళ, మరాఠీ భాషల్లో శ్రీశైల ప్రస్తావన వుంది. శ్రీశైల పర్వతాన్ని "శ్రీ పర్వతం" అంటారు.

శ్రీశైల మహాలింగం

సుమారు మూడు లక్షల చదరపు అడుగుల వైశాల్యం గల శ్రీశైలస్వామి ఆలయం చుట్టూ, 2121 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తున వున్న ఎత్తైన గోడ కోటగోడలా వుంది. ఈ ప్రాకారంలో 3153 శిలలున్నాయి. వీటన్నిటిపైన బైట అంచులో శిల్పాలు

చెక్కబడి వున్నాయి. ఎనిమిది దిక్కుల, అష్ట భైరవ స్వాములు ప్రతిష్ఠింపబడి వుంటారు. ప్రాకారానికున్న నాలుగు వైపులా గోడపై, కింది వరుసలో ఏనుగులు, గుఱ్ఱాలు వివిధ భంగిమలలో చెక్కి వున్నాయి. తూర్పు గోడమీద పార్వతీ కల్యాణం, కిరాతార్జునీయం, గజాసురసంహారం, శివతాండవం, మార్కండేయకథ, శిబిచక్రవర్తికథ, క్షీరసాగర మథనం, శ్రీకాళహస్తీశ్వరమాహాత్మ్యం, భక్తకన్నప్ప, తారకాసురసంహారం, త్రిపురాసుర సంహారం, మహాలింగోద్భవం, శివతపోభంగం, వీరశైవుల ఆత్మార్పణ, గణేశుడు మల్లికార్జున స్వామిని అర్చించటం, మొదలైన చిత్రాలు కళ్ళకు విందు చేస్తాయి. దక్షిణంలో వున్న గోడపై దక్షయజ్ఞం, పార్వతీ కల్యాణమునకు అష్టదిక్పాలకుల సన్నాహం. కన్నప్ప, శివుడి భిక్షాటనం, గణపతి నాట్యం చేస్తుంటే, హనుమ వేణువును ఊదే దృశ్యం, నాగబంధం, మహిషాసురమర్దిని, గండభేరుండం అత్యద్భుత శైలిలో చిత్రాలుగా మలచబడినాయి. ఉత్తర గోడపైన శివతాండవం, గంధర్వ స్త్రీల నృత్యం, యమధర్మరాజు, గండభేరుండం, భృంగీశ్వరుని నాట్యం, శివుని విశ్వరూపం, మనోహరంగా వుంటాయి. పడమటి వైపు పది భుజాల గణపతి అరుదైన దృశ్యం. ఈ ఆలయానికి నాలుగు వైపులా గోపురాలున్నాయి. తూర్పు గోపురాన్ని కృష్ణదేవరాయ గోపురం అంటారు. దీన్ని 15వ శతాబ్దిలో రాయలు కట్టించారు. 1516లో ఆ గోపురానికి ఎదురుగా వున్న రథ వీథిలో రెండువైపులా రెండు మండపాలను కూడా కట్టించారు. దక్షిణ గోపురాన్ని 1405లో రెండవ హరిహరరాయలు నిర్మించాడు. ఇదే హరిహర రాయల గోపురం, ఉత్తర గోపురమే ఛత్రపతి శివాజీ మహారాజు గోపురం. 1677లో ఆయనే కట్టించాడు. పడమటి గోపురమును దేవస్థానమే కట్టించింది. దీన్ని బ్రహ్మానంద గోపురం అంటారు.

ఈ నాలుగు గోపురాల మధ్య బంగారు శిఖరాలతో కనిపించే ప్రధాన ఆలయ విమాన గోపురాన్ని 1230లో కాకతీయ గణపతి దేవ చక్రవర్తి సోదరి మైలమదేవి నిర్మించింది. ఇవి దాటి గర్భాలయంలోకి ప్రవేశించాలి.

మల్లికార్జున ఆలయంలోని గర్భాలయం చాలా చిన్నది. లింగమూ చిన్నదే. అందుకే "మూర్తి చిన్నది, కీర్తి గొప్పది" అనే పేరు వచ్చింది. ఇది రెండవ జ్యోతిర్లింగం. మన శిరస్సును స్వామి లింగానికి ఆనించి మొక్కటం ఇక్కడి సంప్రదాయం. ఇప్పుడు రద్దీ ఎక్కువ అవటంతో ఆ అవకాశం లేదు. ఆలయానికి ముందు రంగ మండపం వుంది. దీనికి తూర్పు, దక్షిణ, ఉత్తర దిశల్లో ద్వారాలు, వాటి ముందు స్తంభాలతో వసారాలు గల ముఖ మండపాలు వున్నాయి. రెండు వైపులా వున్న అరుగులపై శాసనాలు చాలా వున్నాయి. మండపాన్ని విజయనగర చక్రవర్తి రెండవ హరిహరరాయలు 1405లో నిర్మించాడు. ఈ మండపంలోపల ఒక వైపు రత్న గణపతి, రెండవ వైపు భద్రకాళి, వీరభద్ర విగ్రహాలున్నాయి.

రంగ మండపానికి ముందున్న మండపమే "వర శిరో మండపం" రెడ్డి రాజు అనవేమారెడ్డి తండ్రి అన్నయ్య రెడ్డి పుణ్యం కోసం 1378లో దీన్ని కట్టించాడు. ఈ మండపంలోనే ఎంతో మంది వీరశైవభక్తులు తమ నాలుకలను, చేతులు, కాళ్ళను, శిరస్సులను ఖండించుకొని శివునికి అర్పించే వారని ఇక్కడి శాసనం తెలియజేస్తోంది. 38 స్తంభాలతో వుండేది. ప్రస్తుతం 16 మాత్రమే వున్నాయి. వీర మండపానికి ముందు నంది మండపం వుంది. కాకతీయ ప్రతాపరుద్రచక్రవర్తి కట్టించినట్లు కథనం. ఇదే బసవన్న మండపం. కన్నడంలో బసవన్నను "చెన్ను కళ్ళు బసవన్న" అనేవారు. ఇప్పుడు కూడా గంగిరెద్దుల వాళ్ళు గంగిరెద్దును నంది అవతారంగా భావించి "బసవన్న" అని పిలుస్తుండటం మనకు తెలుసు. డూడూ బసవన్న అనే పేరు తెలుగులో జాతీయం అయింది కదా. చెన్ను కళ్ళు బసవన్న కాలక్రమంలో "సెనగల బసవన్న" అయ్యాడు. ఈ బసవన్నకు సెనగలు ప్రీతి. శనగలు మొక్కుకొని ఆయనకు నివేదనగా అందిస్తారు. మల్లికార్జున స్వామిలాగే ఈయనా భక్తసులభుడే. గిద్దెడు శెనగలు బసవన్న మూతికి కడితే భక్తుల కోర్కెలు తీరుస్తాడని భక్తుల నమ్మకం. ఈ మండపానికి మూడువైపులా మండపాలున్నాయని చెప్పుకొన్నాం. పైభాగంలో దక్షిణామూర్తి, లోపల అష్టదిక్పాలకుల శిల్పాలు ఆకట్టుకుంటాయి.

సప్తమాతృకలు ఆలయానికి ఉత్తర, దక్షిణ భాగాలలో సాల మండపాలున్నాయి. దక్షిణ సాల మండపానికి ఆనుకొని బ్రాహ్మి, మాహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, ఇంద్రాణీ, చాముండీ అనే సప్త మాతృకల విగ్రహాలున్నాయి. చైత్రపున్నమి తరువాత అమ్మవారి కుంభోత్సవం జరుగుతుంది. అప్పుడు ముందుగా ఈ సప్త మాతృకలకు నైవేద్యం పెట్టిన పదార్థాన్నే భ్రమరాంబా దేవికి తీసుకొని వెళ్ళి నైవేద్యం పెడతారు. మిగతా కాలంలో వీటికి ఏవిధమైన ప్రాధాన్యతా లేదు. మనోహరగుండం సప్తమాతృకలకు ముందు, మండపంలా కనిపించే పైకప్పు ఒకటి వుంది. దీనికి కిందికి దిగటానికి మెట్లు వున్నాయి. ఇందులో నీళ్ళు తియ్యగా మనోహరంగా వుంటాయి. ఇలాంటివి ఆలయ ఆవరణలో 100 దాకా వుండేవని చెబుతారు. పూర్వకాలం యాత్రికులకు ఈ జలమే ఆధారం. ఇప్పుడు కృష్ణ నీరు కొండపైకి గొట్టాల ద్వారా వస్తోంది. కనుక దాదాపు అన్నింటినీ పూడ్చేశారు. బ్రహ్మగుండం – విష్ణు గుండం మల్లికార్జునాలయానికి ఆనుకొని దక్షిణ దిశలో గుండం వుంది. సప్త మాతృకలను ఆనుకొని పడమరవైపు విష్ణు కుండం వుంది. దిగటానికి మెట్లున్నాయి. దీన్ని "పాతాల బావి" అంటారు. నవబ్రహ్మ ఆలయంలో దేవాలయానికి పడమటి వాయువ్యంలో తొమ్మిది ఆలయాలున్నాయి. శివదేవుని అష్టమూర్తులైన భవమూర్తి, సర్వమూర్తి, ఈశానమూర్తి, పశుపతి మూర్తి, రుద్రమూర్తి, ఉగ్రమూర్తి, భీమమూర్తి, మహాదేవమూర్తి ఆలయాలు ఇవి. ఇవి వరుసగా జలలింగ,

భూలింగ, సూర్యలింగ, యాజమాన్య లింగ, అగ్ని లింగ, వాయులింగ, ఆకాశ లింగ, చంద్ర లింగాలు. ఈ పేరు ఎందుకు వచ్చిందో ఎవరూ చెప్పలేదు. వీటికి ఆనుకొని కుమారస్వామి ఆలయంలో షణ్ముఖుడుగా అద్భుత మూర్తితో స్కందుడు విరాజిల్లుతున్నాడు. దీనికి ఆనుకునే "ఆస్థాన మండపం" వుంది. పూర్వం మల్లికార్జున దర్శనానికి వచ్చే రాజులు ఇక్కడే కొలువుతీరేవారు. ఇక్కడే ఉత్సవ మూర్తులకు అలంకరణ చేసేవారు. అందుకే "అలంకార మండపం" అనీ అంటారు.

మల్లమ్మ – అక్క మహాదేవి ఆస్థాన మండపానికి లోపల ఒకగదిలో మల్లికార్జున భక్తురాళ్ళు అయిన హేమారెడ్డి మల్లమ్మ, అక్కమహాదేవి విగ్రహాలున్నాయి. ఉమామహేశ్వర స్వామి ఉత్తరసాల మండపం ఆలయాలలో పార్వతీదేవిని తన వామాంకం మీద కూర్చోపెట్టుకున్న ఉమామహేశ్వరస్వామి వున్నాడు. మనోహరమైన శిల్పం, దీనినే "పంచ నందీశ్వరుడు" అంటారు. అద్దాల మండపం ఉత్తర సాల మండపం చివర అద్దాల మండపం ఉంది. దీన్ని 1529లో చంద్రశేఖరామాత్యుడు కట్టినట్లు శాసనం ఉంది. స్వామివార్ల కళ్యాణం ఇక్కడే జరిగేది. భక్తుల సంఖ్య పెరగటంతోను, నిత్య కళ్యాణాలు జరుగుతుండటం తోనూ పెద్ద కళ్యాణ మండపాన్ని దేవాలయం కట్టించింది. ఇప్పుడు పాతదాన్ని "అద్దాల మండపం"గా తీర్చిదిద్దారు. స్వామివార్ల పవళింపు సేవ ఇప్పటికీ ఇక్కడే జరుగుతుంది. అంతేకాదు మహాశివరాత్రి నాడు జరిగే భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల కళ్యాణం, సంప్రదాయబద్ధంగా ఈ అద్దాల మందిరంలోనే జరగటం విశేషం. దీనికి ప్రక్కనే శ్రీ రాజరాజేశ్వరి ఆలయం ఉంది.

అర్ధనారీశ్వర పాండవ లింగాలు వీరభద్రస్వామి గర్భాలయానికి ఉత్తరంవైపు అర్ధనారీశ్వర ఆలయం ఉంది. దీనికి ఉత్తరాన ద్వాపర యుగంలో పాండవులు ప్రతిష్ఠించిన అయిదు లింగాలు, వాటికి ఆలయాలు వున్నాయి. వీటికి ఉత్తరాన వీరభద్రస్వామి ఆలయం వుంది. ఆయుధం ధరించి భీకరంగా కనిపిస్తాడు. ప్రాకారంపైన, బయటా అనేక వీరభద్రులున్నారు. వీరశైవ సంప్రదాయానికి ఇవి ప్రతీకలు. మల్లికాగుండం – బలిపీఠం – వృద్ధ మల్లికార్జునుడు. వీరభద్రాలయానికి తూర్పున మల్లికా గుండం వుంది. దీనిలో ఆలయ శిఖరం కనిపిస్తుంది. గుండం మధ్య చిన్న మండపంలో తెప్పోత్సవం జరిపేవారు. ఇప్పుడు అభిషేకానికే ఈ జలాన్ని ఉపయోగిస్తున్నారు. ఆలయంలో అంతర్వాహినిగా "సరస్వతీ నది" ప్రవహిస్తూ వుండటం వల్ల, ఈ గుండంలో సరస్వతీ నదీ జలం ఎప్పుడూ చేరుతూ ఒకే స్థాయిలో నీటి మట్టం వుండటం విశేషం. ఈ జలం వ్యాధులకు దివ్యౌషధంగా ప్రసిద్ధి. ఈ గుండానికి తూర్పున ముఖ మండపానికి ఉత్తర ద్వారానికి ఎదురుగా అందమైన బలిపీఠం వుంది. అష్టదిక్పాలక విగ్రహాలతో రెండస్తుల విమానం వుంది. పీఠంపై భాగాన

లింగము, నంది ముచ్చటగా వుంటాయి. 1235లో రాజమండ్రికి చెంది గంగ మల్లిశెట్టి బలిపీఠం నిర్మించినట్లు తెలుగులో వుంది. బలిపీఠానికి తూర్పున "వృద్ధ మల్లికార్జునస్వామి" ఆలయం వుంది. మల్లికార్జున స్వామివారి కంటే ప్రాచీన విగ్రహంగా భావిస్తారు. ఎత్తు పల్లాలతో వున్న పెద్ద లింగం అతి ప్రాచీనంగా వృద్ధ లింగంగా వుంటుంది. చంద్రగుప్త మహారాజు కుమార్తె ఈ స్వామినే అర్చించినట్లు కథ ప్రచారంలో వుంది. రామ ప్రతిష్ఠిత సహస్ర లింగం వృద్ధ మల్లికార్జున స్వామి వెనుకవైపు త్రేతాయుగంలో శ్రీరాముడు ప్రతిష్ఠ చేసిన "సహస్రలింగం" ఆలయం వున్నాయి. నల్లరాతి లింగం, కాకతీయ కట్టడంగా ఆలయం వుంది. త్రిఫల వృక్షం, వృద్ధ మల్లికార్జునుని తూర్పున మేడి, రావి, జువ్వి చెట్లు ఒకదానికొకటి పెనవేసుకుని పెరిగిన వృక్షమే "త్రిఫల వృక్షం" దత్తాత్రేయ మహర్షి, సిద్ధ నాగార్జునుడు మొదలైన వారెందరో దీని కింద తపస్సు చేసి మనోఫల సిద్ధి పొందినట్లు ప్రతీతి. 3000 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు వున్న వృక్ష రాజం ఇది. త్రిఫల చూర్ణం ఆయుర్వేదంలో గొప్ప మందు. అయితే ఇందులోని మూడు ఫలాలు ఉసిరిక, కరక్కాయ, తాడి నే త్రిఫలాలు అంటారు. మరి త్రిఫల వృక్షం అని ఎందుకు పిలుస్తున్నారో తెలీదు. సంతానం కోసం దీని చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు.

శ్రీ భ్రమరాంబాదేవి దర్శనం :

మల్లికార్జున స్వామి ఆలయం వెనుక ఎత్తైన వేదిక మీద భ్రమరాంబా దేవి ఆలయం వుంది. మెట్లు ఎక్కి వెళ్ళాలి. మెట్లకు ఎడమవైపు సిద్ధి వినాయకుని విగ్రహం, ద్వాపరయుగంలో ద్రౌపదీదేవి ప్రతిష్ఠించిన పంచలింగేశ్వరుడు వుండేవారు. ఆలయ పునరుద్ధరణలో వీటిని తొలగించారు. కొన్ని మెట్లు యెక్కగానే అమ్మవారి ఆలయ ధ్వజస్తంభం, సింహ మండపం వున్నాయి. మండపంలోని సింహం భయం కల్గించేటట్లుంటుంది. మరికొన్ని మెట్లు యెక్కగానే ముఖద్వారానికి ఎదుట త్రేతాయుగంలో సీతాదేవి ప్రతిష్ఠించిన "సహస్ర లింగేశ్వరస్వామి" వున్నాడు. పూర్తిగా మెట్లు యెక్కగానే భ్రమరాంబాదేవి ఆలయ దర్శనమిస్తుంది. నిర్మాణ వివరాలు తెలీవు. అయితే 1964లో ప్రదక్షిణ మండపం కట్టారు. సుమారు 2000 సంవత్సరాల క్రితం ఇక్కడ "వామాచారం" బలీయంగా వుండేది. నిరంతరం జంతుబలి జరిగేది. శ్రీ శంకరాచార్యుల వారు ఇక్కడ అమ్మవారి ఎదురుగా శ్రీచక్రాన్ని ప్రతిష్ఠితం చేసిన తర్వాత, "దక్షిణా చార సంప్రదాయం" అమలైంది. 1982 వరకు అమ్మవారికి బయటే జంతుబలి ఇచ్చేవారు. ఇప్పుడు లేదు. అమ్మవారి ఆవిర్భావం అరుణాసురుడు అనే రాక్షసుడు బ్రహ్మను గురించి తపస్సు చేసి రెండుకాళ్ల జీవులు, నాలుగు కాళ్ళ జీవులు వల్ల తనకు మరణం రాకుండా వరం పొందాడు. బరితెగించిన ఆ దానవుడు అందర్నీ భయపెట్టి లోకాలకు కంటకుడుగా మారాడు. దేవతలు అందరు

తమ శక్తులన్నీ ఆదిపరాశక్తికి అందించి వాడిని చంపమని వేడారు. ఆమె అరుణాసురునితో యుద్ధానికి తలపడింది. వేలాది తుమ్మెదలను వాడి సంహారానికి పురిగొల్పింది. ఆరుకాళ్ల జీవులైన అవి వాణ్ణి ఒక్కసారిగా కుట్టి బాధించి సంహరించాయి. దేవతల కోరికపై ఆదిశక్తి ఇక్కడ "భ్రమరాంబాదేవి"గా అవతరించింది. ఇప్పటికీ ఆలయం వెనుక గోడల నుండి భ్రమర ఝుంకారం వినిపిస్తుంది. నిలబడి వుండే అమ్మవారు అలంకారం వల్ల కూర్చున్నట్లు దర్శనమిస్తుంది. 18 శక్తిపీఠాలలో ఒక్కటైన శ్రీశైల పీఠం అధిష్ఠించిన **"భ్రామరీ శక్తి"** భక్తుల మనోభీష్టాలను తీర్చటంలో పేరు పొందింది.

లోపాముద్ర – శిల్ప మండపం – రుధిర గుండం – యాగశాల అమ్మవారి ఆలయం దక్షిణాన అగస్త్య మహర్షి అర్ధాంగి "లోపాముద్ర" విగ్రహం వుంది. ఆ దంపతులు శ్రీశైలం సందర్శించినట్లు క్షేత్ర మాహాత్మ్యంలో వుంది. లోపాముద్ర విగ్రహాలు ఇంకెక్కడా వున్నట్లు కనిపించదు.

ప్రదక్షిణ శిల్ప మండపంలో స్తంభాలపై శిల్పాలు సుందరంగా వుంటాయి. తొమ్మిది మంది స్త్రీలు ఏనుగు ఆకారంలో వున్న "నవనారీ కుంజరం", భద్రకాళి, శివ, విష్ణు, నటరాజ మూర్తి శిల్పాలు ఆకర్షణీయం. రుధిరం అంటే రక్తం. వామాచారంలో రక్తానికి ప్రాముఖ్యత ఎక్కువ. ఇక్కడ వేలాది జంతువులు బలివల్ల, ప్రక్కనున్న గుండంలో నీరు యెఱ్ఱబడింది. అందుకే రుధిర గుండం అనే పేరు. ఉత్తరాన వున్న ఈ గుండంలోని నీటిని అమ్మవారి అభిషేకానికి వాడుతున్నారు. ఆలయానికి ఈశాన్యంలో 16 స్తంభాల యాగశాల వుంది. ప్రతిపూర్ణిమ నాడు దసరా ఉత్సవాలు, నిత్య చండీ యాగం ఈ యాగశాలలోనే జరుగుతాయి. మల్లికార్జున ఆలయానికి నైరుతిలో సాల మండపాలలో మెట్లు కనిపిస్తాయి. మెట్లపై భాగాన నటరాజమూర్తి వున్నాడు. మెట్లపైకి వెళ్తే నాగావళితోట, అందులో నిత్య కల్యాణ మండపం వున్నాయి. ఆర్జిత నిత్య కల్యాణాలు ఇక్కడే జరుగుతాయి. కల్యాణ మండపానికి చుట్టూ వున్న నాగావళితోటలో శివభక్తురాలు "చంద్రావతి" మల్లికార్జున స్వామికి మల్లెమాల వేస్తున్న దృశ్యం, ఛత్రపతి శివాజీ మహారాజుకు భ్రమరాంబాదేవి ఖడ్గాన్ని ప్రసాదించే దృశ్యం నయన మనోహరం. అసలు అర్జున చెట్లకు అంటే తెల్లదిరిసెన చెట్టుకు మల్లెతీగలు అల్లుకొని మల్లికార్జునస్వామి లింగంపైన అభిషేకంగా పడేవట. అందుకే స్వామికి "మల్లిక అర్జునుడు అంటే మల్లికార్జునుడు" అనే పేరు వచ్చింది. కల్యాణ మండపం మెట్ల కిరువైపులా హరిహరమూర్తి, అర్ధనారీశ్వరులు శిల్పాలున్నాయి.

శ్రీ అన్నపూర్ణ స్వామి వారి ఆలయానికి ఈశాన్యంలో అన్నపూర్ణాదేవి మందిరం వుంది. అక్కడ స్వామివారికి నివేదనలు, భోగాలు తయారు చేస్తారు. అన్నదానం ఇక్కడే జరుగుతుంది. ఇప్పటివరకు ఆలయాల లోపలి విశేషాలు చూసి తెలుసుకున్నాం. ఇప్పుడు

ప్రాకారం బయట వున్న విశేషాలు చూద్దాం.

శంకర మఠం – ఆరామ వీరేశ్వరం – గంగాధర మండపం – శారదా మఠం – నందుల మఠం రథవీథిలో ఎడమవైపు శ్రీ కంచి కామకోటి వారి శంకరమఠం వుంది. ఒకప్పుడు ఇక్కడ వారి వేద పాఠశాల వుండేది. సాల మండపాలకు ఎడమవైపు దారిలో వెళితే వీరభద్రస్వామి ఆలయం అంటే ఆరామ వీరేశ్వరాలయం వుంది. శ్రీనాథుడు ఈ దేవుణ్ణి విపరీతంగా వర్ణించాడు. మెయిన్ గేటు వద్ద గంగాధర విగ్రహం, శివుని శిరస్సు నుండి, గంగ వెలువడే దృశ్యం ఇది. దీని దగ్గర శృంగేరి శారదా మఠం వారి శారదాదేవి విగ్రహం, ఆది శంకరుల పాలరాతి విగ్రహాలు ముగ్ధమోహనం, వాయువ్యాన "నందుల మఠం" వుంది. గుహలతో చూడ ముచ్చటగా వుంది. మల్లమ్మ కన్నీరు – గిరిజా శంకర – వరాహ తీర్థం – పశుపతినాథ లింగం, గోగర్భం, నందుల మఠంను ఆనుకొనే మల్లమ్మ ఆవుల దొడ్డి, ఆమె విగ్రహం వున్నాయి. విగ్రహం దగ్గర చిన్న గుండం నుండి నిరంతరం ప్రవహిస్తుంది. దీన్నే "మల్లమ్మ కన్నీరు" అంటారు భక్తులు. స్కంద పురాణంలో దీన్ని "బిందుతీర్థం" అన్నారు. బిందు తీర్థానికి దగ్గరలో మహాభక్తురాలు మల్లమ్మ పూజించిన గిరిజాశంకర ఆలయం వుంది. దీనికి ఎదురుగా వరాహతీర్థం వుంది. తాగటానికి యోగ్యమైన నీరుండటం వల్ల స్కందపురాణంలో దీన్ని వరాహ కుండం అన్నారు. దీనికి ఎదురు పశుపతి లింగం, దానికి నాలుగు వైపులా నాలుగు ముఖాలు వుండటంతో దీన్ని "పంచ ముఖ లింగం" అంటారు. దీనికి దగ్గరలో చెవి ఆకారంలో వున్న తీర్థాన్ని గోకర్ణ తీర్థం అంటారు. గోకర్ణ ఋషి ఇక్కడ తపస్సు చేసినట్లు చెబుతారు. ఆలయానికి ఆగ్నేయంలో "బయలు వీరభద్రుడు" వున్నాడు. ఈ క్షేత్రాన్ని కావలికాస్తాడు. కనుక "కావలి వీరభద్రుడు" అని అంటారు. ఈ మండపానికి పైకప్పు ఉండదు. కారణం ఎండా, వాన అని చూడకుండా క్షేత్రపాలకుడిగా అనుక్షణం కాపలా కాయాలి కనుక.

శివాజీ మహారాజు ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించి కొంతకాలం వున్నాడు. ఆలయానికి ఉత్తరాన శివాజీ ద్వారానికి ఎదురుగా పూర్వం శివాజీ నివశించిన భవనం వుండేది. దీన్నే శివాజీ ధ్యాన మందిరంగా భావించేవారు. ఇది శిథిలం అయ్యింది. ఇప్పుడు చాలా ఖర్చుపెట్టి స్ఫూర్తి మందిరం, అందులో ఎత్తైన శివాజీ విగ్రహం నిర్మిస్తున్నారు. దీనికి ఉత్తరాన చంద్రకుండం వుంది. దీన్ని ఇప్పుడు పూడ్చివేశారు. ఇక్కడే పెద్ద గుహ ఉండేదట. ఎక్కడికి దారి తీసేదో తెలీదు అని పెద్దలు చెబుతారు. దీన్ని గురించి స్కాంద పురాణంలో వివరంగా వుంది. ✦

విదురనీతిసారం (20)

- మొవ్వ వృషాద్రిపతి, రేపల్లె.

క్షమియించువారిఁగని చా
లమి వెట్టుదురైననుం దలంప ననూన
క్షమయ కడుమెరయు తొడ వు
త్తమరూపము గోరువారు దాల్తురు దానిన్. 13

అన్నా! లోకంలో శ్రేష్ఠులైనవారుంటారు. మెత్తనిమనస్సుతో తమ కెవ్వరో ద్రోహం చేసినా వారు ప్రతీకారం చెయ్యాలని భావించరు. పోనీ! ఎవడు చేసిన కర్మ వాడే అనుభవిస్తాడని క్షమించి విడిచిపెడతారు. పరులను పెల్లెత్తిమాట కూడా అనరు. వారు సత్త్వగుణ సంపన్నులు - ఉత్తములు. వారు ఒకవేళ ప్రతీకారం తీర్చుకోవాలనుకొంటే సర్వవిధాలా సమర్థులై ఉంటారు. కాని పూనుకోరు. అటువంటి క్షమాగుణసంపన్నులను లోకం అసమర్థులుగా భావిస్తుంది. "ఏమీ చెయ్యలేక శక్తి చాలక ఊరుకొన్నాడు గాని చేతనైతే ఊరుకుంటాడా?" అని హేళనగా మాట్లాడుతుంది. అట్టివారిని పనికిమాలినవారనే ముద్రతో సత్కరిస్తుంది. మానవునకు క్షమయే భూషణం. ఓర్పును మించిన భూషణం మరియొకటి లేదు.

సీతాదేవిని రాక్షస స్త్రీ లెన్నివిధాలుగానో బాధించారు. నిందించారు. భయపెట్టారు. రావణవధానంతర మాంజనేయస్వామి ఆ రాక్షసాంగనలందరినీ వధిస్తానన్నాడు. అపుడు సీతాసాధ్వీశిరోమణి

"పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ!
కార్యం కరుణమార్యేణ - న కశ్చిన్నాపరాధ్యతి ॥

హనుమా! వారు పాపాలే చేశారో? పుణ్యాలే చేశారో? వారు చంపదగినవారే కావచ్చు. కాని సజ్జనులు వారియందు దయనే ప్రదర్శిస్తారు. లోకంలో తప్పుచేయనివాడు లేడు" అంటుంది. ఇదే ఓర్పు. ఇక్కడ సీతాదేవికి శక్తిలేక కాదు వారిని చంపండి. అందుకే అపకారం చేసినవానికి, ఆ దోషాన్ని భావించకుండా ఉపకారం చేసినవాడే ఉత్తముడని సుభాషితం. కావున ఉత్తమోత్తములైనవారు ఓర్పునే భూషణంగా ధరిస్తారు.

పురుషుండు రెండు దెఱఁగుల
ధరనుత్తముఁడనఁగఁ బరఁగుఁ దానెయ్యెడలం

బరుసములు వలుకకునికిన్
దురితంబులు నొరయుపనులు దొలఁగుటకతనన్. 14

ప్రభూ! లోకంలో ప్రతివ్యక్తి మంచివాడిననిపించుకోవాలనే అనుకొంటాడు. కాని మనస్సు వాడినలా ప్రవర్తించనీయదు. మానవుడు ఉత్తముడనిపించుకోవటానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి ఎటువంటి పరిస్థితిలోను ఇతరులనుగురించి పరుషవాక్యాలు పలుకకుండా ఉండటం. రెండు – పాపకార్యాల జోలికి పోకుండా ఉండటం. కొంతమంది ఎదుటివారు బాధపడేటట్లు కఠినంగా మాట్లాడతారు.

"సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ – న బ్రూయాత్ సత్యమప్రియమ్"

సత్యాన్నే చెప్పు. ఆ చెప్పేసత్యాన్ని ప్రియంగా అందరూ ఆదరించే మార్గంలో మృదువుగా చెప్పు. సత్యం కదా అని కటువుగా చెప్పకు. మృదువుగా చెబితే ఇతరులు వింటారు. కఠినంగా చెబితే ఎవరూ వినరు.

కాకి మననెప్పుడూ తిట్టలేదు. కోకిల మనకేమీ పైసా సొమ్మీయనూలేదు. కాని అరుస్తుంటే దాని నవతలకు త్రోలతారు. కోకిల కూస్తే తాము కూసి, మరల మరల దానితో కూయించి ఆనందిస్తారు. ఎందుకని? పరుషభాషణునికి లోకమంతా శత్రువులే. మృదు భాషణునికి లోకమంతా బంధువులే. ఒకవ్యక్తి మరియొకనిని "అయ్యా! ఈ ఊరు మంచిదేనా?" అని అడిగాడట. అందుల కా ఎదుటి వ్యక్తి "నీ నోరు మంచిదేనా?" అని ఎదురు ప్రశ్న వేశాడు. నీ నోరు మంచిదైతే ఊరూ మంచిదే.

ఒక పెద్దాయన ఇంకొక పెద్దాయన ఇంటికి వచ్చాడు. ఆయన కుమార్తె అరుగుమీద కూర్చునివుంది. ఈ వచ్చినాయన "ఏయ్ పిల్లా! ఇంట్లో నీయమ్మా మొగుడుగారున్నారా?" అని ప్రశ్నించాడు. ఆ అమ్మాయి ఆగ్రహోదగ్రురాలై చీపురు తిరగవేసింది. ఇంతలో ఇంకొకాయన వచ్చాడు. "అమ్మా! మీ నాన్నగారింట్లో వున్నారా?" అని అడిగాడు. వెంటనే ఆ అమ్మాయి వినయంతో "రండి. కూర్చోండి. నాన్నగారిని పిలుస్తా!" నని ఆసనం చూపించింది. ఒక్క విషయం గమనించండి. అమ్మ మగడు కానిదే నాన్నకాడు. కాని మొదటి ప్రశ్నలో పారుష్యం – కాఠిన్యం ఉన్నాయి. రెండవదానిలో మృదుత్వం – గౌరవం ఉన్నాయి. పరుషమైన పలుకు విషంకన్నా, పిడుగు కన్నా దారుణమైంది. పలుకుతోనే యుద్ధాలు సృజింపబడతాయి. ప్రలయం సిద్ధిస్తుంది. అదే మాటలతో అనంతస్వర్గసుఖం లభిస్తుంది. మనశ్శాంతి – సంతోషం కలిగి సమాజానికే మేలు చేకూరుతుంది.

లోకంలో ఈ విషయంలో చాలా సంస్కరణ కావాలి. అతడి పేరు రామయ్య –

'ఒరే రాంగా!' పేరు సుబ్బయ్య 'ఓరే సుబ్బిగా!' ఆమె పేరు లచ్చుమమ్మ 'ఒసేలచ్చా!' పేరమ్మను – 'ఒసేపేరా!' అని పిలుస్తుంటారు. అలాగే ఏదో లోపం ఉన్నవానిని, హేళనగా 'ఒరే కుంటాడా?' 'ఏందే ముండా!' ఇత్యాదిగా పిలవడం కద్దు. వారు అశక్తతతో ఏమీ చెయ్యలేకపోయినా వాళ్ళ హృదయాలు ఎంత తల్లడిల్లతాయో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వాళ్ళకే అవకాశం వస్తే తిరుగబడి ఎంతమాట అనటానికైనా వెనుతీయరు. పలుకు ప్రళయ సదృశంగా ఉన్నవ్యక్తి ఎన్ని మంచి పనులు చేసినా అవి రాణించవు.

పాపకార్యాలకు దిగకుండా ఉండేవాడు ఉత్తముడు. కొంత మందికి స్వార్థమే పరమార్థంగా వుంటుంది. ఎంతమంది నోళ్ళు కొట్టటానికైనా, ఎన్ని కొంపలు కూల్చటానికైనా వెనుకాడరు. 'పాపాయ పరపీడనం' అని. ఇతరులకు మేలు కలిగించే పని పుణ్యకార్యం. బాధ కలిగించేపని పాపకార్యం. కొందరు కొన్ని కలహాలలో మధ్యవర్తిత్వం వహిస్తారు. రెండువైపులనుండి అందినంత దండుకొంటారు. గ్రామాలను చీలుస్తారు. హత్యలు మానభంగాలు ప్రోత్సహిస్తారు. ప్రస్తుతానికి తా మభ్యుదయం పొందుతున్నట్లు భావించి విఱ్ఱవీగుతారు. కాని నిదానంగా వారివల్ల ఈ సమాజానికి తుదకు వారికి కూడా నష్టం వాటిల్లుతుంది.

ధృతరాష్ట్ర మహారాజా! లోకంలో ఉత్తముడుగా ఉండాలంటే అందరితోను మృదుమధురంగా మాట్లాడుతూ పాపకార్యాలు విడిచి పరప్రయోజనకార్యా లాచరించాలి. ఆతడే యశస్వంతుడౌతాడు. ✦ .... (సశేషం)

విజ్ఞాన వీచిక

తారాశశాంకం

– డా॥ చింతలపూడి వెంకటేశ్వర్లు

బ్రహ్మ పదిమంది మానసపుత్రులలో అంగిరుడు ఆరోవాడు. కర్దమ ప్రజాపతి తొమ్మిదిమంది కూతుళ్ళలో ఒకరైన శ్రద్ధను అంగిరుడు పెళ్ళిచేసుకున్నాడు. ముగ్గురు కొడుకుల్ని కన్నాడు. వారు ఉతత్థ్యుడు, బృహస్పతి, సంవర్తుడు. కాబట్టి బృహస్పతి బ్రాహ్మణుడు, అంగిరుని వారసుడు.

ఇతడి పుట్టుకకు వింత కథ ఒకటుంది. అంగిరుని భార్య శ్రద్ధ భర్తకు అనుకూలవతి కాదు. గర్భవతిగా ఉండగా భర్తకు దూరమై ఒక మృతశిశువుకు జన్మనిస్తుంది. తరువాత తప్పు తెలుసుకొని తిరిగి అంగిరుని పంచకు చేరుకుంటుంది. అప్పుడు అంగిరుడే ఆ మృతశిశువుకు ప్రాణం పోస్తాడు. అతడే బృహస్పతి.

బృహస్పతికి ఇద్దరు భార్యలు. శుభ, తార. శుభకు ఏడుగురు కూతుళ్ళు. వారు భానుమతి, రాకా, అర్చిష్మతి, మహామతి, మహిష్మతి, సినీవాలి, హవిష్మతి. తారకు ఏడుగురు కొడుకులు, ఒక కూతురు. ఉతథ్యుని భార్య మమత. అయితే బృహస్పతికి మమత ద్వారా ఇద్దరు పిల్లలున్నారు. వారు కచుడు, భరద్వాజుడు. బృహస్పతి మమతను చేరేనాటికే ఆమె గర్భవతి. తొలిసారిగా కలవబోతుంటే గర్భస్థశిశువు అడ్డుకున్నాడు. అందుకు బృహస్పతి కోపించి ఆ శిశువును పూర్తి చీకటితో పుట్టమన్నాడు. అందుకే ఆ పుట్టినవాడు గుడ్డివాడయ్యాడు. అతని పేరు దీర్ఘతముడు. తరువాత పుట్టిన శిశువును కూడా ఒంటిగా వదిలేసి మమతాబృహస్పతులు అక్కడనుంచి వెళ్ళిపోతారు. మరుత్తులు పసిబాలుని చేరదీసి భరద్వాజుడని పేరు పెడతారు. పెద్దయ్యాక దుష్యంత మహారాజు అతణ్ణి దత్తత చేసుకుంటాడు.

బృహస్పతి ప్రభాస తీర్థంలో తపస్సుచేసి దేవగురుత్వం పొందుతాడు. శివుడు ప్రత్యక్షమై అతనికి నవగ్రహాలలో ఒకడిగా స్థానం కల్పిస్తాడు. జ్యోతిష శాస్త్రంలో గురుగ్రహం ఈ బృహస్పతే! అన్ని గ్రహాలకంటే పెద్దవాడు. ధను, మీన రాసుల్ని పాలిస్తుంటాడు. కర్కాటకరాసి తోసివేస్తే మకరరాసిలో పడిపోతాడు. సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు గురునికి మిత్రగ్రహాలు. బుధుడు, శుక్రుడు శత్రుగ్రహాలు. శని సమగ్రహం. బృహస్పతి పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర అనే త్రిపాద నక్షత్రాలకు ప్రభువు. ఇతని రంగు పసుపు. పసుపు పదార్థాలు కాని, వస్తువులు కాని ఇతనికి ఇష్టమైనవి. ఇష్టమైన కాలం చలికాలం. ఇష్టమైన దిశ ఈశాన్యం. మూలభూతం ఆకాశం.

వైదిక ఖగోళంలో గురుడిది ఆకాశతత్త్వంగా పేర్కొంటారు. దీన్నిబట్టి ఇతని

ప్రభావంలోని మనిషి విశాలభావాలతో ఉంటారు. గతకర్మకు, మతధర్మాలకు, తాత్త్వికతకు, విజ్ఞానానికి, సంతాన విషయాలకు సమతూకం పాటిస్తారు. విద్యకు, బోధనకు, జ్ఞాన వితరణకు సంబంధం ఉంటుంది. గురుని ప్రభావం ఎక్కువగా గల జాతకులు జీవితంలో అన్నివిధాలా అభివృద్ధి పథంలో పయనిస్తారు. మధుమేహం వీరిని పీడిస్తుంది. అందుకు వీరు గురుగ్రహానికి శాంతి చేయాల్సి ఉంటుంది.

గురుడికి అన్న భార్యతో సంబంధం ఉన్నట్లే, గురుడి భార్యతో అతని శిష్యుడికి సంబంధం ఉన్నట్లు ఒక కథ ఉంది. ఆ శిష్యుడు చంద్రుడు. గురుడి భార్య తార చంద్రుడి అందం చూచి మోహిస్తుంది. భర్తలేని సమయం చూచి చంద్రుణ్ణి కవ్విస్తుంది. ఆ విధంగా గర్భవతికూడా అవుతుంది. చంద్రుడు ఈ విషయం గురువుకు తెలిస్తే గొడవ అవుతుందని తారను తనతో తీసుకెళతాడు. వారికి బుధుడు పుడతాడు. తరువాత గురుడు ఇంటికి వచ్చి చూస్తే తార కనిపించలేదు. జరిగిన విషయం తెలుసుకొని చంద్రుడి మీదకు యుద్ధానికి వెళతాడు. చివరికి బ్రహ్మ ఆ తగువును తీరుస్తాడు. తార వాఙ్మూలం ప్రకారం ఆమెను గురుడికి, ఆమె కొడుకు బుధుడిని చంద్రుడికి అప్పగిస్తారు. ఈ కథ తారాశశాంకంగా జగత్ప్రసిద్ధమైనదే! దీనిమీద మన దేశంలో ఒక ప్రసిద్ధ రాజవంశమే తయారైంది. ఈ చంద్రుడి కొడుకు బుధుడికి ఇలకు పెళ్ళవుతుంది. పురూరవుడు పుడతాడు. పురూరవునితో చంద్రవంశం ప్రారంభమవుతుంది. ఆ వంశం అలా అలా సాగుతూ పాండవులూ కౌరవులు పుట్టడం, తగువులాడుకోవడం, చివరికి పెద్ద యుద్ధం జరగడం, మహాభారతగాథ మనందరకూ తెలిసినదే.

అయితే ఈ కథలు చాలా అల్పంగానూ, అసహజంగానూ కనిపిస్తాయి. ఇంత గొప్ప వంశానికి మూలగాథ ఇటువంటి అసహ్యమైనదా అనిపిస్తుంది. దేవతలంటే మానవులకు ఆరాధ్యులు. ఇటువంటి దేవతల కథలు విని మానవులు ఏమి నేర్చుకోవాలి? ఒకనాడు నాగరితగా దీనిని సరిపెట్టుకోవాలా! అన్ని నాగరికతలూ మొదట్లో ఇంతేలే, ఆదిమమానవులకు నాగరికతేమిటి అనుకొని వదిలేయాలా?

పౌరాణిక కథలకు కనీసం మూడు అర్థాలు ఉంటాయంటారు మన పూర్వ పండితులు. మనం బయటకు కనిపించే మామూలు అర్థంతోనే ఉండిపోకూడదు. అంతరార్థం ఒకటి ఉంటుందని వెతకాలి. ప్రతి పదానికీ అభిధ, లక్షణ, వ్యంజన అని మూడు అర్థాలు ఉంటాయి. మొదటిది ఆ శబ్దానికి ఉన్న అసలు అర్థం. రెండవది లోకంలో ఆ పదానికి స్థిరపడిపోయిన అర్థం. ఇక్కడ ఈ కథల్ని లక్షణార్థంలోనే అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు కుశల పదం ఉంది. శాబ్దికార్థం అయితే జాగ్రత్తగా, సున్నితంగా, చేతులు తెగకుండా దర్భలు తెంపువాడు అని అర్థం. మరి యిప్పుడు సామాన్యజనానికి ఆ అర్థం ఉందనే తెలియదు. కుశలుడు అంటే ఒక విద్యలో ఆరితేరినవాడు అనే తెలుస్తుంది.

అదేవిధంగా ఈ కథలకు మనకు తెలిసిన అర్థానికి, లోన దాగున్న అర్థానికి చాలా తేడా ఉంటుంది. అందుకే వీటిని 'లోనారసి' అర్థం చేసుకోవాలి. ఇక్కడ గురుడు, చంద్రుడు, తార, బుధుడు నలుగురూ ఖగోళానికి చెందినవారే కాబట్టి, దీని వెనుక ఏదో ఖగోళరహస్యం దాగి ఉంటుంది.

జ్యోతిషశాస్త్రరీత్యా బృహస్పతి విజ్ఞానానికి, విద్యకు, బోధనకు, విశాల భావాలకు కారకుడు. చంద్రుడు మనస్సుకు, ఆలోచనలకు, ప్రవర్తనకు కారకుడు. బుధుడు వ్యాపారానికి, గోపాలనకు, వ్యాపకాలకు కారకుడు. వీరు ముగ్గురుకి వెనక నక్షత్ర బలం ఉంటూనే ఉంటుంది. ఖగోళంలో సాపేక్షంగా నక్షత్రాలను చూస్తే గ్రహాలకంటే స్థిరాలు, స్వయంప్రకాశకాలు. చంద్రుడి నడక ఒకరోజు మాత్రమే. అంటే ఇరవై నాలుగు గంటలు గడచేసరికి చంద్రుడు ఒక నక్షత్రం నుంచి మరొక నక్షత్రానికి మారతాడు. గురుడి నడక ఒక సంవత్సరం. ఒక నక్షత్రాన్ని విడిచి మరొక నక్షత్రం దగ్గరికి రావాలంటే సంవత్సరం పడుతుంది. అలాగే బుధుడి నడక ఒక నెల. అంటే నెలకో నక్షత్రం మారతాడన్నమాట. వీరందరూ నక్షత్రాలను ఆధారం చేసుకొనే తిరుగుతుంటారు. అంటే వీరి వెనక నక్షత్రాల బలం కూడా మారుతూనే ఉంటుంది. చెప్పొచ్చేదేమంటే విద్యాబోధనకు కారకుడైన గురుడికి, మనస్సులోని ఆలోచనలకు కారకుడైన చంద్రుడికి గురుశిష్య సంబంధం ఆరోపింపబడింది. బోధన సక్రమంగా ఉంటేనేకదా మనస్సు మాట వినేది! మనస్సు క్రోతివంటిది అంటారు కదా! ఆ మనస్సును అదుపులో ఉంచేది గురువేకదా! ఈ గురు శిష్యులు సక్రమంగా ఉంటేనే కదా మనిషి వ్యాపారం అంటే సమాజంలో జీవనగమనం బాగుంటుంది. ఆ వ్యాపార కారకుడు బుధుడు. అంటే నియంత్రితమైన మనస్సుకు సత్ప్రవర్తన లేక సద్వ్యాపారం ఉద్భవిస్తుంది. చంద్రుడి కొడుకు బుధుడు అంటే ఇదే రహస్యం.

ఇక చంద్రవంశం. బుధుని వ్యాపారానికి, లేక వ్యవసాయానికి, లేక వ్యాపకాలకు మూలం భూమి. ఇల అంటే భూమి. భూమిపై వ్యాపారాలు, వ్యవసాయాలు జరుగుతున్నాయి కాబట్టి భూమికి, బుధుడికి భార్యాభర్తల సంబంధం కలిపారు. అప్పుడు మానవ సమాజాభివృద్ధి జరిగి, పాలన ఆరంభమై ఉంటుంది. రాజవంశాల గురించి తెలిపేటప్పుడు మనకు అందిన సమాచారం మేరకు చెప్పి, అందనిదాన్ని కల్పించడం కథకుడి ధర్మం. ఆ విధంగానే పురూరవుని ముందు చక్రవర్తులెవరూ గుర్తుకురాక, ఏదో ఒక మూలం చూపెట్టాలి కాబట్టి యిలా చేసి ఉంటారు. ఎలాగూ చెప్తున్నారు కాబట్టి అందులో కాస్త జ్యోతిషం జోడించారు. బుధుడి తండ్రిగా చంద్రుని ఎలాగూ ఆవిష్కరించారు కాబట్టి అది చంద్రవంశం అయింది. ఆ విధంగా చంద్రవంశం ఏర్పడి ఉంటుంది. అదీ విషయం. ✦

బాలల భాగవతకథలు

డా|| కె. ప్రభాకర్ రెడ్డి, ప్రొద్దుటూరు.

శుకబ్రహ్మ



బ్రహ్మ ఆదేశం ప్రకారం వశిష్ఠుని మనుమడైన పరాశరునికి సత్యవతి యందు కృష్ణద్వైపాయనుడనే పుత్రుడు పుట్టి వ్యాసుడైనాడు. ఆయన బ్రహ్మచారిగానే ఉంటూ సంతానం కోరి మేరునగంపైన శివుని గూర్చి తపస్సు చేశాడు. పరమశివుడు ప్రత్యక్షంకాగా, పృథివి, జలము, వాయువు, అగ్ని, ఆకాశాలకు ధీటైన తేజోవంతుని పుత్రునిగా ప్రసాదించమని వరమడిగాడు. ఈశ్వరుడు అనుగ్రహించాడు. ఒకనాడు వ్యాసుడు అరణి కట్టెలను మధించి హోమాగ్నిని కల్పించే ప్రయత్నంలో ఉండగా ఘృతాచి అనే అప్సరస విలాసంగా విహరిస్తూ అటు వచ్చింది. వ్యాసునికి ఆ సౌందర్యరాశిని చూడగానే తనలో అణగారి ఉన్న కోరికలు ఉవ్వెత్తున కెరటాలై విజృంభించాయి. ఈ ముని కామవాంఛను తెలుసుకున్న ఘృతాచి ఆ చూపులకు భయపడి చిలుకగా మారి అక్కడే సంచరిస్తూ ఉన్నది. అరణి మథిస్తున్న వ్యాసునికి రేతఃపతనమై అరణికట్టెలపైన పడి పంచభూతాల తేజంతో వెలిగిపోతున్న బాలునిగా రూపొందింది. వ్యాసుడు మోహదృష్టితో శుకాన్ని చూస్తుండగా జన్మించడం వల్ల ఆ బాలునికి కొంత శుక (చిలుక) రూపం వచ్చింది. ఇలా పుట్టిన శుకునికి అంతరిక్షం నుండే దండ కమండలాలు ప్రాప్తించాయి. ఇతడు తండ్రివద్దనే వేదవేదాంగాలు అభ్యసించి ముక్తిమార్గాన్ని కూడా బోధించమని కోరాడు. అప్పుడతన్ని వేదవ్యాసుడు జనకమహర్షి దగ్గరికి పోయి నేర్చుకొమ్మన్నాడు. అందువల్ల శుకుడు హిమాలయ పర్వతాలను దాటి భరతవర్షానికి వచ్చి జనకుని నగరం చేరాడు. శుకుడు ఏ పదార్థాన్ని చూసినా చూడనివానివలెనే ఉండేవాడు. అతని ప్రవర్తన ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించగా ప్రతీహారులు ఇతని రాకను గురించి జనక మహారాజుకు తెలియజేశారు. జనకుడు ఇతనిని రావించి మిక్కిలి గౌరవించాడు. ఆలా శుకుడు జనకుని దగ్గర కొంత విద్య నేర్చుకొన్నాడు. తప్పక సంసారం చేయాల్సిందే అని జనకుడు బోధించటం వల్ల పుట్టగానే చావును కోరుకున్న శుకుడు విభ్రాజులనే దేవతల పుత్రికయైన **పీవరి** అనే ఆమెను వివాహం చేసుకున్నాడు. ఆమె యందు ఇతనికి కృష్ణుడు, గౌరప్రభుడు, భూరి, దేవశ్రవుడు అనే నలుగురు కుమారులు, కీర్తి, కృత్య అనే ఇరువురు కుమార్తెలు కలిగారు.

శుకుడు ఏ స్థలంలోనూ గోదోహన కాలం (ఆవును పాలు పితికే కాలం) – అంటే పన్నెండు నిమిషాలకంటే ఎక్కువసేపు నిలువడు. కానీ ఎవ్వరైనా ఏదైనా ప్రశ్న

అడిగితే వారికి జవాబు చెప్పికానీ వెళ్ళడు. అలా ప్రయోపవిష్టుడైన పరీక్షిత్తుకు ఏడుదినాలు భాగవతం చెప్పాడు. అది పరీక్షిత్తు అదృష్టం. శుకుడొకరోజు తండ్రితో వేదాధ్యయనం చేస్తుండగా మహావాయువు వీయడం ఆరంభించింది. అది అధ్యయనానికి సమయం కాదని వ్యాసుడు స్నానం చేయటానికి వెళ్ళాడు. ఆ సమయంలో నారదుడు వచ్చి శుకునికి తత్త్వబోధ చేశాడు. శుడుకు ముక్తసంగుడై కైలాసానికి పోనెంచి ఆకాశానికెగశాడు. ఇతడు మృగాలను, పక్షులను, వృక్షాలను, శిలలను, నదులను చూచి "మా తండ్రి వ్యాసమహర్షులవారు నాకోసం వెదుకుతూ నన్ను పిలుస్తాడు. అప్పుడు మీరంతా 'ఓ' అని పలకండి!" అని చెప్పాడు.

శుకుడు సంతానాన్నే కాక అన్నపానాలనూ, చివరికి కట్టు బట్టలను కూడా పట్టించుకోకుండా నిర్వికారుడై అడవుల్లో సంన్యాసిలా, పిచ్చివాడిలా తిరిగేవాడు. ఒకనాడు ఇతడు సిద్ధసేవ్యమైన పట్టణంలో ఒక ప్రదేశంలో వెళ్తుండగా అక్కడ దివ్యాంగనలు దిగంబరులై జలక్రీడలాడుతున్నారు. వాళ్ళంతా శుకుని చూసికూడా అలాగే స్నానం చేస్తుండిపోయారు. శుకుడు కూడా వాళ్ళను చూసీ చూడకుండా ముందుకు సాగిపోయాడు. శుకుని వెదుక్కొంటూ వ్యాసుడాదరికి వచ్చాడు. వ్యాసుని చూడగానే ఆ స్త్రీలు తత్తరపాటుతో వస్త్రాలు చుట్టబెట్టుకున్నారు. వ్యాసుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. వయోవృద్ధుడైన తనను చూసి సిగ్గు పడిన దేవాంగనలు యువకుడైన శుకుని చూసి సిగ్గు పడకపోవటమెందుకో ఆయన ఊహకు అందలేదు. "శుకుడు నిర్వికారుడు, నిశ్చల తపోధనుడు, పరమార్థం తెలిసినవాడు. పసిబిడ్డ మనస్తత్వం కలవాడు. ఆయన కళ్ళు అన్నీ చూస్తాయి కానీ దేన్నీ చూడవు. చెట్టూ, చేమా, జింకా, ఆడపిల్లా అన్నీ ఒకటే! అందుకే మేము దిగంబరులమైనా బెదరలేదు. పడుచువాడైనా ఆయనకు బాహ్యస్పృహ లేదు. ఇటు వచ్చిన మీరు ముఖం అటు తిప్పుకొని మాతో మాట్లాడుతున్నారు. మీ కుమారునికి ఆడా, మగా అన్న స్పృహే లేదు. మీకది ఉంది" అన్నారా దేవకన్యలు. ఇది విని వ్యాసుడు నివ్వెరపడి తలదించుకున్నాడు.

ఆ పరమాత్ముడు ముక్తిని కటాక్షించే వరకు శుకుడు సుఖ సంతోషాలతో జీవించాలనే ఉద్దేశ్యంతో అతనిని భాగవతాన్ని బోధించి ప్రచారం చేయమన్నాడు వ్యాసుడు. నాటి నుండి శుకుడు విద్య ద్వారా, సంసార సుఖాల ద్వారా పొందలేని పరమానందాన్ని హరినామ స్మరణద్వారా పొందాడు. కొంతకాలమైనాక శుకుడు తన మూలమైన పంచభూతాత్మకమైన ప్రకృతిలో కలిసిపోయాడు. వ్యాసుడు "శుకా!" అని పిలిచినప్పుడల్లా వృక్షాలు, నదులు, గిరులు "ఓ!" అని ప్రత్యుత్తరమిస్తాయి. ✦

ఓం హ్రీం ఓం

శ్రీవేదాన్తదేశిక విరచిత

శ్రీ సుదర్శనాష్టకమ్

వ్యాఖ్యాత - శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు, హైదరాబాద్

శ్లో॥ మహితసంవత్సదక్షర! విహితసంపత్షడక్షర!
షడరచక్రప్రతిష్ఠిత! సకలతత్త్వప్రతిష్ఠిత! ।
వివిధసంకల్పకల్పక! విబుధసంకల్పకల్పక!
జయ జయ శ్రీసుదర్శన! జయ జయ శ్రీ సుదర్శన! ॥ 7

అర్థం : మహితసంపత్ సదక్షర! – మహిత = గొప్ప, సంపత్ = జ్ఞానమనే ఐశ్వర్యంచేత, సత్ = సత్పురుషులకు, అక్షర = మోక్షరూపమైన వాడా!; విహిత సంపత్ షడక్షర! – విహిత = అనుగ్రహింపబడిన, సంపత్ = సంపత్తుగల, షట్+అక్షర = ఆఱు అక్షరాలు గల మంత్రం కలవాడా!; షడరచక్ర ప్రతిష్ఠిత – షట్ + అర = ఆఱు కోణాలను కల్గిన, చక్ర = చక్రమందు, ప్రతిష్ఠిత = అధిష్టించియున్న వాడా!; సకల తత్త్వ ప్రతిష్ఠిత! – సకల = సమస్త, తత్త్వ = భావాలయందు, ప్రతిష్ఠిత = ఉన్నవాడా!; వివిధ సంకల్ప కల్పక! – వివిధ = రకరకాలైన, సంకల్ప = కోరికలకు, కల్పక = కల్పతరువు లాంటి వాడా!; విబుధ సంకల్ప కల్పక! – విబుధ = దేవతల యొక్క, సంకల్ప = కోరికలను, కల్పక = తీర్చువాడా!, శ్రీసుదర్శన! జయ జయ!, శ్రీసుదర్శన! జయ జయ!

తాత్పర్యము : గొప్ప జ్ఞాన ధనం గల బ్రహ్మవేత్తలకు మోక్షరూపమైనవాడా! సంపత్తు ననుగ్రహించే ఆఱు అక్షరాల మంత్రంచేత ఉపాసింపబడే వాడా! షట్కోణాలు గల చక్రమందు ఉన్నవాడా! సకల తత్త్వాల యందు వ్యాపించి యున్నవాడా! కోరికలన్నీ తీర్చువాడా! దేవతలకు అభీష్టప్రదుడా! ఓ శ్రీ సుదర్శన! జయ, జయ! హే శ్రీ సుదర్శన! జయ, జయ!!

జ్వాలా వ్యాఖ్య : సకల ఫలదాతయని వర్ణితం.

1. మహిత సంపత్ సదక్షరుడు : గొప్ప సంపత్తు అంటే బ్రహ్మజ్ఞానమన్న మాట. **"సన్తమేనంతతో విదుః"** బ్రహ్మవేత్తకే 'సత్' శబ్దం వర్తిస్తుంది. **"అక్షరం తు మోక్షేఽపి"** (అమరం) అట్టి సచ్ఛబ్దవాచ్యులకే మోక్షమిచ్చువాడా! అని అర్థం.

2. విహిత సంపత్ షడక్షరుడు : సుదర్శన మంత్రం ఆఱు అక్షరాలు కలది. **"ఓమ్ నమశ్చక్రాయ"** అనే ఈ మంత్రంలోని ఒక్కొక్క అక్షరం ఐశ్వర్యాన్ని సంపాదించి పెడుతుందని అర్థం.

3. షడర చక్ర ప్రతిష్ఠితుడు : అరలు అంటే కోణాలు. ఆఱు కోణాలు చక్ర మందు ఉంటాయి. కాబట్టి షడరచక్రమందు సుదర్శనుడు ఉంటాడు.

4. సకల తత్త్వ ప్రతిష్ఠితుడు : సమస్త వస్తువులందు అంతర్యామి రూపంలో శోభిస్తుంటాడు. మనస్సు చక్రమే కదా! అచట తద్ధర్మంగా భాసించి యుంటాడు. **"యః పృథివ్యాం తిష్ఠన్" – "య ఆత్మని తిష్ఠన్"** – ఇత్యాది బృహదారణ్యకోపనిషత్ సూక్తులు 'భగవానుడు సర్వాంతర్యామి' అని ప్రతిపాదిస్తున్నాయి కదా! "ఎప్పోదుమ్ కైకషలానేమియాన్" – ఎప్పుడూ అంటే పంచావతారాల్లోనూ భగవానుడు సుదర్శనుణ్ణి తన చేతియందు విడువకుండా ధరించి యుంటాడు, అని ఆళ్వార్లు శ్రీసూక్తి వల్ల, భగవద్ధర్మం సుదర్శనునికి కూడ సాధర్మ్య మవుతుంది కదా!

షడర చక్ర ప్రతిష్ఠితుడు – సకల తత్త్వ ప్రతిష్ఠితుడు ఎలా అవుతాడనే విరోధాభాసం ధ్వనిస్తుంది. కాబట్టి దీనికి, భగవానునికి ప్రతిరూపంగా భాసించే సుదర్శనుడు, సకల తత్త్వాలయందు అంతర్యామిగా ఉండేవాడనడంవల్ల ఆ విరోధం పరిహారమవుతుంది. **"కోణే క్వాఽపి స్థితోఽసి త్రిభువనవితతః"** – ఎక్కడనో షట్కోణ చక్రమందు ఉండే వాడయినా, మూడు లోకాలలోనూ విస్తరించి యుండేవాడు – అని సుదర్శనశతకసూక్తి. "వితతం పురాణం" అనే శ్రుతి కూడా పల్కుతుంది.

5. వివిధ సంకల్ప కల్పకుడు : అనేక కోరికలకు కల్పతరువులాంటివాడు.

6. విబుధ సంకల్ప కల్పకుడు : అమరులకు – బాగా తెలిసి ఉపాసించే వారికి, కలిగే కోరికలనీడేర్చేవాడు. "ఎనక్కే తన్నై తన్ద కఱ్పగమ్" నాకు తననే ఇచ్చుకొన్న కల్పవృక్షం, భగవానుడు' అని ఆళ్వార్లన్నారు. కల్పవృక్షం మనం కోరిన వస్తువునే ఇస్తుంది. తానే తనను ఇచ్చుకోదు. కల్పవృక్షం కన్న కమలాక్షుడు మిన్న అన్న విషయం ప్రస్ఫుటం కదా!

శ్రీ యామునాచార్యుల స్తోత్ర రత్నంలోని 'అర్థకల్పక' మనే విశేషణాన్ని శ్రీ వేదాన్తదేశికులు వ్యాఖ్యానిస్తూ, మూడు వ్యుత్పత్తులను చూపినారు. 1) "అర్థినాం కల్పద్రుమవత్ సర్వాపేక్షితప్రదమ్" – అడిగిన వారికి కల్పవృక్షం లాగా కోరినవన్నీ ఇచ్చేవాడు. 2) "అర్థినః కల్పద్రుమభూతాః యస్య సః అర్థికల్పకః" ఎవనికి యాచకులు కల్పతరువులాంటి వారో అతడు అర్థికల్పకం. అంటే, అనేక విధాలైన వరాలను జనుల కివ్వాలి అనే భగవానుని ఆశను, అర్థిజనం తమ తమ వరాలను కోరడం ద్వారా, సఫలం చేస్తుంది. కాబట్టి, భగవానుని దృష్టిలో యాచకులే ఉదారులు. **"ఉదారాః సర్వ ఏవైతే"** (భగవద్గీత) ఇచ్చేవాడు ఉదారుడుకాదు. అవాప్త సమస్త కాముడైన భగవానుని వల్ల ఏదైనా పొందగోరే వాడు

కల్పవృక్షం. అతడే కామధేనువని అర్థం. 3) **"స్వయ మర్థినః కల్పయ తీత్యర్థః క్షేత్రజ్ఞానాం తత్తత్ పురుషార్థాధికారదశాఽపి హి పరమపురుషకల్పితా"** తానే యాచకులను కల్పించే వాడు, జీవులు ఆయా పురుషార్థాలను అనుభవించే దశనూ కల్పించే వాడు, కాబట్టి భగవానుడు 'అర్థికల్పకం', (ఈ విషయాన్ని శ్రీరంగరాజస్తవం - పూర్వ శతకానికి, మహావ్యాఖ్యాత డా॥ ఈ.ఏ.శింగరాచార్య స్వామి వారు తాము రచించిన 'వరివస్యా' వ్యాఖ్యానంలో వివరించారు)

శ్రీ వేదాన్తదేశికులు భగవానునికి వర్తించే 'సంకల్ప కల్పక, అనే శబ్దార్థాన్ని ఇక్కడ శ్రీ సుదర్శన చక్ర విషయానికి అనుసంధించారు.

7. ఇలాంటి శ్రీ సుదర్శన భగవానుడా! జయ, జయ!!

8. ఓ సుదర్శన చక్రమా! జయ, జయ!! ✦ .... (సశేషం)

విజ్ఞాన వీచిక





వేమన తాత్త్వికత - సందేశము

(14) —డా॥ వై.భానుభవాని, గుంటూరు.

తరువ తరువ బుట్టు తరువున ననలంబు
తరువ తరువ బుట్టు దధిని ఘృతము
తరువ తరువ బుట్టు తనువున తత్త్వంబు
విశ్వదాభిరామ వినుర వేమ.

సాధకునికి నిర్విరామమైన సాధన అవసరమని చెప్పుటయే ఈ పద్య సారాంశము. అటువంటి సాధన కొనసాగించినప్పుడే ఇంద్రియములు అధీనములోనికి వచ్చి, ఏకాగ్రత కుదిరి, లక్ష్యం సిద్ధిస్తుంది.

ప్రాచీనులు రాపిడి (ఘర్షణ) ద్వారా అగ్నిని పుట్టించి తమ అవసరాలు తీర్చుకునేవారు. ప్రకృతి సిద్ధమైన విధానం ఇదే. అడవులలో చెట్ల మధ్య ఏర్పడే రాపిడివల్ల కలిగిన అగ్నియే కార్చిచ్చుగా మారుతుంది. ఆధునిక కాలంలో కూడా యజ్ఞాదికముల నిర్వహణలో అగ్నిని రాపిడి ద్వారానే పుట్టిస్తారు.

అదేవిధంగా నిత్యం అనుభవంలోకి వచ్చే విషయం ఏమంటే – పెరుగును బాగా చిలికినప్పుడే వెన్న, దాని నుండి నెయ్యి లభిస్తాయి. ఈ రెండు విషయాలలో లౌకికావసరాలు నేరవేరుతున్నాయి.

అలౌకికమైన ఆత్మానుభూతి, జ్ఞానసంపద కూడా ఇటువలెనే పట్టుదలతో సాధించి నపుడే లభిస్తాయి. "సాధనమున పనులు సమకూరు ధరలోన" అనే మాట అందరెరిగినదే కదా.

"యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్ ।
తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్ ॥ అని

గీతాకారుని సందేశము. చంచలమైన మనస్సును ముందుగా అధీనము చేసికొని ఆ తరువాత మాత్రమే ఆత్మసాక్షాత్కారము పొందనగును. కావున సాధకుడీ విషయాన్ని గ్రహించి సాధన ప్రారంభించాలి.

ఎచటినుండి వచ్చు ఎచటికి జనిపోవు
నిదుర చందమెరుగ నేర్చెనేని
ఆత్మరాక పోక అతడెపోదెలియుట
విశ్వదాభిరామ వినురవేమ.

ఆత్మ శాశ్వతము. జరామరణములు లేనిది. పునర్జన్మ సిద్ధాంతము ననుసరించి వేర్వేరు శరీరముల ద్వారా మరల మరల ప్రాణుల రూపంలో ఉద్భవిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని విశ్వసించినపుడు, ఒక శరీరమును వదలి వేరొక శరీరములోనికి ప్రవేశించే విధానంలో ఈ ఆత్మ ప్రయాణం ఎలా సాగుతుంది అని అనుమానం రావడం అత్యంత సహజం.

"వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోऽపరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ"

చిరిగిన వస్త్రములను వదలి క్రొత్త వస్త్రములను ధరించుట ఎంత సహజమో ఒక నిరుపయోగ స్థితికి చేరిన శరీరాన్ని వదలి వేరే శరీరములను ఆత్మ ఆశ్రయించుట అంతే సహజముగా భావింపనగును. అనగా ఎడతెగక సాగు ప్రక్రియయే ఇది. జనన మరణములు ఒకదాని వెనుక ఒకటి సంభవిస్తూనే ఉంటాయి.

ఈ విషయాన్ని గ్రహించటానికి వేమన చెప్పిన సులభోపాయం నిద్ర గురించి తెలుసుకోవడము. నిదురలో ఉన్నప్పుడు ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు? మెలకువ వచ్చిన తరువాత అంతా మామూలే. ఈ రెంటికి మధ్యనున్న రహస్యాన్ని, సమన్వయాన్ని ఎంత వరకు తెలిసికొనగలము? కాబట్టి బ్రతికి ఉన్నప్పటిది తాత్కాలిక నిద్రయైతే మరణమన్నది ఆ శరీరానికి శాశ్వత నిద్ర. ఆ నిద్ర గురించి తెలిస్తే ఆత్మ గమనం గురించి కూడా తెలుసుకోగలమన్నది వేమన అభిప్రాయము.

చూపు వెలుగు జేసి సూక్ష్మంబు లోపల
చిత్తమందు మోదమతము విడక
తుదను నెవ్వరి మతము దూషింపక పదిలుడై
మనము జయించువాడు ముఖ్యుడు వేమా!

వేమన పై పద్యంలో చిత్తములో సంతోషాన్ని అనుభవిస్తూ ఉండాలని ప్రాథమిక సూత్రం చెప్పాడు. ఈ సంతోషం వస్తుమయ ప్రపంచంలో తనదిగా భావిస్తున్న సంపదలు మొదలైన వాటి వల్ల లభించే లౌకిక ఆనందమా, లేక ఆత్మానందమా అన్నది తేల్చుకోవాల్సిన అంశం. వ్యక్తిత్వ వికాస నిపుణులు అడుగడుగునా అనుకూల భావాలు, ఆలోచనలు వ్యక్తి ఎదుగుదలకు, విజయాలకు ఎంత అవసరమో ఈనాడు అదేపనిగా చెప్పటం అందరికీ తెలిసిందే. ఈ అంశం చెప్పే పద్ధతిలో క్రొత్తగా కన్పించినా ఆలోచన అనాదిగా ఉన్నదే కదా. ఏది సాధించాలన్నా నిరాశా, నిస్పృహలు తొలి శత్రువు లౌతాయి. అందుకే వాటిని దూరంగానే ఉంచి మానవుడు తన ప్రయత్నం తాను చేయాలి. అది లౌకిక జీవితానికి సంబంధించిన ప్రయత్నమైనా, పారమార్థిక జీవితానికి చెందిన అంశమైనా ఒకటే. తొలిమెట్టు

మనసును అనుకూలంగా, శాంతంగా, సంతోషంగా ఉంచగలగడం, ఇటువంటి సూత్రాలు భగవద్గీత నుండి ఆధునిక శతకాల దాకా అంతర్గతంగా ఇమిడి ఉన్నాయి. అటువంటి ఒక సూత్రమే ఇక్కడ కూడా అంతర్లీనంగా ఉన్నది.

శరీరాన్ని స్థూల, సూక్ష్మశరీరాలుగా వేదాంతులు, అధ్యాత్మవేత్తలు చెపుతూ ఉంటారు. సరళమైన పద్ధతిలో చెప్పాలంటే పైకి కన్పించే శరీరాకృతితో కూడిన స్థూల శరీరం, కన్పించకుండా ఈ శరీరానికి చైతన్యాన్ని, తేజస్సును, బుద్ధిశక్తిని అందించే తత్త్వం లేదా ఆత్మశక్తిని సూక్ష్మ శరీరంగా చెప్పవచ్చు. జీవాత్మగా భావించవచ్చు.

మానవుడు తన దృష్టిని బాహిరమైన ప్రాపంచిక విషయాలపైన కేంద్రీకరించటం అనేది సమాజంలో తను కొనసాగించే జీవితాన్ని పండించుకునేందుకు ఉపయోగిస్తుంది. దీనిని సాగిస్తూనే సాధించవలసిన ఆత్మజ్ఞానం మరొకటి. ఈ రెండవ దానిని పొందటానికి "చూపును సూక్ష్మంబు లోపల వెలుగు చేయాలట." అంటే అంతర్దృష్టిని లేదా మనోనేత్రాలను తన తెలివితేటలతో తేజోవంతంగా చేసి సూక్ష్మ శరీరాన్ని లేదా ఆత్మను, భగవంతుని గురించి ఆలోచించాలన్నమాట. ఈ క్రమంలో మానవుడు చికాకు, కోపం లాంటి ప్రతికూల భావాలను మనసంతా నింపుకొనకూడదు. అంతేకాదు సామాజికముగాను, ఆంతరంగికముగాను కూడా ఇతర మతములను దూషించకూడదని వేమన మతము. భగవంతుడు ఒక్కడే అని నమ్మిన వేమన ఇంతకంటె భిన్నంగా ఎందుకు చెపుతాడు? అదే వేమన తత్త్వం. అటువంటి సహనంతో సంతోషంతో, ఆత్మశక్తిని ప్రేరేపించి తన మనసును జయించిన వాడే ముఖ్యుడు అని వేమన అభిప్రాయం. ఇంత లోతైన పరిజ్ఞానం కలవాడు కాబట్టే వేమన ప్రతివిషయాన్ని తన చిన్న చిన్న పద్యాలలో ఇమిడించి అనంతర తరాలకు ఐహికాముష్మిక బోధ చేశాడు. ✦ .... (సశేషం)



తిక్కన కీచకవధ

ప్రక్షిప్త నిక్షిప్తములు (19)

- డా॥ చింతలపూడి వేంకటేశ్వర్లు, ఇడుపులపాడు.

పదక నిర్వహణము :

అటుల నాతడువ్విళ్ళూరుచు నుఱకల గేకయరాజనందన సదనంబునకుంజని యచట ననురూపవిధాననిరతయైన యనిమిషచారువిలోచనం జూచెను. ఈ విషయమును చెప్పినది కందమునందైనను అందమైన విశేషణంబుల నద్వితీయముగ పొదిగినాడు కవి. 'ఉవ్విళ్ళూరుచు' ననుటలో పాత్రయొక్క అప్పటి పరిస్థితి తెలుగువారి కనులముందు రూపు కట్టుచున్నది. కేకయరాజపుత్రి సదనమనుటలో గతమందొక దుర్నీతికి నెలవైన కైకయిల్లు భావములమెదలును. అనిమిషచారువిలోచన యనుటవలన ద్రౌపది కీచకాగమమునకై ఱెప్పవేయక నిరీక్షించుచుండెనను వ్యంగ్యార్థము సిద్ధించును. అనిమిషులైన పతులకాపులో ఆమె చూపులున్నాయనియును భావింపనగును. అనురూపవిధాన నిరతయనుట నట్లు నిరీక్షించుచును సైరంధ్రి తనపనులదాను నిర్వహింపుచుండెనని యర్థము. ద్రౌపది తా దలపెట్టిన కార్యమెంత చాకచక్యమున నిర్వహింప సిద్ధమాయెనో యీ పద్యమున కవిఱేడు రెండేరెండు విశేషణముల బ్రదర్శించెను.

తమకంబున జనుదెంచెనేగాని ఆ యనురూపవిధాననిరతను జూచుటతోడనే యతని కోరికలు తబ్బిబ్బుపడినవి. ధైర్యము వెనుకంజవేసినది. మనమునకెయ్యది ముందు చేయనగునోయను సంశయము పట్టుకొనెను. పరిజనములు దూరముననుండిరో లేక దగ్గరగానుండిరోయని పరిశీలించుపాటి ఓపియును క్షీణించెను. విధాతయను వేటగాని వశమున నిట్టికివలె ద్రౌపదిచెంత కాదుర్విదగ్ధుడు చేరెను. కీచకునొసట విధాతలిఖించిన కాలపరిమితి దగ్గరపడెనని యీసామెతవలన ప్రస్ఫుటమగుచున్నది.

గతదినంబున వెంటనంటి కాలదన్నిన కామాంధుడు తిరిగిదరికిచేరిన నతని గమనించియును పతియొసంగిన ధైర్యంబుపేర్మి నేమాత్రమును బెదరక యెప్పటియట్లే తానాతని గమనించినట్లతనికి తెలియనివిధంబున ద్రౌపది తనపనులయందు మునిగి యున్నట్లు నటింపసాగెను. ఈ సందర్భమున భీముపలుకులనునది బలమైనమాటలను సాభిప్రాయప్రయోగము. మూలముననియ్యెడ ద్రౌపదియందు నటన కనిపించదు. కామాంధుడైన కీచకుని యాకర్షింప నటింపవలసిన పనిలేదు. ఇచ్చట తిక్కన ప్రబంధో చితమైన శృంగారరసాభాసముకై సైరంధ్రీ కీచకుల మధ్య సంభాషణములబెంచి నాటకీయత కొఱకు అభినయమున కవకాశమును కల్పించెను.

నేరుగా పలుకరించు ధైర్యముగోల్పోయిన కీచకుడెవరితోడనో మాటాడుచున్నట్టు లెవ్వియో పనికిరాని మాటలాడదొడంగెను. కాలిమట్టియలతో చప్పుడు చేయును. వెకిలి నవ్వులతో నొడలువిరుచుకొనును. ప్రక్కనున్నగుంజలపై దరువులువేయుచు కూనిరాగములు తీయును. తన్నుజూచునను నాసతో దగ్గరదగ్గరగా తిరుగును. ఎన్నిచేసినను దనను జూచుట లేదేయని తల్లడిల్లును. ఒకచో నిలువడు. బాధభరింపలేక నాపెదెస దఱచితఱచి చూచును. కడ కోపిక నశించి ధైర్యముచేసి దరికిజని మాటాడ దొడంగెను. పాతకున కధర్మ మనిపించినను ద్రౌపదిపై కోపముజనింపజేయు నంతటి యాతనననుభవించెను– తిక్కన పాత్రచిత్రణా వైచిత్ర్యమట్టిది.

డాయంబోయిన దండనాథుడా యబల నొప్పించుటకై సామ దాన భేద దండోపాయంబుల నాల్గింటిని ప్రయోగించెను. ఆమె పదసేవజేసికొను యోగ్యతగల్గిన నది తన భాగ్యమగుననెను. తననే కాదనుచున్నదో లేక కామునెడ పూర్తి వైరాగ్యము నవలంబించుచున్నదో తేల్చి చెప్పుమనెను. పురుషునొకపరి పరికించిన పాపముకాదనెను. నలుగురిలో తన్నాఱడిబెట్టవలదని ప్రాధేయపడెను. తన్నేలి యప్పురభామినులెల్లరు గొల్చు చుండగా నిత్యవైభోగముల జీవితము గడుపుమనెను. పేరుకు విరాటుని రాజుగాకూర్చుండ బెట్టి రాజ్యతంత్రమంతయు నడుపునది తానేనని తన విభుత్వమును ప్రకటించెను. ఒక్కతెనుగాదు, పదిమందినైనను తాను చెఱబట్ట తన్నడ్డగలుగు మగవాడందులేడనెను. విరటుకొల్వున పలువురు చూచుచుండ నిన్నట్లుజేసిన నందొక్కడైనను కాదు–కూడ దన గలిగెనాయని సూటిగా ప్రశ్నించెను. అపుడు నీభర్తలేవురేమైతిరని రొక్కించెను. ఇంకనిను రక్షింపనెవ్వరును లేరని, రారని భయపెట్టి 'పట్టెదనెందుజొచ్చినన్' అని చివరిదగు దండ ప్రయోగంబున బలవంతము సలుపసిద్ధపడెను. విసుగెత్తిన దుర్విదగ్ధుని నోట ననుచి తంబులగు పలుకుల వెలువరింప వెనుకాడలేదు కవి. కామాతురునకుచితానుచిత వివేక జ్ఞాన మెక్కడుండును!

పైవచనంబుల వలన వాడు దమకించియుండెనని నిర్ణయించుకొని తన మాయ మాటలకు మున్నవాడు గదియంబడిన దమపన్నుగడ పాడగునని దలంచి సమయమెఱింగి ద్రుపదనందన పథక నిర్వహణమున బ్రవేశించెను. అతని పలుకులన్నియు విని తుద కొడంబడినట్లు వాలుచూపునొకటి ప్రసాదించెను. వలదని యెంత చెప్పినను వినక తొందర పడుదువేమని కవ్వించెను. నీకు కోరిక పుట్టినంతమాత్రమున నెదుటివారిపై విరుచుకు పడుట భావ్యమాయని మృదువుగా మందలించెను. కోర్కులీడేర్చుకొనుట కుపాయ మాలోచింప వలదాయని యనునయించెను. కోరికలు కలుగునెడ మగవారు వాని నణచు కొనలేక, రాగల యపాయములగూర్చి యాలోచింపక తొందరపడుదురనియును, ఆడు వారైనచో ధైర్యమున గోర్కుల నదుపుజేసికొని సమయమెఱింగి యనుభవింతురనియును లోకరీతిని తెలుపు నెపమున నబ్బలగర్వితుని బలహీనతల నెత్తిచూపెను. అన్నివిధముల

రహస్యమగురీతి గోర్కె దీర్చుకొమ్మని తాము పన్నిన వలలో యెఱనెదుటనుంచెను. కాని, యిన్నిమాటలయం దొక్కచోటను ఆమె పాతివ్రత్యమునకు భంగము వాటిల్లిన తీరు కాన్పింపదు. ఆతనికోర్కె దీర్చుకొమ్మనుటలో తగిన ఫలితమనుభవింపు మనియే గాని తానాతని సుఖింపజేతునని కాదు. మూలమున నిట్టి యనుమానమునకు అవకాశమేలేదు. కీచకుడు తానే మోహితుడైయుండ నతనియొప్పుదల కొఱకు వేరుగా ప్రయత్నింపవలసిన పనియేమున్నది? కామాంధకారమున వేట గ్రుడ్డిదైయుండ యెఱతో పనియేమున్నది!

కీడుశంకింపగలుగు బుద్ధిగోల్పోయిన కీచకున కంతకుమించినదేమియుండును! ఎడదయుప్పొంగ తిరిగి సరసములకు దిగినాడు. కామువివశుడైన తన్నంతగా నేపదగునా యని బ్రామాలెను. ఏమిటికి విచారమని తొందరపెట్టెను. అయినను నీయిష్టం బటులే కానిమ్మని యొడంబడెను. ఎప్పుడెయ్యెడ నిజాభిమతం బొడగూర్తువు చెప్పుమని నేరుగా తనపాలి యురులందు బ్రవేశించెను.

ద్రౌపదియు దనపథకము పారెనని నిశ్చయించి యనురాగాయత్తచిత్తయైన దాని వలె నభినయించుచు సంకేతస్థలంబు నతిరమ్యముగా వివరింప సాగెను. పగటివేళ నుత్తరాదులు నృత్యముల నేర్చుకొనెడు నర్తనశాల రాత్రులందు సంచారరహితమైయుండు నట. నిశీథినీవృత్తము గోరువారికది మంచి యనువగు రహస్యస్థావరమట. ఒంటిగ వచ్చినచో నాగృహ మత్తెఱంగున కుత్తమం బగునట. అత్తెఱంగన గీచకునకు తరుణీ సమాగమార్థము. ద్రౌపదికి ప్రతీకారార్థము. రెండింటికిని కావలసినదేకాంత గృహమే.

అంతకుమించి కావలసినదేమి! ఈ రాత్రికే యొంటి జనుదెంతునని మితిమించిన సంతసమున నొడంబడిన నమ్మత్యపతిమఱందికి మాటతప్పకుసుమీయని సైరంధ్రి తిరిగి హెచ్చరించినగాని యాతని యారాటమాగలేదు ఆమెకు తన నాటకము రక్తిగట్టెనను దృప్తియును కలుగలేదు. అంతటితోనాగక అతనికింకను పూర్తినమ్మకము కలుగునట్లును, తమ పథకము గట్టిపడునట్లును నీవొక్కరుండ వరుగుదేరవలయు లేకున్న నయ్యెడ నిలచుదానగానుజూ నిక్కువంబని మఱల హెచ్చరించెను. తమమధ్య ప్రణయమితరుల కంటబడ నిష్టము లేనిదానికి వలె నటించుచు నింకను నందేనిలచిన నానాభరణ ధరణశీలునితో మనమియ్యెడ బెద్దయుబ్రద్దనుమానములేక మాటలాడుటతగ దీవును బమ్మేనును నాదగు పనికేగెదనని పలికి యతనినచ్చోటునుండి పంపివైచెను. కృష్ణ భీముల యీ రహస్యపథకమున గృష్ణ తనదగు భాగము నత్యంత జాగరూకతతోడను, చాకచక్యముతోడను నిర్వహించెను. ఇంకను మిగిలిన భాగము భీమసేనునిది.

ఇంట బయలుదేరినపుడు తానాశించినటుల సైరంధ్రిని తనపలుకుల పెంపున నియ్యకొనజేయగల్గితినను యానందముతో నింపైన యాపెపల్కుల జిత్తమందు నింపుకొని కీచకుడత్యంత సంతసమున నింటికిజేరెను. ద్రౌపదియును నచట తనపనులు పూర్తిచేసి కొని జరిగిన విషయము భర్తకు నివేదించుటకై వంటిల్లు జొచ్చెను. ✦ .... (సశేషం)



ఓం పతంజలయే నమః

యోగసూత్రాలు

(19)

– చింతగుంట సుబ్బారావు, చీరాల.

అధ్యాయం 2

యోగము – యోగసాధన

సూత్రం 1 :– తపః స్వాధ్యాయేశ్వరప్రణిధానాని క్రియాయోగః ।

Yogic action is three - fold : 1. Practice of austerities doing penance (tapas); 2. Studying scriptures and the related books (Swaadhyaaya); and 3. in toto dedication to God, aspiring after God, leaving the fruit of his work to God Himself. The first one conserves energy and channels it towards the yogic goal, purifying it from wastage of desires and emotions and passions. The second one keeps the aspirant's attention on his target, unwavering and steady, re-assuring his progress. The third is directly connected to the spiritual nature of yoga as it surrenders the fruit of his work to God, leaving himself unencumbered.

యోగం క్రియారూపంలో మూడు విధాలు : 1. తపస్సు, అంటే పవిత్ర కర్మాచరణ ద్వారా, ధ్యానమననాదుల ద్వారా, శక్తిని అంతస్థంగా నిలువ చెయ్యటం, ఆ శక్తిని యోగలక్ష్యం దిశగా మళ్ళించటం, ఆత్మతో అనుసంధానానికి ప్రయత్నించటం. ఇందు కవసరమైన భౌతిక నియంత్రణను సాధించటం; 2. స్వాధ్యాయం అంటే, వేదాంత తత్త్వగ్రంథాలను, తత్సంబంధమైన అన్యగ్రంథాలను అధ్యయనం చెయ్యటం, తద్ద్వారా ఆధ్యాత్మిక జీవనాన్ని గురించి సవివరంగా తెలిసికొనటం. దీనివలన తన మార్గం సరియైనదని దృఢవిశ్వాసాన్ని సాధించి, అవసరమైనంత సరిదిద్దుకోగల అవకాశాన్ని పొందటం; 3. ఈశ్వరప్రణిధానం, అంటే, తన కార్యాలను, వాటి ఫలాలను పరమాత్మకు సమర్పించటం. దీనికి పరమాత్మ యందు సంపూర్ణ విశ్వాసం ప్రాథమికం. లౌకిక బంధాల నుండి ముక్తుడు కాకుండా పరమాత్మైక్యం అసాధ్యం కనుక, యోగ లక్ష్యాన్ని సాధించే ప్రయత్నంలో ఫలాసక్తిని త్యజించటం తప్పనిసరి. భౌతికతను విడిచి ఆత్మికతను పొందేందు కిది సరళమైన మార్గం.

సూత్రం 2 :– సమాధి భావనార్థః క్లేశతనూకరణార్థశ్చ ।

The first aphorism has spoken of 'Kriyaa-yoga' or 'the yoga of Action' and defined its characteristics. This one now speaks of the aims and results of

the yoga of action. Its goals and / or results are two-fold : 1. Spiritual absorption or Samadhi, and 2. reducing or neutralising the agent of suffering or Klesa-tanoo-karana. Penance, study and dedication to God described in the first aphorism, are all reliable means to achieve spiritual absorption or samaadhi which is possible only by weakening and neutralising the agents which cause hardships. These agents, as they become weaker and weaker, become unproductive and the obstacles to spiritual absorption diappear. Those agents of obstacles are exposed in the third aphorism.

మొదటి సూత్రం క్రియాయోగపు లక్షణాలను వివరించగా, ఈ సూత్రం దాని లక్ష్యాన్ని, సాధన ఫలాన్నీ వివరిస్తున్నది. క్రియారూపయోగం లక్ష్యాలు రెండు : 1. సమాధి భావన, 2. క్లేశ తనూకరణ. యోగం సమాధిస్థితిని పొందటానికి మొదటి సూత్రం చెప్పిన ఉపయాలు తపస్సు, స్వాధ్యాయం, ఈశ్వర ప్రణిధానం అన్నవి. ఇవే క్రియాయోగం. ఈ మూడిటి సాధన వలన ఏకాగ్రత నిశితమవుతూ సమాధిస్థితి కలుగుతుందన్నది భావం. అంటే ఈ క్రియాయోగాంగాల ద్వారా యోగసాధకుని క్లేశాలు క్షీణించి ఏకాగ్రత సుసాధ్యమవుతుందని అర్థం. క్లేశాలు క్షీణించటం అంటే క్లేశ కారకాలు బలహీనపడి క్లేశాన్ని కలిగించలేనంతగా నిస్సారమైపోతాయి, అని కదా అర్థం. ఈ నిర్బీజత వలన ఏకాగ్రత సులభమై సమాధి స్థితికి దోహదం అవుతుంది. క్లేశాలంటే విఘ్నం కలిగించేవి. అవేమిటో 3వ సూత్రం వివరిస్తుంది. ✦ .... (సశేషం)



శ్రీ బెల్లంకొండరామరాయ కవివిరచిత

దినకరవ్యాఖ్యాసహిత వేదాన్తముక్తావళ్యంతర్గతా

'ప్రశ్నోపనిషత్'

ఇటీవలె పుస్తకరూపం సంతరించుకొన్నది. వెల. రూ.400/-. కావలసినవారు సంప్రదించగలరు. 9440115411

శ్లో॥ ప్రాణే సర్వమిదం ప్రతిష్ఠితమరా నాభౌ రథాఙ్గస్య వా
వేదానాం త్రితయం కృతం చ ముఖజః ప్రాణ స్తథా క్షత్రియః ।
ప్రాణోఽయం హి విరా ట్పితుశ్చరతివా గర్భే రసాత్మా శిశు-
ర్మాతుశ్చ ప్రతిజాయతే సుతమయోఽముష్మై బలిం తన్వతే ॥ 65

వ్యా. ప్రాణమేవ విశినష్టి **ప్రాణ** ఇత్యాదిభిః. రథాఙ్గస్య = చక్రస్య నాభౌ అరా వా ఇవ ఇదం సర్వం జగత్ప్రాణే ప్రతిష్ఠితమ్. ప్రాణ ఏవ వేదానాం త్రితయం త్రయీ భవతి. శబ్దస్య ప్రాణాధీనత్వాదితి భావః కృతం కర్మ చ ప్రాణ ఏవ. ప్రాణనిర్వర్త్యత్వాత్కృతస్య. ముఖజః ప్రాణః క్షత్రియశ్చ ప్రాణః - ఉపలక్షణమిదం ద్వయం వర్ణాన్తరాణామయమేవ ప్రాణో విరాట్ జగన్మయవిగ్రహః ప్రజాపతిః. అయం ప్రాణః పితుర్గర్భే రసాత్మా రేతోరూపస్సన్. రేతోరూపాత్మా సన్నితి వా చరతి మాతుర్గర్భే చ శిశుస్సన్ చరతి. సుతమయస్సన్ మాతుర్గర్భాత్ప్రతిజాయతే, ప్రతిరూపస్సన్ ఉత్పద్యతే అముష్మై ప్రాణాయ సర్వే బలిం తన్వతే ఉపహారం సమర్పయన్తి. 65

శ్లో॥ దేవానామపి హవ్యవాట్పితృతతేరేష స్వధాప్రాపకోఽ-
థర్వా చాఙ్గిరసర్షి సత్యచరితం రుద్రో మహేన్ద్రోఽవితా ।
సూర్యోఽయం దివి తేజసాంపతిరపో వర్షత్యముష్మిన్ప్రజా
ఆనన్దన్తి యథాభిలాషమితి నో భూయోఽన్నముత్పత్స్యతే ॥ 66

వ్యా. అపి కిఞ్చ ఏష ప్రాణః దేవానాం హవ్యవాట్ హవ్యప్రాపకోఽగ్నిః భవతి - పితృతతేః స్వధాప్రాపకః భవతి. అథర్వా వేదవిశేషో యద్వా ఋషివిశేష ఏష ఏవ అఙ్గిరసర్షిసత్యచరిత మఙ్గిరసాః ప్రాణశేషభూతాశ్చక్షురాదయః. త ఏవ ఋషయః ద్రష్టారః. తే చ తే ఋషయ ఇతి వా సమాసః. తేషాం సత్యచరితం దేహధారణాద్యుపకారలక్షణమేష ఏవ.

ఏతన్నిర్వర్త్యత్వాత్తస్యేతి భావః. ఏష ఏవ రుద్రః, మహేన్ద్రః, పరమేశ్వరః, అవితా – రక్షకశ్చ భవతి. అయం దివి తేజసాంపతిస్సూర్యస్సన్ అపో వర్షతి మేఘాత్మనేతి భావః. అముష్మిన్ వర్షతి సతి నః యథాభిలాషం యథేచ్ఛం భూయో బహ్వన్నముత్పత్స్యతే భవిష్యతీతి ప్రజా ఆనన్దన్తి. 66

శ్లో॥ ఏకర్షిర్విమలస్సమస్తహవిషా మత్తాఽస్య సాధుః పతిః
ప్రాణోఽస్య హ్యదనీయదాయిన ఇమే శ్రోత్రాదయో దేవతాః ।
వాయోరేష పితా చ సర్వజగతో వాచి స్థితాఽదస్తనూః
శ్రోత్రే చక్షుషి మానసే చ వివిధాశ్చేష్టా విధత్తే శివా ॥ 67

వ్యా. విమలశ్శుద్ధో పాపవిద్ధః ప్రాణః. ఏకర్షిః తన్నామకాగ్నివిశేషస్సన్. సమస్తహవిషా మత్తా భోక్తా భవతి. అస్య జగతస్సాధుః పతిర్భవతి. ఇమే శ్రోత్రాదయో దేవతా దేవా అస్య ప్రాణస్యాదనీయదాయినః భోజ్యదాతారః భవన్తి. దేవతాశబ్దస్య నిత్యస్త్రీత్వేపి తదర్థస్య పుంస్త్వా ద్దాయిన ఇత్యుక్తమ్. ఏష ప్రాణః వాయోస్సర్వజగతశ్చ పితా భవతి. శివా శోభనా అదస్తనూరముష్య ప్రాణస్య తనూః. వాచి శ్రోత్రే చక్షుషి మానసే చ స్థితా సతీ వివిధాశ్చేష్టాః క్రియాః వచనశ్రవణ– దర్శనమననాత్మికాః విధత్తే కరోతి. 67

శ్లో॥ లోకేఽస్మిన్ త్రిదివే నృణాం దివిషదాం యశ్చోపభోగోఽఖిలః
ప్రాణస్తస్య హి రక్షితా తత ఇమం మాతేవ పుత్రాన్ ప్రభో ।
రక్షాస్మాన్ కలయ శ్రియో వితర నః ప్రజ్ఞామితి ప్రార్థయ–
న్త్యల్పజ్ఞాస్తదుపాసకాస్సముపయన్త్యాత్మేప్సితార్థాదికమ్ ॥ 68

వ్యా. నృణాం మనుష్యాణామస్మిన్ లోకే భువి దివిషదాం దేవానాం త్రిదివే దివి చ యశ్చాఖిలస్సర్వ ఉపభోగః. తస్య భోగస్య ప్రాణ ఏవ రక్షితా రక్షకః. తతస్తస్మాదిమం ప్రాణ మల్పజ్ఞాః హే ప్రభో, పుత్రాన్ మాతేవ త్వమస్మాన్ రక్ష. శ్రియః కలయ వర్ధయ నః ప్రజ్ఞాం వితర ఇతి ప్రార్థయన్తి. తదుపాసకాః ప్రాణోపాసకాః. ఆత్మేప్సితార్థాదికం స్వాభీష్టధనాదికం సముపయన్తి – లభన్తే. 68

రచయితలు తమ రచనలను 30 రోజులు ముందుగా ఈ దిగువ చిరునామాకు చేరునటుల పంపగలరు. 'ఆత్మజ్యోతి' మాసపత్రిక ప్రతినెల – 1వ తారీఖుకు విడుదలగును.
చిరునామా :
రావి మోహనరావు, M.Sc., M.A., (Sanskrit)
గౌరవసంపాదకులు 'ఆత్మజ్యోతి'
404, జంజనం కాంప్లెక్స్, 1 టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురు,
చీరాల – 523 155, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
Cell : 9440115411, E-mail : *ramorasans@gmail.com*
Website : www.samskruti.org/people/ramora/ramoraindex.html

ఉమాకల్యాణము

మహాకవిశ్రీకాళిదాసవిరచిత

కుమారసమ్భవమహాకావ్యమ్

వ్యాఖ్యాత - రామోరా.

అవతారిక :- స్వభావసుందరయోః తదీయనేత్రయోః కాలాఞ్జనం మఙ్గలమితి హేతోః అర్పితమ్ -

శ్లో॥ తస్యాస్సుజాతోత్పలపత్రకాన్తే
ప్రసాధికాభిర్నయనే నిరీక్ష్య।
న చక్షుషోః కాన్తివిశేషబుద్ధ్యా
కాలాఞ్జనం మఙ్గలమిత్యుపాత్తమ్॥ 20

పదవిభాగము :- తస్యాః, సుజాతోత్పలపత్రకాన్తే, ప్రసాధికాభిః, నయనే, నిరీక్ష్య, న, చక్షుషోః, కాన్తివిశేషబుద్ధ్యా, కాలాఞ్జనమ్, మఙ్గలమ్, ఇతి, ఉపాత్తమ్।

అన్వయక్రమము :- సుజాతోత్పలపత్రకాన్తే తస్యాః నయనే నిరీక్ష్య ప్రసాధికాభిః కాలాఞ్జనం చక్షుషోః కాన్తివిశేషబుద్ధ్యా న ఉపాత్తమ్, (కింతు) మంగలమ్, ఇతి (హేతోః) ఉపాత్తమ్।

ప్రతిపదార్థము :- సుజాతోత్పలపత్రకాన్తే - చక్కని ఉత్పలములరేకులవలె సహజ సుందరములగు, తస్యాః - ఆ పార్వతీదేవియొక్క, నయనే - కన్నులను, నిరీక్ష్య - చూచి, ప్రసాధికాభిః - అలంకరించుచున్న చెలికత్తెలచే, కాలాఞ్జనమ్ - నల్లని కాటుక, చక్షుషోః - కన్నులకు, ఉపాత్తమ్ - అల, కాన్తివిశేషబుద్ధ్యా - మరింత శోభను కలిగించవలెనను సామాన్యజ్ఞానముతో, న - కాదు. మంగలమ్ ఇతి - శుభప్రదమైన ద్రవ్యమనియే।

తాత్పర్యము :- చక్కని ఉత్పలముల రేకులవలె సుందరములగు ఆ పార్వతీదేవియొక్క కన్నులను గాంచి అలంకరించు చెలికత్తెలచే నల్లని కాటుకను కన్నులకు అలదినది మరింత శోభను కలిగించవలెనను సామాన్యజ్ఞానముతో కాదు. శుభప్రదమైన ద్రవ్యమనియే.

పాఠాన్తరాలు :– 1. నిరీక్ష్య – సమీక్ష్య

విభక్తులు / క్రియలు :– 1. సుజాతోత్పలపత్రకాన్తే – ...కాన్తమ్, **...కాన్తే**, ...కాన్తాని అకారాన్త నపుంసకలింగో...కాన్తశబ్దః। ద్వి.ద్వి. 2. తస్యాః – **తస్యాః**, తయోః, తాసామ్ దకారాన్తః స్త్రీలింగస్తచ్ఛబ్దః ష.ఏ. 3. నయనే – నయనమ్, **నయనే**, నయనాని అకారాన్త నపుంసకలింగో నయనశబ్దః। ద్వి.ద్వి. 4. నిరీక్ష్య – అవ్యయము 5. ప్రసాధికాభిః – ప్రసాధికయా, ప్రసాధికాభ్యామ్, **ప్రసాధికాభిః** ఆకారాన్తః స్త్రీలింగః ప్రసాధికాశబ్దః। ద్వి.ఏ. 6. కాలాఞ్జనమ్ – **కాలాఞ్జనమ్**, కాలాఞ్జనే, కాలాఞ్జనాని అకారాన్త నపుంసకలింగః కాలాఞ్జనశబ్దః। ద్వి.ఏ. 7. చక్షుషోః – చక్షుషః, **చక్షుషోః**, చక్షుషామ్ షకారాన్త నపుంసకలింగో చక్షుష్‌శబ్దః। ష.ద్వి. 8. ఉపాత్తమ్ – **ఉపాత్తమ్**, ఉపాత్తే, ఉపాత్తాని అకారాన్త నపుంసకలింగ ఉపాత్తశబ్దః। ప్ర.ఏ. 9. న, ఇతి – అవ్యయాలు 10. మంగలమ్ – **మంగలమ్,** మంగలే, మంగళాని అకారాన్త నపుంసకలింగో మంగలశబ్దః। ప్ర.ఏ.

సంధులు :– 1. తస్యాః + సుజాతోత్పల... – తస్యాస్సుజాతోత్పల... – విసర్గసన్ధిః।

2. ప్రసాధికాభిః + నయనే – ప్రసాధికాభిర్నయనే – విసర్గసన్ధిః।

3. ఇతి + ఉపాత్తమ్ – ఇత్యుపాత్తమ్ – యణాదేశసన్ధిః।

సమాసాలు / విగ్రహవాక్యాలు:–

1. సుజాతోత్పలపత్త్రకాన్తే – సమ్యక్ జాతే సుజాతే, ('కుగతి ప్రాదయః' ఇతి గతిసమాసః) ఉత్పలస్య పత్రే ఉత్పలపత్రే, సుజాతే చ తే ఉత్పలపత్రే సుజాతోత్పలపత్రే, తే ఇవ కాన్తే, సుజాతోత్పలపత్రకాన్తే, తే। ఉపమానపూర్వపదకర్మధారయః।

2. కాలాఞ్జనమ్ – కాలం తత్ అఞ్జనం కాలాఞ్జనమ్। వి.పూ.క.

3. కాన్తివిశేషబుద్ధ్యా – కాన్తేః విశేషః కాన్తివిశేషః ఇతి బుద్ధిః, కాన్తివిశేషబుద్ధిఃతయా కాన్తివిశేషబుద్ధ్యా। సంభావనాపూర్వపదకర్మధారయః।

పదవ్యుత్పత్తి – నిఘంటుప్రమాణాలు – కావ్యప్రయోగాలు :–

1. సుజాతః –

ఎ) శ్లో॥ దినేషు గచ్ఛత్సు నితాన్తపీవరం – తదీయమానీలముఖం స్తనద్వయమ్।
తిరశ్చకార భ్రమరాభిలీనయోః – **సుజాతయోః** పంకజకోశయోశ్శ్రియమ్॥
– ర.వం. 3–8

"...సుందరములయిన కమలకుట్మలములయొక్క కాన్తిని తిరస్కరించెను".

బి) శ్లో॥ శరజ్జ్యోత్స్నా కాన్తం కుముదమివ తం నన్దయతు సా
సుజాతం కల్యాణీ భవతు కృతకృత్యః స చ యువా।
వరీయానన్యోన్య ప్రగుణగుణనిర్మాణనిపుణో
విధాతుర్వ్యాపారః ఫలతు చ మనోజ్ఞశ్చ భవతు॥
– ఇతి మాలతీమాధవే 1–16

✦... (సశేషం)

నమక చమకాలు

తెలుగు టీక – డా. తాడేపల్లి పతంజలి, పటాన్‌చెరువు.

ద్వితీయానువాకం

01 నమో హిరణ్యబాహవే సేనాన్యే దిశాం చ పతయే నమః ।

नमो हिरण्यबाहवे सेनान्ये दिशां च पतये नमः ।

ప్రతిపదార్థము : హిరణ్యబాహవే = బంగారమువంటి చేతులు కలవానికి (బంగారపు ఆభరణాలు ధరించిన చేతుల కలవానికి), సేనాన్యే = (జీవులనే సైన్యానికి) సేనాధిపతికి, దిశాం చ పతయే = దిక్కులకు అధిపతియైన వానికి, నమః = నమస్కారము.

విశేషాలు : హిరణ్య బాహవే సంబోధన అంతరాదిత్యవిద్యకు సంబంధించినది. ఛాందోగ్యోపనిషత్ ప్రకారము సర్వప్రపంచమునకు అధినాయకుడు హిరణ్య బాహువు.

02 నమో వృక్షేభ్యో హరికేశేభ్యః పశూనాం పతయే నమః ।

नमो वृक्षेभ्यो हरिकेशेभ्यः पशूनां पतये नमः ।

ప్రతిపదార్థము : హరికేశేభ్యః = ఆకుపచ్చ రంగుగల కేశములు ఆకులరూపంలో కలిగిన (సత్వ, రజస్, తమో గుణములు ఆకులుగా కలిగిన), వృక్షేభ్యో = సంసార వృక్ష రూపంలో ఉన్న, పశూనాం పతయే = పశువులకు ప్రభువయిన శివునికి, నమః = నమస్కారము.

విశేషాలు : 1) సాధారణంగా ఆకులు చెట్టుకు పైగా ఉంటాయి కాబట్టి వాటిని కేశములుగా చెప్పటం జరిగింది. 2) మానవులు మొదలైన జీవులందరూ తమ తమ కర్మలనే తాళ్లతో బంధింపబడి ఉంటారు కనుక వారు పశువులు. వారందరికి పతి పశూనాం పతి.

03 నమస్సస్పింజరాయ త్విషీమతే పథీనాం పతయే నమః ।

नमस्सस्पिञ्जराय त्विषीमते पथीनं पतये नमः ।

ప్రతిపదార్థము : సస్పింజరాయ = ఎఱుపు మించిన పసుపురంగు కలిగిన, త్విషీమతే = ప్రకాశించెడు జ్ఞానము కలిగిన, పథీనాం = వైదిక, తాంత్రిక మార్గములకు, పతయే = అధిపతివైన ఓ పరమేశ్వరా!, నమః = నమస్కారము.

విశేషాలు : 1) సస్పి అనగా లేత గడ్డి. దాని రంగు పసుపు, ఎఱుపు రంగులతో కలిసి ఉంటుంది. 2) రెండు మార్గాలకు అధిపతి శివుడైనప్పటికీ వైదిక మార్గాన్ని అనుసరించిన వారు, తాంత్రిక మార్గాన్ని అనుసరించకూడదని హితోక్తి.

04 **నమో బభ్లుశాయ వివ్యాధినేఽన్నానాం పతయే నమః ।**

नमो बभ्लुशाय विव्याधिनेन्नानां पतये नमः ।

ప్రతిపదార్థము : బభ్లుశాయ = వాహనమైన ఎద్దుపై కూర్చుండి, వివ్యాధినే = శత్రువులను బాగా పీడించు, అన్నానాం పతయే = అన్నములైన ఓషధులను పరిపాలించు ప్రభువయిన శివునకు నమస్కారము.

వాహనమైన ఎద్దుపై కూర్చుండి, శత్రువులను బాగా పీడించు, అన్నములైన ఓషధులను పరిపాలించు ప్రభువయిన శివునకు నమస్కారము.

విశేషాలు : స్కంద పురాణంలో ధర్మము ఎద్దుగా చెప్పబడింది.

05 **నమో హరికేశాయోపవీతినే పుష్టానాం పతయే నమః ।**

नमो हरिकेशायोपवीतिने पुष्टानां पतये नमः ।

ప్రతిపదార్థము : హరికేశాయ = నల్లని జుత్తు కలిగిన, ఉపవీతినే = శుభకరమైన యజ్ఞోపవీతమును ధరించిన, పుష్టానాం పతయే = జ్ఞానము మొదలైన పదిగుణములతో పరిపుష్టులైన వారికి స్వామియైన పరమశివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము : నల్లని జుత్తు కలిగిన శుభకరమైన యజ్ఞోపవీతమును ధరించిన, జ్ఞానము మొదలైన పదిగుణములతో పరిపుష్టులైన వారికి, స్వామియైన పరమశివునకు నమస్కారము.

విశేషాలు : 1) వాక్కు, 2) జ్ఞానము, 3) ఇంద్రియాలు, 4) ఇల్లు, పొలాలు, 5) ధనధాన్యాలు, 6) సంతానము, 7) జంతువులు, 8) గ్రామము, 9) ధర్మము, 10) అణిమాది సిద్ధులు – వీటితో పరిపుష్టులైన వారు అంటే శివుని అనుగ్రహంతో ఈ పుష్టులు లభిస్తాయని ఈ నమక మంత్రం లోని అర్థం.

06 **నమో భవస్య హేత్యై జగతాం పతయే నమః ।**

नमो भवस्य हेत्यै जगतां पतये नमः ।

ప్రతిపదార్థము : భవస్య = ఈ సంసార బంధములను, హేత్యై = నరికివేసే కత్తి లాంటి వాడివయిన శివునకు, నమో = నమస్కారము, జగతాం పతయే = ప్రపంచానికి ప్రభువయిన శివునకు, నమః = నమస్కారము.

విశేషాలు : 1) సంసార వృక్షానికి ఛేదకుడు శివుడు. అనగా సంసార బంధములు శివుని దయతో తొలగుతాయని భావం. 2) స్వామి ఆధిపత్యము, మరియూ ముక్తినిచ్చే శక్తి సామర్థ్యాలు జగతాంపతయే – (ప్రపంచమునకు ప్రభువు) అను సంబోధనలో చెప్పబడినవి.

07 **నమో రుద్రాయాఽఽతతావినే క్షేత్రాణాం పతయే నమః ।**

नमो रुद्रायाततताविने क्षेत्राणां पतये नमः।

ప్రతిపదార్థము : ఆతతావినే = విస్తరింపబడిన ధనుస్సులతో రక్షించు, రుద్రాయ = సంసార బంధములను తొలగించే రుద్రునకు, నమః = నమస్కారము, క్షేత్రాణాం పతయే = శరీరములకు - పుణ్యక్షేత్రములకు పరిపాలకుడైన శివునకు, నమః = నమస్కారము.

తాత్పర్యము : విస్తరింపబడిన ధనుస్సులతో లోకములను రక్షించు రుద్రునకు నమస్కారము. శరీరములకు - పుణ్యక్షేత్రాలకు పరిపాలకుడైన శివునకు నమస్కారము.

08 **నమస్సూతాయాఽహంత్యాయ వనానాం పతయే నమః ।**

नमस्सूतायाहन्त्याय वनानां पतये नमः ।

ప్రతిపదార్థము : సూతాయ = సారథియైన వానికి, అహంత్యాయ = సంహరించుటకు శక్యము కానివానికి, వనానాం పతయే = అరణ్యముల పరిపాలకునికి, నమః = నమస్కారము.

సారథికి, సంహరించుటకు శక్యము కానివానికి, అరణ్యముల పరిపాలకుడైన పరమశివునికి నమస్కారము.

విశేషాలు : ఇక్కడ సారథి అంటే శివుడు ప్రపంచానికి సారథి అని అర్థం చేసుకోవాలి.

09 **నమో రోహితాయ స్థపతయే వృక్షాణాం పతయే నమః**

नमो रोहिताय स्थपतये वृक्षाणां पतये नमः ।

ప్రతిపదార్థము : రోహితాయ = ఎఱుపు వర్ణము కలిగినవాడు, స్థపతయే = శ్రేష్ఠుడును (ప్రతిచోట ఉండేవాడును, రక్షకుడును), వృక్షాణాం పతయే = చెట్లకు అధిపతియైన శివునకు, నమో = నమస్కారము.

ఎఱువు వర్ణము కలిగినవాడు, శ్రేష్ఠుడును, ప్రతిచోట ఉండేవాడును, రక్షకుడును, చెట్లకు అధిపతియైన శివునకు నమస్కారము.

10 **నమో మంత్రిణే వాణిజాయ కక్షాణాం పతయే నమః ।**

नमो मन्त्रिणे वाणिजाय कक्षाणां पतये नमः ।

ప్రతిపదార్థము : నమో మంత్రిణే = ఏడు కోట్ల మహామంత్రములకు, ఉపనిషత్తులకు అధిపతియు, వాణిజాయ = వర్తకునివలె అన్ని ప్రాంతములలోని రహస్యములు తెలిసినవాడు, కక్షాణాం పతయే = ఎక్కుటకు, దిగుటకు కష్ట సాధ్యములైన పర్వతములకు, నదులకు ప్రభువయిన శివునకు, నమః = నమస్కారము.

ఏడు కోట్ల మహామంత్రములకు, ఉపనిషత్తులకు అధిపతియు, వర్తకునివలె అన్ని ప్రాంతములలోని రహస్యములు తెలిసినవాడు, ఎక్కుటకు, దిగుటకు కష్ట సాధ్యములైన పర్వతములకు, నదులకు ప్రభువయిన శివునకు నమస్కారము.

11 **నమో భువంతయే వారివస్కృతాయౌషధీనాం పతయే నమః ।**

नमो भुवन्तये वारिवस्कृतायौषधीनां पतये नमः ।

ప్రతిపదార్థము : భువంతే = భూమిని విస్తరించు (కాపాడు) శివునకు, వారివస్కృతా = భక్తుల శరీరములలో నివాసమున్నట్టి రుద్రునకు (ధనమును రక్షించు రుద్రునకు), ఓషధీనాం పతయే = ఓషధులకు ప్రభువగు (చెట్లను రక్షించు) శివునకు, నమః = నమస్కారము.

భూమిని విస్తరించు శివునకు, భక్తుల శరీరములలో నివాసమున్నట్టి రుద్రునకు (ధనమును రక్షించు) ఓషధులకు ప్రభువగు (చెట్లను రక్షించు) శివునకు నమస్కారము.

12 **నమ ఉచ్చైర్ఘోషాయాక్రందయతే పత్తీనాం పతయే నమః ।**

नम उच्चैर्घोषायाक्रन्दयते पत्तीनां पतये नमः ।

ప్రతిపదార్థము : నమ = నమస్కారము, ఉచ్చైర్ఘోషాయ = యుద్ధరంగములో పెద్దగా ధ్వని చేసే వానికి, ఆక్రందయతే = శత్రువులను ఏడిపించి సంహరించువానికి, పత్తీనాం పతయే = పాదచారులైన యోధులకు నాయకునికి, నమః = నమస్కారము.

యుద్ధ సమయమున మహోన్నత ధ్వనిగా కల శివునకు నమస్కారము. శత్రువుల నేడిపించు శివునకు నమస్కారము. పాదచారులైన యోధులకు పాలకుడైన రుద్రునకు నమస్కారము.

13 **నమః కృత్స్నవీతాయ ధావతే సత్వనాం పతయే నమః ।**

नमः कृत्स्नवीताय धावते सत्वनां पतये नमः ।

ప్రతిపదార్థము : కృత్స్న వీతాయ = అన్నిచోట్ల వ్యాపించిన వానికి, ధావతే = భక్తులను రక్షించుట కొరకు పరుగులిడువానికి, సత్వనాం పతయే = ధర్మమును ఆచరించువారి ప్రభువైన శివునకు, నమః = నమస్కారము.

అన్నిచోట్ల వ్యాపించిన వానికి, భక్తులను రక్షించుట కొరకు పరుగులిడువానికి, ధర్మమును ఆచరించువారి ప్రభువైన శివునకు నమస్కారము.

నమకములోని రెండవ అనువాకము (వేదభాగము) సమాప్తము. ✦...(సశేషం)

కుపుత్రుడు

- మల్లాది హనుమంతరావు, హైదరాబాదు.

శ్లో॥ విధేరజ్ఞానేన ద్రవిణ విరహేణాలసతయా
విధేయాశక్యత్వాత్ తవ చరణయోః యా చ్యుతిరభూత్ ।
తదేతత్ క్షంతవ్యం జనని సకలోద్ధారిణి శివే
కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి ॥

జనని! సకలోద్ధారిణి! శివే – తల్లీ, ఎల్లరను తరింపజేయగలదానా, సర్వమంగళా!

విధేః అజ్ఞానేన – నీ పూజావిధుల గురించి అజ్ఞానం వల్ల ఎరగకపోవటం చేత,

ద్రవిణ విరహేణ – (పూజాసామగ్రి ఏర్పరచేందుకు) ధనం లేకపోవటం చేత,

అలసతయా – సోమరితనం చేత,

విధేయ అశక్యత్వాత్ – చేయవలసినది చేయటంలో అశక్తతచేత,

తవ చరణయోః – నీ పాదాలకు

యా చ్యుతి రభూత్ – ఏదయితే లోటు (పొరపాటు) జరిగిందో

తదేతత్ క్షంతవ్యం – అటువంటి దానినల్లా, క్షమించవలసింది

కుపుత్రో జాయేత, క్వచిత్ అపి కుమాతా న భవతి – చెడుపుత్రుడు పుట్టవచ్చు, ఎప్పటికీ కూడా చెడ్డ తల్లి ఉండబోదు. **ఇది శంకరుల దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రంలో రెండో శ్లోకం.** ఇందులో చెప్పిన తప్పులన్నీ సామాన్య మానవుల పూజలలో దొర్లేవే. వీటికి క్షమాపణ కోరటం కంటే ఏం చేయగలం?

దేవికి మనమందరమూ సంతానం. తనను గౌరవించే విషయంలో, తగిన మర్యాదలు జరిపే విషయంలో, కొడుకు తెలిసో తెలియకో ఏవయినా పొరపాట్లు చేస్తే, వాటికి తల్లి ఎప్పుడయినా కోపిస్తుందా? పైగా వాటి గురించి చిత్తశుద్ధితో క్షమాపణ చెప్పుకుంటే, తప్పు క్షమించని తల్లి ఉండదు.

కొడుకు ఎంత దుర్మార్గుడయినా, కొడుకు పట్ల నిర్దయగా, క్రూరంగా ఉండటం తల్లికి ఎలా సాధ్యమవుతుంది? తప్పొప్పుకుని, కాళ్ళమీద పడి వేడుకొంటే జగజ్జనని కరిగిపోయి, కరుణ చూపకుండ ఉండటం అసంభవం. ✦ .... (సశేషం)

ఈ నెల స్థలాభావం వల్ల వృక్షరాజము ప్రచురించలేకపోవుచున్నాము. – సంపాదకుడు



Gold Nuggets

- Osho

ఆణిముత్యాలు

– సౌభాగ్య, హైదరాబాద్

వినడానికి తెలిసిన మనిషే ధ్యానం చెయ్యడం తెలిసిన మనిషి. అట్లాగే ధ్యానం చెయ్యడం తెలిసిన మనిషికే వినడం కూడా తెలిసివుంటుంది.

✦ ✦ ✦

అధికారదాహం వున్న మనుషులు మానసిక అనారోగ్యం వున్నవాళ్ళు. ఆత్మన్యూనతా భావంతో వాళ్ళు బాధపడుతూ వుంటారు. వాళ్ళ లోపల ఏదో గాయం వున్నట్లు వాళ్ళు అనుభూతి చెందుతారు. వాళ్ళు అధికారాన్ని ఎందుకు ఆశిస్తారంటే దానివల్ల తమ వునికిని చాటుకోడానికి చేసే తాపత్రయమది. తాము అసాధారణమైన వాళ్ళని యితరులని అంగీకరిపం జేసే ప్రయత్నమది.

అసాధారణంగా వుండాలని ఎవడు కోరుకోడో అతన్ది మాత్రమే అసాధారణమయిన కోరిక. సాధారణ తత్వంతో అతను విశ్రాంతిగా వుంటాడు.

✦ ✦ ✦

నేను ఖచ్చితంగా హంతకుణ్ణి.

యింకా నేను ఏ పనీ చేయను. కాబట్టి నేనొక వింత తరగతికి చెందిన హంతకుణ్ణి. నేనొక దీప శిఖలాంటివాణ్ణి. పురుగులు అక్కడికి వచ్చి నృత్యం చేస్తాయి. వాటంతట అవే మరణిస్తాయి. దీపం ఏమీ చెయ్యదు. కానీ చంపుతుంది.

గురువు చేసే పని అట్లాంటి శక్తిని, ఆకర్షణని సృష్టించడం. నువ్వు మెల్లగా గురువు వైపు సాగి అదృశ్యమయిపోతావు. అస్తిత్వంలో భాగమవుతావు. దాన్నే నిజమైన మరణ మనవచ్చు.

✦ ✦ ✦

ప్రతి సత్యానికీ తీపి పూత అవసరం. లేకుంటే దాన్ని మీరు మింగలేరు.

బుద్ధుడు 'నువ్వు నీ లోపలి కేంద్రానికి చేరితే నువ్వు అదృశ్యమవుతావు' అన్నాడు. 'అనాత్మ' 'అనాత్త' ఆత్మ లేదు, అస్తిత్వం లేదు, నువ్వు కేవలం శూన్యానివి. శూన్యం అనంత శూన్యంలో లీనమవుతుంది.

ఎవడు శూన్యం కావాలనుకుంటాడు? జనం అనంత ఆనంద అన్వేషణలో వుంటారు.

వాళ్ళు అలసిపోయి వుంటారు. కష్టాలు పడుతుంటారు. ఆగ్రహంలో వుంటారు. అన్ని రకాల బాధల్లో అల్లకల్లోలమై వుంటారు. గురువు దగ్గరికొస్తారు. గురువు 'దీనికి పరిష్కారం శూన్యం కావడమే, అంటారు. వేరే మాటల్లో చెప్పాలంటే రోగి చస్తే రోగం మాయమవుతుంది. నువ్వు ఆరోగ్యం బాగుపడాలని వచ్చావే కానీ చావాలని కాదు కదా!

ఐదు వందల ఏళ్ళలో ప్రపంచం నుంచి మతం మాయమవుతుంది. కారణం జనాలకి దాంట్లో ఆకర్షణ కనిపించడం లేదు. నగ్న సత్యాన్ని ఎవడు యిష్టపడతాడు?

నేను ఆనందం గురించి చెబుతాను. పరవశం గురించి చెబుతాను. అది అర్థవంత మనిపిస్తే మీరు రోజుకు ఓ గంట నిశ్శబ్దంగా కూర్చోండి. మీలో వేల పద్మాలు వికసిస్తాయి. వేల సూర్యోదయాలవుతాయి. ఇరవైనాలుగు గంటల గుండా ఆ గంట కాలం ప్రయాణిస్తుంది.

కాని సత్యం అంటే పద్మాలుండవు, సూర్యులుండరు. కేవలం స్వచ్ఛమైన శూన్యముంటుంది.

✦ ✦ ✦

సత్యానికి ఫిఫ్టీ, ఫిఫ్టీ అంటే తెలీదు.

అది వంద శాతం స్వచ్ఛంగా వుంటుంది. లేకుంటే అది అబద్ధం కన్నా దారుణంగా వుంటుంది.

✦ ✦ ✦

ఒకవైపు శూన్యాన్ని పెట్టి యింకోవైపు నరకాన్ని పెడితే జనం నరకం వైపే వెళతారు. అక్కడ కనీసం ఒక రెస్టారెంటో, డిస్కోనో వుంటుంది. మంచి వాళ్ళంతా అటే వెళతారు. కేవలం బక్కచిక్కిన సంన్యాసులు, బతుకు పట్ల ఆసక్తి లేనివాళ్ళు మాత్రమే 'స్వర్గానికి' వెళతారు. రసవంతమయిన జీవితాన్ని గడిపే కవులు, చిత్రకారులు, నాట్యకారులు. నటులు, సంగీతకారులు వాళ్ళంతా నరకానికే వెళతారు.

కాబట్టి శూన్యాన్ని లేదా నరకాన్ని ఎన్నుకోమంటే తెలివైనవాళ్ళు నరకానికే వెళతారు. మరి శూన్యం సంగతి? నరకం నించి ఎప్పుడయినా బయట పడి స్వర్గానికి వెళ్ళే వీలుంటుంది. మరి శూన్యం? ఏమీ మిగల్దు. కనీసం జిరాక్స్ కాపీ కూడా వుండదు. శాశ్వతంగా వెళ్ళిపోవడమే వుంటుంది.

✦ ✦ ✦

ప్రపంచవ్యాప్తంగా జనాన్ని ధ్యానం చెయ్యమంటే వెంటనే 'దేనిమీద?' అని అడుగుతారు. ఎందుకంటే క్రియాత్మకంగా ధ్యానం చర్యను వుద్దేశిస్తుంది. దేనిమీద ధ్యానం చెయ్యాలి? ధ్యానం నిలపడానికి ఏమీ లేనపుడే ధ్యానం మొదలవుతుంది. కేవలం చైతన్యం, స్పృహ వున్నప్పుడు నువ్వు ఏకాగ్రత నిలపడానికి ఏమీ వుండదు.

✦ ✦ ✦ ✦ .... (సశేషం)

DIFFICULTIES

Difficulties are always there. They are part of life.

And it is good that they are there, otherwise there would be no growth.

Difficulties are challenges. They provoke you to work, to think, to find ways to overcome them. The very effort is essential. So always take difficulties as blessings.

Without difficulties, we would be nowhere. Bigger difficulties come—that means that existence is looking after you, it is giving you more challenges. And the more you solve them, the greater challenges will be waiting for you. Only at the last moment, difficulties disappear, but that last moment comes only because of difficulties. So never take any difficulty negatively. Find something positive in it. The same rock blocking the path can function as a stepping stone. If there were no rock on the path, you would never rise up. And the very process of going above it, making it a stepping stone, gives you a new altitude of being. So once you think about life creatively, then everything is useful and everything has something to give you. Nothing is meaningless.



గ్రంథపరిచయము

ప్రతాప శాయి

శ్రీ హనుమచ్చరితామృతము

రచయిత : అవ్వారి గోపాలకృష్ణమూర్తి శాస్త్రి   వెల : 250/-

ఈ గ్రంథములు కావలసినవారు సంప్రదించవలసని చిరునామా :

1. అవ్వారు దీక్షితులు (అవ్వారు వెంకట హనుమదీక్షితులు),
   వరగాని పోస్టు - 522235, గుంటూరు జిల్లా. సెల్ నెం: 9010480721
2. అవ్వారి శ్రీరామాంజనేయులు, విజయలక్ష్మి ట్రేడర్స్,
   10-6-1, రైల్వే స్టేషన్ వద్ద, కావలి-524201, నెల్లూరు జిల్లా.

శ్రీ హనుమచ్చరితామృతము, బ్రహ్మశ్రీ అవ్వారి గోపాలకృష్ణమూర్తిశాస్త్రిగారు (వరగాని) హనుమ భక్తులకు యిచ్చిన కామధేనువు. అక్షర లక్షలు ఏళ్ళ తరబడి ఆహోరాత్రాలు జపములు చేసి, యీ గ్రంథ రచన గావించినారు.

వైకుంఠములో జయ విజయులను సనక, సనందనాది మునులు శపించారు. శ్రీలక్ష్మి నారాయణుడు వారి కోరికపై మూడు జననములు వరంగా యిచ్చాడు. తదుపరి తన సాన్నిధ్యము చేర్చుకున్నాడు. త్వరగా శ్రీహరిని చేరాలి అనే దృఢ సంకల్పముతో సనక సనందనాదులు రాక్షస జన్మలనే కోరుకున్నారు. అలా ప్రవరించారు.

హనుమంతుని జననానికి కారణము : పైన విషయాలు పరిశీలిస్తే, శ్రీహరి తన సుదర్శనముచే హిరణ్యాక్షుడిని, తన చేతులతో హిరణ్యకశిపుని సంహరించాడు. ఇక పులస్త్యబ్రహ్మ సంతానమైన రావణ, కుంభకర్ణులను సంహరించడానికి శ్రీహరి శ్రీరాముడిగా జన్మించాడు. రావణ శివభక్తి వలన తాను ఒక్కడినే సంహరించలేనని శివుని కూడా తోడు రమ్మన్నాడు. అందువల్లనే అంజనాదేవికి వాయుదేవుని వలన శ్రీ హనుమంతులవారు జన్మించడము జరిగినది. ఇతడే ఆంజనేయుడు, వాయుపుత్రుడు. హనుమ అనగా హరిశబ్దము స్ఫురించును. పాపములను హరించువారు. ఈ గ్రంథము ఇంటిలో నున్నచో సకల దేవతలు వున్నట్లుండును. ఈ గ్రంథమునకు ధూప, దీప, నైవేద్యములు పనిలేదు. మంచం మీద పడుకొని కాకుండా (వృద్ధులు, అనారోగులు) కూర్చుని చదివిన విశేష ఫలము లభించును. మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేక ఫలితము కలుగును. అవకాశము కుదిరిన నారద మహర్షి వలె నారాయణా, నారాయణా, అనలేక పోయినను, హనుమ, హనుమ అన్నచో వచ్చి మన చెంత నుండును హనుమ.

సంసార సాగరములో కొట్టుమిట్టాడు భక్తవరులకు యీ గ్రంథ పఠనము చుక్కాని వలె, స్వామిదరికి చేర్చును. ఆరోగ్యము చేకూరును. ఐశ్వర్యము సిద్ధించును. శత్రు భయము

నివారింపబడును. గ్రహ దోషములు నీటి ఆవిరివలె ఎగిరిపోవును.

కర్మభూమి మన భారతదేశము, శాస్త్రిగారు హనుమంతుని నవ అవతారములు, వాటి విశిష్టత వివరించారు. హనుమంతుని జనన కారణం తెలిపారు. సకల దేవతల దీవెనతో విద్యాభ్యాసము చేయుట వలన హనుమ పొందిన శక్తి యుక్తులు యీ గ్రంథంలో చక్కగా వున్నాయి. వారి రచనా శైలి పాఠకులకు సుస్పష్టముగా తెలియుచున్నది. హనుమ యొక్క విరాట్‌రూపమును యీ గ్రంథ పఠనము వలన గ్రహింపవచ్చును.

శ్లో॥ అసాధ్యసాధకస్వామిన్ అసాధ్యం తవ కిం వద ।
రామదూతకృపాసింధో మత్కార్యం సాధయ ప్రభో! ॥

యీ శ్లోకపఠనము అనంత సాగరమును సైతం దాటించును. హనుమ శక్తికి మూల కారణం శ్రీరామనామ నిరంతర పఠనమే. అట్టి స్వామిభక్తి పరాయణుడు అవనిలో ఇక లేరు. తులసీదళ ప్రభావము, శ్రీ జగన్నాథ చరిత్ర (బేడీ ఆంజనేయస్వామివారి మహిమ) యీ గ్రంథంలోనే వున్నది. ఏ పని చేయాలన్నా ప్రజలు మంగళవారమునాడు చేయటానికి జంకుతారు (భయపడతారు). కాని శ్రీ శాస్త్రిగారు మంగళవారమును జయవారముగ వివరించి చెప్పారు. ఈ లోకములో సేవాభావ తత్పరుడు హనుమ. ఈ గ్రంథములో అన్ని సన్నివేశాలు సుగ్రీవరాజ్యప్రాప్తి, రామ సుగ్రీవుల మైత్రి, సీతామాత దర్శనము సందర్భానుసారంగా విస్తృతముగా కథను నడిపినారు.

శ్లో॥ సపీతకౌపీనసముంచితాంజలిం
సముజ్జ్వలం మౌంజ్యజినోపవీతినమ్ ।
సకుండలం లంబశిఖం సువాలం
తం ఆంజనేయం శరణం భజామి ॥

ఈ మహిమాన్వితమైన శ్లోకమును శాస్త్రిగారు చదువరులకు యీ పుస్తకం ద్వారా యిచ్చారు. హనుమంతుని అష్టోత్తర, సహస్రనామ, శ్రీరామదూతం శిరసానమామి, యిలా అనేక రకములైన పూజాదికములు గ్రంథంలో కలవు. హనుమ ప్రవర, సువర్చలా కల్యాణం దీనిలో కలదు. ఋగ్వేదములో నున్న మన్యుసూక్తముతో మన హనుమ స్వామిని ఎందుకు పూజించాలో చక్కగా తెలియచేశారు.

హనుమంతునియొక్క అవతార విశేషాలు, మహిమలు, మైరావణ వధ, తెలిపారు. గంధసింధూరము ఎందుకు వాడాలి, ఎవరు వాడాలి దాని ప్రభావము యీ గ్రంథంలో నున్నవి. ఒక్క మాటలో చెప్పాలంటే భక్త పరాధీనుడు హనుమంతుడు యీ గ్రంథం యింటిలో వున్న సీతాలక్ష్మణ సమేతముగా శ్రీరామచంద్రమూర్తి కొలువై ఉంటారు. హనుమ నిత్యము వారిని సేవిస్తుంటారు. శాస్త్రిగారి మనుమడు తన వివాహ సందర్భమున మొదటి నెల జీతముతో ఈ గ్రంథము ద్వితీయ ముద్రణ గావించినారు.

భక్తులెల్లరు ఈ గ్రంథమును పొంది సుఖింతురు గాక! ✦

प्रदोषस्तोत्रम्

(स्कान्दपुराणान्तर्गतम्)

सत्यं ब्रवीमि परलोकहितं ब्रवीमि
सारं ब्रवीम्युपनिषद्धृदयं ब्रवीमि ।
संसारमुल्बणमसारमवाप्य जन्तोः
सारोऽयमीश्वरपदाम्बुरुहस्य सेवा ॥ १ ॥

ये नार्चयन्ति गिरिशं समये प्रदोषे
ये नार्चितं शिवमपि प्रणमन्ति चान्ये ।
ये तत्कथां श्रुतिपुटैः न पिबन्ति मूढाः
ते जन्मजन्मसु भवन्ति नराः दरिद्राः ॥ २ ॥

ये वै प्रदोषसमये परमेश्वरस्य
कुर्वन्त्यनन्यमनसोऽङ्घ्रिसरोजपूजाम् ।
नित्यं प्रवृद्धधनधान्यकलत्रपुत्र-
सौभाग्यसंपदधिकास्त इहैव लोके ॥ ३ ॥

कैलासशैलभवने त्रिजगज्जनित्रीम्
गौरीं निवेश्य कनकाञ्चितरत्नपीठे ।
नृत्यं विधातुमभिवाञ्छति शूलपाणौ
देवाः प्रदोष समये नु भजन्ति सर्वे ॥ ४ ॥

वाग्देवी धृतवल्लकी शतमखो वेणुं दधत् पद्मजः
तालोन्निद्रकरा रमा भगवती गेयप्रयोगान्विता ।
विष्णुः सान्द्रमृदङ्गवादनपटुः देवाः समन्तात् स्थिताः
सेवन्ते तमनु प्रदोषसमये देवं मृडानीपतिम् ॥ ५ ॥

गन्धर्वयक्षपतगोरगसिद्धसाध्य-
विद्याधरामरवराप्सरसां गणाश्च ।
येऽन्ये त्रिलोकनिलयाः सहभूतवर्गाः
प्राप्ते प्रदोषसमये हरपार्श्वसंस्थाः ॥ ६ ॥

अतः प्रदोषे शिव एक एव
पूज्योऽथ नान्ये हरिपद्मजाद्याः ।
तस्मिन् महेशे विधिनेज्यमाने
सर्वे प्रसीदन्ति सुराधिनाथाः ॥ ७ ॥